ఆదివారం వార్త
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

6-6-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 126 పేజీలు: 16 వెల: 6.50

భారత్‌లో 'ఎయిర్ ట్రంక్' భారీ పెట్టుబడులు 5లో

కొత్త ఉద్యోగాన్ని ప్రారంభిస్తున్నాం: అన్నామలై

కర్ణాటక కేబినెట్‌లో లుకలుకలు 5లో

ఓ మంత్రి రాజీనామా



మోడీ మిత్రుడే.. అయినా సుంకాలు తప్పవు: ట్రంప్ 5లో



రాజ్యసభకు ఖర్గే నామినేషన్ దాఖలు 2లో



బెంగళూరులో రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేస్తున్న ఖర్గే



## స్మార్ట్ సిటీలకు రష్యా చేయూత

సెయింట్ పీటర్స్‌బర్గ్ అధికారులతో మంత్రి లోకేష్ చర్చలు

ఉమ్మడి వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు ఇరుపక్షాల నిర్ణయం

డిజిటల్ విద్య, మౌలిక సదుపాయాలపై ప్రధానంగా దృష్టి

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో సేఫ్ అండ్ స్మార్ట్ సిటీల నిర్వహణ కోసం రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రభుత్వ రీజనల్ ఫారిన్ ఎఫైర్స్ విభాగం చీఫ్ ఎక్స్‌పర్ట్ పోలినా పోలుఖినాతో >>2

## విశాఖలో సీఎం సైకిల్ యాత్ర



**ప్రభాతవార్త-విశాఖపట్నం:** మహావిశాఖలో భగభగమండుతున్న ఎండనూ లెక్కచేయ కుండా సీఎం ఎన్.చంద్రబాబు సైకిల్ తొక్కుతూ మరోసారి తన ఉత్సాహాన్ని >>2

# ఆక్వా గ్లోబల్ హబ్‌గా ఏపి

అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరును కలుపుతూ ఆక్వాకారిడార్

'ఆంధ్రా ష్రింప్, ఇండియా సీఫుడ్' బ్రాండ్ రూపొందిస్తున్నాం

కేంద్ర మత్స్యశాఖ ప్రాంతీయ కార్యాలయానికి 15 రోజుల్లో స్థలం ఇస్తాం: సీఎం చంద్రబాబు

రూ.72 కోట్లతో కాకినాడ పోర్ట్ ఆధునీకరిస్తాం: కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్



శుక్రవారం విశాఖలో జరిగిన సీఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌లో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆక్వా రంగానికి భారతదేశం లైట్ హౌస్‌లా ఉంటే. దానికి ఏపీని కేంద్ర బిందువు చేస్తామన్నారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఆక్వా కారిడార్ అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ కారిడార్లో ఆక్వా అభివృద్ధికి అవసరమైన రీసెర్చ్, ఇన్నో వేషన్, స్టార్టప్స్, టెక్నాలజీని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అతి తక్కువ వ్యయంతో అత్యధిక ఉత్పత్తి సాధిం చడమే లక్ష్యమని చెప్పారు. ఆక్వా ఉత్పత్తులకు సంబంధించిన ఉప ఉత్పత్తులతో కూడా ఆర్థిక ప్రగతి సాధించవచ్చన్నారు. శుక్రవారం విశాఖలో జరిగిన సీఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్ షాప్‌లో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఆంధ్రా ష్రింప్, ఇండియా సీఫుడ్' బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తున్నామని చెప్పారు. ఆక్వా రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన నాలుగు శాఖలకు చెందిన కేంద్ర మంత్రులు ఒకే వేదికపై రావడం శుభపరిణామంగా అభివర్ణించారు. రాష్ట్రంలో మెగా సీఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు 'రూ.72 కోట్లతో కాకినాడ పోర్ట్ మోడ్రనైజేషన్ చేపడతామని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రక టించినందుకు సంతోషమని సీఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. కేంద్ర మత్స్యశాఖకు ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15రోజుల్లో కేటాయిస్తామన్నారు. నెల రోజుల్లో కార్యాలయానికి శంకుస్థాపన చేసి నిర్మాణం ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతున్నా >>2

## జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్



నేడు నామినేషన్

**విజయవాడ,జూన్ 5,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్ పేరు ఖరారైంది. పార్టీ ముఖ్యనేతలతో జరిగిన సమావేశంలో అధినేత పవన్ కల్యాణ్ కొన్ని అభిప్రాయాలు పంచుకున్నారు. కష్టసమయంలోనూ పార్టీని వీడకుండా జనసేనతో ఉన్నవారికే పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని నేతలతో అన్నారు. ఇప్పటివరకు కేటాయించిన పదవులు పార్టీ పట్ల అంకితభావంతో ఉన్నవారికే ఇచ్చామని తెలిపారు. ముమ్ముందు పదవుల కేటాయింపులోనూ ఇదే వర్తిస్తుందని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. లింగమనేని రమేష్ పార్టీకి అధికారంలో ఉన్నా లేకున్నా వెన్నంటి ఉన్నారని పవన్ సమావేశంలో పవన్ ప్రస్తావించారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యానే పవన్ ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు అభ్యంతరం లేదని సమావేశంలో పాల్గొన్న నేతలు తెలిపినట్లు సమాచారం. దీంతో లింగమనేని రమేష్ పేరు ఖరారైనట్లు >>2

# నాటిన మొక్కలు రక్షించండి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారీ ప్రక్రియకు శ్రీకారం

స్వయంగా విత్తన బంతులు తయారు చేసిన డి.సిఎం పవన్

డ్రోన్ల ద్వారా వెదజల్లిన సీడ్‌బాల్స్



శుక్రవారం మూలపాడులో విద్యార్థినిలతో కలిసి సీడ్‌బాల్స్ తయారు చేస్తున్న డి.సిఎం పవన్

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాదు, వాటిని సంరక్షించడం కీలకమన్నారు. పర్యావరణ దినోత్సవంలో భాగంగా చేపట్టిన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి సమీపంలోని మూలపాడు బటర్‌ఫ్లైపార్కుకు పవన్ కల్యాణ్ వచ్చారు. సీడ్ బాల్స్ తయారు చేసే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. విద్యార్థులు, మూలపాడు గ్రామస్థులతో కలిసి సీడ్ బాల్స్ తయారీ ప్రక్రియలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 ప్రాంతాల్లో విస్తృతంగా సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూలపాడు బటర్ ఫ్లైపార్క్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని పవన్ కల్యాణ్ వీక్షించారు. సీడ్ బాల్స్ తయారీ ప్రక్రియలో పాల్గొన్న ప్రజలతో ముచ్చటించారు. ఏ ఏ విత్తనాలతో సీడ్ బాల్స్ తయారు చేస్తున్నారు? ఎంత మొత్తంలో రూపొందిస్తున్నారు? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రతి సీడ్ బాల్‌కు ఒక చెట్టును సృష్టించగలిగే శక్తి ఉంటుందన్నారు. ప్రతి చెట్టు వాతావరణ మార్పుల ప్రభావం నుంచి భూమిని కాపాడుతుంది. సీడ్ బాల్స్‌ను అడవులు, కొండ ప్రాంతాలు, నదీతీరాల్లో వెదజల్లే ఏర్పాటు చేస్తున్నాన్నారు. మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో డ్రోన్ సాయంతో సీడ్ బాల్స్‌ను జల్లుతామన్నారు. మొక్కలు >>2

## వైసిపి మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అరెస్టు



నకిలీ జీవోలతో హైదరాబాద్ గండిపేటలో పదెకరాల సర్కార్ భూమి కాజేసే కుట్ర

ఇప్పటికే ఐదుగురు అరెస్టు

పరారైన మాజీ ఎమ్మెల్యేను కాంచీపురంలో అరెస్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** హైదరాబాద్ శివార్లలోని గండిపేట్ మండలంలో గల పదెకరాల ప్రభుత్వ భూమిని సొంతం చేసుకునేందుకు నకిలీ పత్రాలు, నకిలీ జిఓలు సృష్టించిన కేసులో ఎపిలోని వినుకొండకు చెందిన వైకాపా మాజీ ఎంఎల్ఎ బొల్లా బ్రహ్మనాయుడు అరెస్టయ్యారు. తమిళనాడులోని కాంచీపురంలో ఆయనను సైబరాబాద్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి అక్కడి కోర్టులో హాజరు పరిచి ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తర లిస్తున్నారు. గత నెల 23వ తేదీన వెలుగు చూసిన ఈ కేసులో మొదట ముగ్గురు నేరగాళ్లు అరెస్టవగా ఆ తరువాత మరో ఇద్దరు పట్టుబడ్డారు. అయితే ఈ కేసులో అసలు నిందితుడు బొల్లా బ్రహ్మనాయుడు పారిపోగా ఆయన కోసం సైబ రాబాద్ పోలీసులు ఎపిలోని పలుచోట్ల గాలిం చిన ప్రయోజనం లేకుండా పోయింది. అయితే బ్రహ్మనాయుడు తమిళనాడు పారిపోయి కాంచీపురంలో తలదాచుకున్నట్లు సమాచారం అందు కున్న సైబరాబాద్ పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో ఒక హోటల్‌లో ఉండగా పట్టుకు న్నారు. గండిపేట్ మండలంలోని సర్వే నంబర్ 18లో గల పదెకరాల సర్కారు భూమిని కాజేసేం దుకు బ్రహ్మనాయుడు తనకు తెలిసిన న్యాయ వాదులు, రియల్టర్ల సహాయంతో తప్పుడు పత్రాలతో పాటు నకిలీ జిఓలు సృష్టించడం తెలిసిందే. అనంతరం ఐదువందల కోట్ల రూపాయలకు పైగా విలువచేసే ఈ భూమి తనదంటూ బోర్డులు పాతేందుకు యత్నించి, ఏకంగా మరో వ్యక్తికి అమ్మేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై గండిపేట్ తహసీల్దార్ నార్సింగి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గతనెల 23వతేదీన కేసు నమోదయ్యింది. దీని తరువాత కేసును విచారించగా బ్రహ్మనాయుడు ఈ గోల్‌మాల్ వ్యవహారానికి సూత్రధారిగా తేలింది. నకిలీ పత్రాలు, నకిలీ జిఓల తయారీకి బ్రహ్మనాయుడు తన >>2

## నేటి నుంచి 'యోగాంధ్ర' రిజిస్ట్రేషన్లు ఆరంభం



వైద్యారోగ్య శాఖలో ప్రత్యేకంగా వార్‌రూమ్

యోగా మాస్టర్ల ద్వారా 2.5లక్షల మందికి శిక్షణ

లేపాక్షి ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం

**విజయవాడ, జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ 12వ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 7 నుంచి 21 వరకు ప్రత్యేక యోగా కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో కలిపి కోటి మందిని యోగాసనాల కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా 'యోగాంధ్ర2026' పోర్టల్ ద్వారా శనివారం నుంచి రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. రాష్ట్రం లోని గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ఈ రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఆయుష్ శాఖకు చెందిన అధికారులను ప్రతి జిల్లాకు ఒక నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,600 యోగా మాస్టర్ ట్రైనర్ల ద్వారా 2.5 లక్షల మందికి యోగాసనాలపై శిక్షణా కార్యక్రమాలు జరగబోతున్నాయి. జిల్లా కేంద్రం నుంచి మండల స్థాయి వరకు జరిగే ఈ శిక్షణా కార్యక్రమాలు మూడు రోజులపాటు జరుగు తాయి. ఒక్కొక్క యోగా మాస్టర్ కనీసం 50 మంది ట్రైనర్ల కు శిక్షణ ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. వీరు మిగిలివారిచే యోగాసనాలపై శిక్షణ ఇస్తారు. అలాగే ఈ నెల 7నుంచి 20వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో కలిపి 56 కార్యక్రమాలు జరిపే విధంగా వైద్య ఆరోగ్యశాఖ, ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ నెల21న రాష్ట్ర స్థాయి కార్యక్రమం >>2

# తిరుమలలో భక్తుల క్రమబద్ధీకరణ భేష్

ఎఐ ఆధారిత సేవలు బాగున్నాయి

కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కేంద్రమంత్రి పీయూష్ గోయెల్



**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** గోవిందా గోవింద నామంతో తిరుమలకు వస్తున్న పెద్ద సంఖ్యలో భక్తులకు సత్వర దర్శనం, వసతి సేవలందించడంలో నిత్యం పర్యవేక్షణ చేస్తున్న కృత్రిమ మేధస్సు(ఎఐ)ఆధారిత కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు అద్భుతంగా ఉందని కేంద్ర వాణిజ్యపరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్ తెలిపారు. ఈ కేంద్రం నుండి అధికారులు, సిబ్బంది భక్తుల క్యూలైన్లు, వైకుంఠమ్ క్యూ కాంప్లెక్స్ కంపార్టుమెంట్లు, ఆలయం పరిసరాలు, తిరుమల ఘాట్‌రోడ్లులో పరిస్థితి పర్యవేక్షిస్తూ తీసుకుంటున్న చర్యలు బావున్నాయని గోయల్ కితాబిచ్చారు. వైకుంఠం1 క్యూ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి) ద్వారా వసతి గదుల ఆక్యుపెన్సీ వివరాలు, భక్తుల రాకపోకలు, దర్శన క్యూలైన్లు, లడ్డూ ప్రసాదాల పంపిణీ వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వల్ల భక్తులకు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని చెప్పారు. ఈ కేంద్రం ద్వారా గదుల లభ్యత, వివిధ కంపార్ట్మెంట్లలో వేచి ఉన్న భక్తుల సంఖ్య,గంటల వారీగా తిరుమలకు చేరుకుంటున్న భక్తుల వివరాలు, లడ్డూ ప్రసాదాల పంపిణీ సమాచారం >>2



## లోయలో పడిన టెంపో

మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లో ఘోర ప్రమాదం

25మంది టూరిస్టులకు గాయాలు

ఇద్దరి పరిస్థితి విషమం

**చింతూరు, జూన్ 5 ప్రభాతవార్త:** చింతూరు మారేడుమిల్లి ఘాట్‌రోడ్డులో శనివారం మిట్ట మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 25 మంది టూరిస్టులతో ప్రయాణం చేస్తున్న టెంపో వాహనం అదుపుతప్పి లోయలోకి పల్టీలు కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న టూరిస్టులకు తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో చింతూరు >>2



శుక్రవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా విజయవాడలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మంత్రులు అనిత, సవిత, నిమ్మల

# ఆక్వా గ్లోబల్ హబ్‌గా ఏపి

>> నన్నారు. ఆక్వా ఉత్పత్తులను మరింత పెద్ద స్థాయిలో ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రం తీసుకునే చర్యలకు రాష్ట్రం వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. మెగా సీఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పా టుకు కేంద్రం సహకరిస్తామని ఇప్పటికే చెప్పిందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలు చేరుకోవడానికి బ్లూ ఎకానమీ ఎంతో కీలకమని, పాండ్ టు పోర్టు, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్, బ్లూ ఎకానమీ టు వికసిత్ భారత్ అనే విధానంతో పని చేయాలన్నారు. భారత ఆశలను, ఆశ యాలను నెరవేర్చేందుకు ఏపీ బ్లూ ఎకానమీ దోహ దపడు తుందని భావిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే సీఫుడ్ బిజినెస్‌లో ఇండియా వాటా కేవలం 5శాతం మాత్రమే ఉందని, ఈ రంగంలో ఇండియాకు పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి.' అని ముఖ్య మంత్రి అన్నారు. ఏటా రూ.28,000 కోట్ల ఎగుమతులు'భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదే. బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్న చోట నాగరికతలు విలసిల్లుతాయని, ఏపీలో గోదా వరి, కృష్ణ వంటి జీవ నదులు ఉన్నాయని సీఎం చంద్రబాబు వివరించారు. సీఫుడ్ ఉత్పత్తిలో ఏపీ రెండో అతి పెద్ద రాష్ట్రం. 197 లక్షల మెట్రిక్ టన్నుల సీఫుడ్ ఉత్పత్తి ఏపీలో జరుగుతోంది. ఏపీలో బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతికి దోహద పడుతుందన్నారు. భారతదేశం మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28శాతంగా ఉందన్నారు. భారతదేశం మొత్తం రొయ్యల ఉత్పత్తిలో ఏపీ షేర్ 66 శాత మని, భారతదేశం మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో దాదాపు ఏపీ నుంచే 38 శాతం ఆదాయం వస్తోందన్నారు.ప్రధాని మోదీని మరింత బలపరుద్దాం ఆక్వా పరిశ్రమలో ఇన్నోవేషన్లు చేసే వారిని ఆంధ్రప్రదేశ్ ఆహ్వానిస్తోందని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ఏపీ పని చేస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడితే.. ఆ పెట్టుబడులకు ప్రోత్సా హమిచ్చి, అభివృద్ధి చేస్తాం. ఆక్వా ఉత్పత్తులతో చక్కటి ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రజలు ఇప్పుడు ప్రొటీన్ ఉత్పత్తులనే ఆహారంగా తీసుకుంటున్నారు. ఆక్వా ఉత్పత్తుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉం టుందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. సరైన సమయంలో సరైన నేత నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండటం అదృష్టమని, 21వ శతాబ్దం నరేంద్ర మోదీదే అని తెలిపారు. భవిష్యత్తులో భారత దేశాన్ని అగ్ర భాగంలో నిలపడానికి ప్రధాని మోదీ అద్భుతంగా పని చేస్తున్నారన్నారు. ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న మోదీని మరింత బలపర్చాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు. కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఉత్పత్తులుఆక్వా రంగం అభివృద్ధిపై కేంద్ర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆక్వా రంగం విషయంలో కేంద్ర ప్రభుత్వం సంక్షోభం నుంచి అవకాశాలను అన్వేషిస్తోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు. అమెరికా టారిఫ్‌లు విధించినప్పటికీ గతేడాది కంటే మిన్నగా ఆక్వా ఎగుమతులు చేసుకోగలిగామని, అంతర్జాతీయంగా కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఎగుమతులు వెళ్లా యన్నారు. ఇప్పుడు మన ఆక్వా ఉత్పత్తులకు మరిన్ని మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆక్వా ఎగుమతులతో ఆర్థికాభివృద్ధితో పాటు మత్స్యకారులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. మోడ్రనైజ్డ్ బోట్లను మత్స్యకారులకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని, 200 మోడ్రనైజ్డ్ బోట్లు ఏపీకి వస్తున్నాయని చెప్పారు. ప్రజల ఆహార అలవాట్లు మారాయని, ప్రొటీన్ ఆహారాన్ని అధికంగా తీసుకుంటున్నారని, దీంతో ప్రొటీన్ ఎక్కువ ఉండటం వల్ల ఆక్వా ఉత్పత్తులకు రోజు రోజుకూ డిమాండ్ పెరుగుతోందన్నారు. ఆక్వాలో కేవలం 12 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేస్తున్నాం... సీ ఫుడ్ ప్రాసెసింగ్ విషయంలో మరింత అభివృద్ధి చేయాలి. ఆక్వాలో టెక్నాలజీ, ఇన్నోవేషన్లకు పెద్ద పీట వేయాలి. వ్యవసాయంతో పోల్చుకుంటే ఆక్వాలో ఎక్కువ అభివృద్ధి కనిపిస్తోంది. ఆక్వాకు రూ.1.50కే విద్యుత్ ఇస్తున్నాం. ఫిష్ ఫీడ్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఫిష్ మీల్ ఎగుమతులను 50 శాతానికి పరిమితం చేయాలని కోరుతున్నాం. సోయా విషయంలోనూ కేంద్రం నుంచి సహకారం అవసరం. ఇతర దేశాలతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లు జరగాల్సి ఉంది. దీనికి కేంద్రం ఇప్పటికే సహకరి స్తోంది. ప్రపంచంలోని ప్రతీ కిచెన్‌లోకి ఇండియన్ ఆక్వా ఉత్పత్తులు వెళ్లేలా కేంద్రం ప్రణాళికలు రూపొందించడం సంతోషంగా ఉంది.'అని అన్నారు. 'పీఎంఎంకేఎస్ఎస్‌వై పథకాన్ని ఏపీలో అమలు చేస్తాన్నారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం, ఏడాది 30 బిలియన్ యూఎస్ డాలర్ల విలువైన ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వ లక్ష్యం పెట్టుకుంది. కేంద్రం నిర్దేశిం చుకున్న లక్ష్యంలో 30 శాతం ఏపీ వాటా ఉంటుందని హామీ ఇస్తున్నాం. సర్క్యులర్ ఎకానమీకి ఆక్వా రంగాన్ని అనుసంధానం చేసేలా భీమవరంలో ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందిస్తోందని సీఎం వివరించారు. మార్కెట్ ఇబ్బందులతో మద్దతు ధర కోల్పోయిన వివిధ పంటల రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు.

# రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యం

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎయులో మొక్క నాటిన సిఎం చంద్రబాబు

**విశాఖపట్నం, జూన్ 5 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రోజురోజుకూ పర్యా వరణ సమతుల్యత దెబ్బతింటోందని, ఓవైపు విపరీతమైన ఎండలు, లేదంటే తుఫానులు వస్తున్నా యన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రపంచ పర్యా వరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం ముఖ్యమంత్రి పాల్గొన్నారు. శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు దీనికి హాజరయ్యారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏయూ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి మొక్క నాటారు. తిరుమల తరహాలో ఏయూ క్యాంపస్‌లోనూ గ్రీనరీ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం క్యాంపస్‌లో 25 శాతమే గ్రీనరీ ఉందని దీనిని 50 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలంటూ ఏయూ వీసీని సీఎం ఆదేశించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ 'స్వచ్ఛత, పచ్చదనం, పర్యావరణానికి ఏయూ క్యాంపస్ ఆదర్శంగా మారాలి. నెట్ జీరో క్యాంపస్‌గా ఏయూను నిలపాలి. ఆంధ్ర యూనివర్సిటీకి 450 ఎకరాల సువిశాల క్యాంపస్ ఉంది. ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెంచడంతో పాటు... బిల్డింగుల మీద సోలార్ ప్యానెళ్లు ఏర్పా టు చేయాలి. క్యాంపస్‌కు అవసరమైన విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలి. ఇప్పటికే రూ.5,18,000విలువైన విద్యుత్ ఆదా అయింది. క్యాంపస్ నుంచి ఒక్క చుక్క నీరు కూడా బయటకు వెళ్లకూడదు. శుద్ధి చేసిన నీటిని చెట్లకు ఉపయోగించాలి. నెట్ జీరో విధానం అమలు చేయడానికి ప్రొఫెసర్స్ టీం ఏర్పాటు చేయాలి. విశాఖలో కాలుష్య నియంత్రణ చర్యలువిశాఖలో కాలుష్యాన్ని తగ్గించేందుకు పోర్టు దగ్గర నుంచి మొదలుకుని అన్ని ప్రాంతాల్లోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు.

# టెట్ నోటిఫికేషన్ విడుదల

**విజయవాడ,జూన్ 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరు ద్యోగులకు శుభవార్త తెలిపింది, ఏపీ విద్యాశాఖ టెట్- 2026 జూన్ సెషన్ నోటిఫికేషన్‌ను విడు దల చేసింది. జూన్ 5 నుంచి అంటే నేటి నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. బీఈడ్, డీఎల్ఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులతో పాటు ఫైనల్ సెమిస్టర్ విద్యార్థులు కూడా ఈ కింది డైరెక్ట్ లింక్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రంలోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, ఏపీ మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రైవేట్ ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు టెట్ అర్హత తప్పనిసరి. టెట్ అర్హత కలిగిన నిరుద్యోగులకు డీఎస్సీ రాసేందుకు అవకాశం ఉంటుంది.. ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (తిశ గినిగి 2026) జూన్ 2026 సెషన్ నోటిఫికేషన్‌ను ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసింది. బీఎడ్, డీఎడ్ కోర్సులు పూర్తి చేసిన వారితోపాటు ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ బడుల్లో విధుల్లో ఉన్న ఉపాధ్యాయులందరికీ టెట్ అర్హత తప్పనిసరి. కాబట్టి వీరంతా ఆన్‌లైన్ విధానంలో జూన్ 5, 2026వ తేదీ నుంచి ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోండి.. ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం 40 నుంచి 50 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఈఎల్ఈడీ లేదా బీఈడీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఫైనల్ సెమిస్టర్ చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అర్హతలు కలిగిన వారు జులై 5, 2026వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఫీజు కింద ప్రతి పేపర్‌కు ప్రతి ఒక్కరూ విడివిడిగా రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. వీరికి టెట్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. టీచర్ రిక్రూట్‌మెంట్‌లో టెట్ స్కోరుకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. టెట్ ఆన్‌లైన్ రాత పరీక్షలు ఆగస్ట్ 5 నుంచి 21 వరకు రోజుకు రెండు సెషన్లలో జరుగుతాయి. ఆయా తేదీల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయి. రాత పరీక్ష మొత్తం 150 ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలకు 150మార్కులకు ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ ఉండదు.

# నాటిన మొక్కలు రక్షించండి

>> నాటడం ప్రతి ఒక్కరూ అలవాటుగా చేసుకోవాలని. నాటడమేకాదు, వాటిని సంరక్షించడం కూడా కీలకమన్నారు. అంకుడు, తెల్లపొణికి, వేప, కుంకుడు, రావి, మర్రి, వెదురు, ఉసిరి, చింత, మోదుగ తదితర స్వదేశీ జాతి విత్తనాలతో సీడ్ బాల్స్ తయారు చేశారు. "ఏక్ పేడ్ మా కే నామ్" అం టూ ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపు మేరకు తన తల్లి పేరిట పవన్ కల్యాణ్ మొక్కను నాటారు. ఇవాళ్టి నుంచి ఈనెల 15వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర కోట్ల సీడ్ బాల్స్ తయారీ లక్ష్యంగా నిర్దేశిం చుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విత్తన బంతుల (సీడ్ బాల్స్)ను అడ వులు, కొండ ప్రాంతాలు, నదీ తీరాల్లో వెదజల్లే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి సీడ్ బాల్‌కు ఒక చెట్టును సృష్టిం చగలిగే శక్తి ఉంటుందన్నారు. వన సంరక్షణకు పని చేస్తున్న మహనీయుల స్ఫూర్తితో విత్తన బంతుల తయారీ ప్రక్రియను బాధ్యతగా ముందుకు తీసుకువెళ్లాలన్నారు. సీడ్ బాల్స్ ఆవశ్యకతను వివరించిన చిన్నారులను అభినందించారు. అనంతరం డ్రోన్ల సహాయంతో కొండ శిఖరాలపై విత్తన బంతులు జార విడిచే ప్రక్రియను పరిశీలించారు. మూలపాడు బటర్ ఫ్లై పార్కులో అటవీ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పవన్ కల్యాణ్ సందర్శించారు. బటర్ ఫ్లై పార్కు నమూనా పరిశీలనలో అక్కడ యోగా హాల్ నిర్మాణం ఆయనను ఆకట్టుకుంది. ప్రతి ఎకో టూరిజం పార్కులో ఒక యోగా హాల్ నిర్మించే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఊడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామని వాగ్దానం:** కొండపల్లి కొయ్య బొమ్మలు తయారీకి వినియోగించే తెల్ల పొణికి దుంగలను పరిశీలించారు. అదేవిధంగా పక్కనే ఏర్పాటు చేసిన కొండపల్లి కొయ్య బొమ్మలు, ఉదయగిరి కళాకారులు నిర్ధ, బిళ్ల నిర్ధ, వేప కర్రతో తయారు చేసిన గ్లాసులు, గరిటలు మొదలైన ఇంటి సామాగ్రిని ఆసక్తిగా తిలకించారు. కళాకారులు రూపొందించిన చెక్క వాచ్, ల్యాప్ టాప్ పవన్ కల్యాణ్‌ని ఆకట్టుకున్నాయి. చిత్తూరు నుంచి వచ్చిన కళాకారులు బొమ్మల తయారీకి అవసరం అయిన చెక్క లభించడం లేదని తెలుపగా, వుడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కొయ్య బొమ్మల కళాకారుల చేత ప్రముఖ స్వతంత్ర సమర యోధు లు, హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రతిమను తయారు చేయించాలని కోరారు. అద్భుతమైన కళారూపాలకు మార్కెటింగ్ కల్పించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి రెండు నెలలకి ఓ ప్రాంతంలో చేతి వృత్తుల కళాకారులను కలిసే ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైలవరం శాసన సభ్యులు వసంత కృష్ణప్రసాద్ గారు, అటవీ, పర్యావరణ శాఖల ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే ు, పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు , అటవీశాఖ సలహాదారుడు మల్లికార్జునరావు , ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ , జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను , మైలవరం ఇంఛార్జ్ అక్కల రామ్మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

# లోయలో పడిన టెంపో

>> నుంచి భద్రాచలం, భద్రాచలం నుంచి రాజమండ్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివ రాలు ఈ విధంగా ఉన్నాయి. కడియం మండలం వేమగిరి, సామర్లకోట మండలం మేడపాడు,జగ్గంపేట మండపేట,గంటి పెద్దపుడి గ్రామాలకు చెందిన సుమారు 25 మంది వారి చిన్నారులతో కలిసి మారేడు మిల్లిలోని వాటర్ ఫాల్స్ వీక్షణ కోసం బయలుదేరారు. మారేడుమిల్లిలో వాటర్ ఫాల్స్ వద్ద నీళ్లు లేకపో వడంతో, వారితో ఉన్న చిన్నారులు నీళ్లలో జలకాలాడాల్సిందే అని పట్టు పట్టడంతో అక్కడి నుంచి వారు చింతూరు వైపు ప్రయాణమయ్యారు. ఘాట్ రోడ్డు మొత్తం క్రిందకు దిగిన తర్వాత పెద్దమ్మతల్లి గుడి దాటి చింతూరు వైపు వస్తుండగా రెండో మలుపు వద్ద వాహనము అదుపుతప్పి రైలింగును ఢీకొని లోయలోకి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో 12 మందికి కాళ్లు చేతులు విరగగా మరో 13 మందికి గాయా లయ్యాయి. హుటా హుటిన అంబులెన్స్‌లో క్షతగాత్రులను చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలిం చడంతో ఆసుపత్రి మొత్తం క్షతగాత్రుల ఆహాకారాలతో మారుమ్రోగింది. తీవ్రంగా గాయాలైన 12 మందిని చింతూరు ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి భద్రాచలం తరలించారు. 12 సం వత్సరాల వయసున్న హరి అనే బాలుడుతో పాటు ఆరు సంవత్సరాల వయసున్న శ్యామల అనే చిన్నారికి తలకు గాయాలు కావటంతో పాటు అంతర్గతంగా రక్తస్రావమైనట్టు గమనించిన డాక్టర్లు వారిని చింతూరు నుంచి భద్రాచలంకు రిఫర్ చేయగా అక్కడ కూడా వారి పరిస్థితి విషమంగా ఉంది అక్కడ నుంచి రాజమండ్రిలోని న్యూరో సర్జన్ వద్దకు రిఫర్ చేశారు. స్వల్ప గాయాలతో ఉన్న క్ష తగాత్రులను వారి స్వగ్రామాలకు తరలించడం కోసం చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్ ఆదేశాల మేరకు చింతూరు ఏఎస్పీ బొడ్డు హేమంత్, డివిజనల్ రెవెన్యూ అధికారి అంబేద్కర్ ఆధ్వర్యంలో అంబులెన్సులు ఏర్పాటు చేసి స్వల్ప గాయాలైన 13 మందిని రెండు అంబులెన్స్ ద్వారా వారి స్వగ్రామాలకు తరలించారు.

# తిరుమలలో భక్తుల క్రమబద్ధీకరణ భేష్

>> తక్షణమే అందుబాటులోకి వస్తోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ సాంకేతికతను ప్రోత్సహిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తు న్నారని కొనియాడారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన ప్రవాస భారతీయ భక్తులకు కృతజ్ఞతలు తెలి యజేస్తూ, కేవలం వంద రోజుల లోపే ఎఐ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిన టిటిడి అధికారులను ఈ సందర్భంగా కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ అభినందించారు. తిరుమలలో భక్తుల సేవల నిర్వహణలో కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరు ప్రశంసనీయమని అన్నారు. శుక్రవారం ఉదయం కుటుంబంతో కలసి శ్రీవారి దర్శనానంతరం వైకుంఠమ్ 1 లోని ఐసిసిసిని సందర్శించారు. అక్కడ టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, డిప్యూటీ ఇఒ భాస్కర్, డిప్యూటీ సిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడుతో కలసి ఎఐ ఐసిసిసి పనితీరును మంత్రి స్వయంగా పరిశీలించారు. భక్తులు విశ్రాంతి తీసుకుంటున్న ప్రాంతాన్ని కూడా ఇక్కడ నుండి మంత్రి పర్యవేక్షించారు.

# స్మార్ట్ సిటీలకు రష్యా చేయూత

>>భేటీ అయ్యారు. ఈ భేటీలో ఒక ఉమ్మడి వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి లోకేష్ స్వయంగా వెల్లడించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు లోకేష్ వివరించారు. ప్రధానంగా సేఫ్ స్మార్ట్ సిటీల నిర్మాణం కోసం పౌరులతో చర్చలు జరపడం, డేటా ఆధారిత నగర నిర్వహణ, డిజిటల్ విద్యను ప్రోత్సహించడం, నగరాల్లో విశ్వసనీయమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. ఏపీలో స్మార్ట్ సిటీల అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానం, అనుభవాన్ని పంచుకునేందుకు ఈ ఉమ్మడి వర్కింగ్ గ్రూప్ దోహదపడుతుందని భావిస్తున్నారు. ఈసహకారంతో రాష్ట్రంలోనినగరాలను మరింత సురక్షితంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు మార్గం సుగమం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పాలుపంచుకోండి**

రాష్ట్ర అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా పాలు పంచుకోవాలని రష్యా పారిశ్రామికవేత్తలను, ప్రముఖ సంస్థలను ఏపీకి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆహ్వానించారు.రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్థిక ఫోరం వేదికగా ప్రసంగించారు. కేవలం పెట్టుబడిదారులుగానే కాకుండా,భారత్‌రష్యాల మధ్య బంధం కేవలం వ్యాపార ఒప్పందాలకే పరిమితం కాదని, అది ఒక దృఢమైన అనుబంధమని లోకేష్ పేర్కొన్నారు. భిలాయ్ స్టీల్ ప్లాంట్ నుంచి గగన్‌యాన్ ప్రాజెక్టు వరకు అనేక కీలక సందర్భాల్లో రష్యా భారత్‌కు అండగా నిలిచిందని ఆయన గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నిర్దేశించుకున్న 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, 2047 నాటికి రాష్ట్ర జీడీపీని 2.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని వివరించారు. వెయ్యి కిలోమీటర్ల మేర విస్తరించిన సుదీర్ఘ తీరప్రాంతం, ఆరు ప్రధాన ఓడరేవులు, పటిష్టమైన మౌలిక సదుపాయాలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా వంటి అంశాలు రాష్ట్రంలో పెట్టుబడులకు ఎంతో అనువైనవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఖిస్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ఖికు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. అంతరిక్ష రంగంలో ఇరు దేశాల మధ్య సహకారం నూతన శిఖరాలకు చేరుతోందని, భారత దేశపు ఏకైక స్పేస్‌పోర్ట్ శ్రీహరికోట ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని లోకేష్ గుర్తుచేశారు.

ఈ క్రమంలో రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న స్పేస్ సిటీలలో పెట్టుబడులు పెట్టాలని రోస్‌కోస్మోస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలను ఆహ్వానించారు. ఏరోస్పేస్, సెమీకండక్టర్లు, ఇంధన రంగాల్లో రష్యన్ సంస్థలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఉమ్మడిగా ఉజ్వల భవిష్యత్తును నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# రాజ్యసభ ఇవ్వడాన్ని పదవిగా కాదు, బాధ్యతగా భావిస్తా: లింగమనేని రమేశ్

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:**రాజ్యసభ ఇవ్వడాన్ని పదవిగాకాదు, బాధ్యతగా భావిసా అని జనసేన రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైనా లింగమనేని రమేశ్‌స్పష్టం చేశారు. ఈ సం దర్భంగా జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కు, మద్దతిచ్చిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 'నాకు పదవికాదు, బలమైన బాధ్యత అప్పగిం చారని భావిస్తున్నా. ప్రజల ఆకాంక్షలపై, రాష్ట్ర అభివృద్ధిపై రాజ్యసభలో మాట్లాడతా. సామా న్యుడి గొంతును రాజ్యసభలో వినిపించడమే లక్ష్యంగా పనిచేస్తా. పవన్ నాపై ఉంచిన నమ్మ కాన్ని నిలబెట్టుకొంటా'అని రమేశ్ వెల్లడించారు.

# విశాఖలో సిఎం సైకిల్ యాత్ర

>> చాటిచెప్పారు. ఆరోగ్యకర జీవ నశైలి, ఫిట్‌నెస్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలనే లక్ష్యంతో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో ఆయన స్వయంగా పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిచారు.ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవోటెల్ వరకు సుమారు 5.5 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 21 నిమిషాల 18 సెకన్లలో పూర్తి చేసిన సీఎం, ప్రయాణం మొత్తం ఉత్సాహంగా కనిపించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మార్గాల మీదుగా సాగిన ఈ సైకిల్ యాత్రనగర ప్రజల దృష్టిని ఆకర్షించింది.ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ఎక్కడా అలసటకు లోనుకాకుండా సైకిల్ తొక్కిన సీఎం,మార్గమధ్యంలో కనిపించిన ప్రజలకు అభి వాదం చేస్తూ ముందుకు సాగారు. ఆయనను చూసిన పలువురు యువత, వృద్ధులు, మహిళలు సైతం ఉత్సాహంగా స్పందించారు. ప్రజలతో మమేకమవుతూ సాగిన ఈ సైకిల్ ప్రయాణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈర్యాలీలో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పా ల్గొన్నారు. ఆరోగ్యం,పర్యావరణ పరిరక్షణ, శారీరక దృఢత్వం కోసం సైక్లింగ్ ఎంత ముఖ్య మో ఈ కార్యక్రమంద్వారా ప్రజలకు సందేశం చేరింది.ప్రస్తుతం వేగవంతమైన జీవనశైలిలో వ్యాయా మానికి సమయం కేటాయించడం తగ్గిపోతున్ననేపథ్యంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా సైకిల్ తొక్కడం ద్వారా ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలనే సానుకూల సందేశాన్ని సమాజానికి అందించారు. ఎండలోనూ ఆయన చూపిన చురుకుదనం, క్రమశిక్షణ, ఆరోగ్యంపై ఉన్న శ్రద్ధ పలువురికి స్ఫూర్తిగా నిలిచింది.



శుక్రవారం సూరత్‌లోని హాజీరాలో ఉన్న ఎల్ అండ్ టి ప్లాంట్‌ను సందర్శిస్తున్న ప్రధాని మోడీ

# రాజ్యసభకు ఖర్గే నామినేషన్ దాఖలు

## రాహుల్ గాంధీ, సిఎం డికె శివకుమార్, సిద్ధరామయ్య హాజరు

**బెంగళూరు, జూన్ 5:** కర్ణాటక నుంచి రాజ్యసభ ఎన్నికలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం విధానసౌధలో తన నామినేషన్ పత్రా లను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, మాజీ ముఖ్య మంత్రి సిద్ధరామయ్య తదితరులు పాల్గొన్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభకు ద్వైవార్షిక ఎన్నికలు జూన్ 18న జరగనున్నాయి. అంతకుముందు, ముఖ్యమంత్రి డికె శివకుమార్ నేతృత్వంలోని కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభాన్ని ఎదు ర్కొంటున్న తరుణంలో, నామినేషన్ పత్రాల దాఖలు కోసం రాహుల్ గాంధీ, ఖర్గే శుక్రవారం బెంగళూరుకు చేరుకున్నారు. వారు రాగానే ము ఖ్యమంత్రి డికె శివకుమార్, కాంగ్రెస్ రాష్ట్ర నూ తన అధ్యక్షుడు బి.కె.హరిప్రసాద్, కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీ (సిడబ్ల్యుసి) సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వారికి ఘన స్వాగ తం పలికారు. కెంపెగౌడ అంతర్జాతీయ విమా నాశ్రయానికి చేరుకున్న రాహుల్ గాంధీ ఒక మొక్కను నాటి, నీరుపోశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి డికె శివకుమార్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్‌సింగ్ సూర్జేవాలా, సిద్ధరామ య్య, మంత్రి ఎం.బి.పాటిల్ పాల్గొన్నారు.

# బ్రహ్మానాయుడు అరెస్టు

>> ముఠాలోని సభ్యులకు ఎనిమిది కోట్ల రూపాయలు ఇచ్చిన ట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసింది. ఆయన ముఠాలో ఐదుగురిని అరెస్టు చేయగా వీరి వద్ద నకిలీ పత్రాలతో పాటు నకిలీ జీఓలు స్వాధీనం చేసు కున్నారు. కేసు నమోదు కాగానే బ్రహ్మానాయుడు పారిపోయి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా న్యాయస్థానం దీనిని డిస్మిస్ చేసింది. దీని తరువాత తన అరెస్టు ఖాయమని భావించిన బ్రహ్మా నాయుడు అజ్ఞాతంలోకి వెళ్లి పలుప్రాం తాలను మార్చి చివరకు శుక్రవారం కాంచీపురం లో పట్టుబడ్డారు. బ్రహ్మానాయుడును శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ తీసుకువచ్చిన తరువాత వైద్య పరీక్షలు నిర్వహించి స్థానిక న్యాయస్థానం ఎదుట హాజరుపరచి కోర్టు ఆదేశాల మేరకు రిమాండుకు తరలిస్తారు. కాగా ఈ కేసులో మరింత సమా చారం సేకరిం చేందుకు బ్రహ్మానాయుడును వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరను న్నారు. ఈ పిటిషన్ శనివారం లేదా సోమవా రం దాఖలయ్యే వీలుంది. ఈ కేసులో కొందరు రెవెన్యూ అధికారులు,మాజీ అధికారుల పాత్రపై ఆరోపణలు రావడంతో బ్రహ్మానాయుడును విచా రిస్తే అసలు విషయం వెలుగుచూసే వీలుందని సైబరాబాద్ పోలీసులు భావిస్తున్నారు.

# షర్మిలకు దక్కని రాజ్యసభ సీటు

**విజయవాడ,జూన్ 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు ఏఐసీసీ అనుహ్యంగా షాక్ ఇచ్చింది.ఆమెకు రాజ్యసభకు సీటు వచ్చినట్లుగానే పీసీసీ వర్గాలు విస్తృతంగా ప్రచారం చేసాయి.జోరుగా సాగిన ఊహాగా నాల కు ఇప్పుడు తెరపడింది. కాంగ్రెస్ అధిష్ఠానం తాజాగా ప్రకటించిన రాజ్యసభ అభ్యర్థుల తుది జాబితాలో షర్మిలకు చోటు దక్కలేదు. కర్ణాటక నుంచి ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ స్థానా లను భర్తీ చేసే క్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్య ర్థులను ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే. ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేడా, కేంద్ర మాజీ మంత్రి రెహ్మాన్ ఖాన్ కుమారుడు. మన్సూర్ ఆలీఖాన్‌లను కర్ణాటక నుంచి రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్థులుగా ఉన్నారు.

# రిజిస్ట్రేషన్లు ఆరంభం

>> అమరావతిలో,నిర్వహించాలని తలపెట్టగా దీనికి కొనసాగింపుగా ప్రతి జిల్లా కేంద్రంలో యోగాసన కార్యక్రమాల నిర్వహణకు వీలుగా భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్ర వారం నిర్వహించిన సమీక్ష (వర్చువల్)లో ఆయ నకు ఉన్నతాధికారులు ఏర్పాట్లపై వివరిం చారు.ఈ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిం చేందుకు మంగళగిరిలోని రాష్ట్ర ఆరోగ్య, కుటుం బ సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక వార్ రూము ఏర్పాటైంది. ఆయుష్ వైద్య ఆరోగ్యశాఖ, జాతీయ ఆరోగ్య మిషన్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు, సెకండరీ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయాలకు చెందిన 30 మందితో ఈ వార్ రూము ఏర్పాటైంది.

# జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని

>> జనసేన వర్గాలు తెలిపాయి.పవన్ కల్యాణ్ అధికారికంగా వెల్లడిస్తారని జనసేన నేతలు చెబు తున్నారు. నిన్న జరిగిన ఎన్డీఏ నేతల సమా వేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తోపాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక, సర్, రెండేళ్ల పాల న విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై భేటీలో ప్రధానంగా చర్చించారు. అలాగే రాష్ట్రంలో త్వరలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎం పికపైనా చర్చ జరిగింది. అందులో భాగంగా మూడు రాజ్యసభస్థానాలను టీడీపీ, ఒక స్థానా న్ని జనసేన తీసుకోవాలని నిర్ణయించారు. జన సేనకు దీంతో రాజ్యసభలో తొలిసారి ప్రాధా న్యత లభించింది.ఈ క్రమంలో లింగమనేని రమేష్‌కు జనసేన సీటు కేటాయించింది.ఇక లింగమనేనికి పార్టీతో 2015 నుంచి అను బంధం ఉందని పవన్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలనే పవన్ ఆలోచనలకు లింగమనేని ఆకర్షితులయ్యారన్నారు. శనివారం మధ్యాహ్నం లింగమనేని రమేశ్ నామినేషన్ వేస్తారని వెల డించారు.2019 ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వచ్చినా లింగమనేని, పవన్ వెంటే ఉన్నారని గుర్తు చేశారు. నేతల కులమతాలు పట్టించు కోకుండా అవకాశం కల్పించామని తెలిపారు. ఇదే సూత్రాన్ని రాజ్యసభ అభ్యర్థి ఎంపికలోనూ పవన్ అనుసరించారని హరిప్రసాద్ స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

06-06-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
షష్ఠి రా.2.39
శ్రవణ ఉ.6.03
వర్జ్యం : ఉ.10.21-మ.12.05
దు.తె.5.33-ఉ.7.13
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** జీవిత భాగస్వామి ద్వారా ధన, ఆస్తి లాభాలు పొందుతారు. కొత్త పెట్టుబడులు అనుకూలంగా ఉంటాయి.వస్త్రలాభం.

**వృషభం:** నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. ఇంటి యందు శుభకార్యాలు జరుగుతాయి.

**మిథునం:** కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. చాకచక్యంగా వ్యవహరించి పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** భూవివాదాలు పరిష్కార మవుతాయి. మానసిక వత్తిడుల నుండి బయటపడతారు.గృహనిర్మాణాలు చేపడతారు.

**సింహం:**ముఖ్యమైన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పొందుతారు.

**కన్య :**అరుదైన ఆహ్వానాలు అందు కుంటారు. రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.వస్త్రలాభం.

**తుల:**ఆర్థికపరమైన లావాదేవీలలో మధ్యవర్తి వ్యవహారాలు లాభించవు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి.

**వృశ్చికం:**బాధ్యతలు సమర్థవంతంగా నెరవేర్చి పలువురి ప్రశంసలు పొందుతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**ధనుస్సు:** చేపట్టిన పనులలో కొద్దిపాటి ఒడిదుడుకులు ఎదురవుతాయి. అయినా ఏ మాత్రం ధైర్యాన్ని కోల్పోతారు.

**మకరం:** భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కుటుంబ పురోభివృద్ధికి విశేషంగా కృషి చేస్తారు. స్పెక్యులేషన్ లాభిస్తుంది.

**కుంభం:** కార్యాలయంలో సానుకూల వాతావరణం నెలకొని ఉంటుంది. మానసిక ప్రశాంతత లాభిస్తుంది.

**మీనం:**శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. వివాదాలు తీరి ప్రశాంతత పొందుతారు. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

6-6Pg7exHMNWJQE.qxd:6-6Pg7exHMNWJQE.qxd 1/1/02 6:54 AM Page 1



# అక్రమ స్పా సెంటర్లపై పోలీసుల ఉక్కుపాదం

## - అనుమతులు లేకుండా డార్క్ రూమ్స్‌ల నిర్వహణ

## -చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : కమిషనర్ సుమతి



వివరాలను వెల్లడిస్తున్న సీపీ సుమతి

**మన్సూరాబాద్, జూన్ 5 , ప్రభాతవార్త :** అక్రమ కార్యకలాపాలు, అనధికారిక క్రాస్ మసాజ్ సేవలు, భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు భారీ స్పెషల్ డ్రైవ్ ను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఎస్వోటీ బృందాలతో కలిసి మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని స్పా సెంటర్లపై సమగ్ర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 113 సెంటర్లు తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 46 సెంటర్ల నిర్వాహకులు, మేనేజర్లపై క్రిమినల్ కేసుల ను నమోదు చేశారు. ఎల్బీనగర్ లోని క్యాంపు కార్యాలయంలో సీపీ సుమతి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా స్పా సెంటర్లలో నిబంధనలు ఉల్లంఘన తో పాటు చాలావరకు స్పా సెంటర్లు అవసరమైన అనుమతులు, అప్రూవల్స్ లేకుండా, సక్రమంగా రికార్డులను నిర్వహించడం లేదని అన్నారు. స్పా సెంటర్ సూచించే డిస్‌ప్లే బోర్డులు లేకుండా సెంటర్లు ఉన్నాయని అన్నారు. జోన్లవారీల తనిఖీల వివరాలుఎల్బీనగర్ జోన్ లోని ఐదు పోలీస్ స్టేషన్ పరిధిలోని 47 సెంటర్లలో తనిఖీలు నిర్వహించి, 17 కేసులు నమోదు చేశామనీ సీపీ తెలిపారు . ఉప్పల్ జోన్ లోని ఏడు పోలీసు స్టేషన్ల పరిధిలోని 30 సెంటర్లలో తనిఖీలు నిర్వహించి, 11 కేసులు నమోదు చేశామన్నారు. మల్కాజిగిరి డివిజన్ లోని ఏడు పోలీసు స్టేషన్ల పరిధిలోని 17 సెంటర్లలో తనిఖీలు నిర్వహించి, 7 కేసులు నమోదు అయ్యాయన్నారు. కంటోన్మెంట్ జోన్ లో ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని 19 సెంటర్లలో తనిఖీలు నిర్వహించి, 11 కేసులు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు . నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు , అనుమానాస్పదంగా, అనధికారంగా, అక్రమంగా నడుస్తున్న స్పా సెంటర్ల గురించి సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా కమిషనరేట్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలను పోలీస్ కమిషనర్ సుమతి కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. సమావేశంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ పరిధిలోని పోలీస్ ఉన్నతాధికారులు, పోలీసులు, ఎస్వోటీ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బిసి గురుకుల పాఠశాల సిబ్బంది నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి

# సిఎం ప్రజావాణిలో 718 దరఖాస్తులు

## పలు సమస్యలపై భారీగా తరలి వచ్చిన దరఖాస్తుదారులు

## దరఖాస్తులు స్వీకరించిన ప్రజావాణి ఇన్‌చార్జి డా.జి.చిన్నారెడ్డి

**బేగంపేట జూన్ 5,ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన 228వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 718దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 333దరఖాస్తులు,ఇందిరమ్మ ఇండ్ల కోసం 251దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 48దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 01దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 85దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణీ ఇంచార్జ్ డా.జి.చిన్నారెడ్డి దరఖాస్తులు ఎండార్స్ చేసి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల కుక్స్,స్వీపర్లు, వాచ్‌మెన్లు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇప్పించాలని,పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరగా స్పందించిన చిన్నారెడ్డి బీసీ గురుకుల పాఠశాలల ఇంచార్జ్ కార్యదర్శి మల్లయ్య భట్టుతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేసారు.వేసవి కాలంలో వనస్థలి పురం ప్రభుత్వ పాఠశాల విధ్యార్థులు గణితం,ఆంగ్లభాష,విషయాల్లో శిక్షణ పొంది గొప్పగా రాణించిన బాల బాలికలు సీఎం ప్రజావాణికి వచ్చి తమ ప్రతిభను చాటారు.వారికి చిన్నారెడ్డి ఆశీస్సులు అందజేసారు.ఇలాంటి శిక్షణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే విష యాన్ని ప్రభుత్వ దృష్టికి తీసికెళ్తామని చిన్నారెడ్డి అన్నారు.కస్తూర్బా పాఠశాల నాన్ టీచింగ్ సిబ్బంది తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరారు.విద్యాశాఖ అధికారులతో చిన్నారెడ్డి ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసారు.శుక్రవారం సీఎం ప్రజావాణీకి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ ఉమేందర్,ఎన్ఆర్ఐ సమన్వయ మండి వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి,సీఎం ప్రవాసీ ప్రజావాణీ సమన్వయ కర్త బొజ్జా అమరేందర్ రెడ్డి వివిధ శాఖల అదికారులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కును కాపాడుకుందాం

## తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్




విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న ప్రొఫెసర్ హరగోపాల్

**ధర్నాచౌక్, జూన్ 5, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కును కపాడుకుందామని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణలను నిరసిస్తూ కవాడిగూడ ఏసిటిసి కాలేజి నుంచి ఇందిరాపార్కు ధర్నాచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీఎస్ఈసీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ చక్రధరరావు అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమం నుద్దేసించి ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగం లోని ఆర్టికల్ 21ఏ ప్రకారం ఉచిత, నిర్బంధ విద్య ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కు అని, ఈ హక్కును కాపాడాల్సిన ప్రభుత్వమే ఈరోజు విద్యను అంగట్లో సరుకుగా మార్చి, కార్పోరేట్ శక్తులకు కట్టబెడుతోందని మండిపడ్డారు. జాతీయ విద్యా విధానం ద్వారా విద్యా వ్యవస్థను మతీకరణ, కేంద్రీకరణ చేస్తున్నారని, ఎన్టిఏ వంటి సంస్థల వైఫల్యం వల్ల నీట్ పరీక్ష రాసిన 22లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు బుగ్గిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ రాజ్యాంగా ఉండాల్సిన ప్రభుత్వం, కార్పొరేట్ కంపెనీలాగా మారటం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ప్రొఫెసర్ చక్రధరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ కార్పోరేటీకరణ విధానాలనే ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని, కేవలం కమీషన్ల కోసమే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ముందుకు తీసుకువస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20శాతం నిధులు విద్యకు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ధర్నాకు సంఘీభావం తెలిపిన అనంతరం మాట్లాడుతూ విద్యా వ్యవస్థ అనేది పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పుడే సామాన్య, పేద వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యను కాపాడేందుకు టీఎస్ఈసీ చేస్తున్న పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. సమాచార హక్కు మాజీ కమీషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టాన్ని క్షేత్రస్థాయిలో అమలుచేయటంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం చట్టాలను నీరుగారుస్తూ, సామాన్యులకు విద్యను దూరం చేసే విధానాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐఎంఎల్ నేత పోటు రంగారావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జే.చలపతిరావు, టి.హన్మండ్లు, ఆల్ ఇండియా ఫోరం ఫర్ రైట్ టు ఎడ్యుకేషన్ నాయకులు ఎం.గంగాధర్, ఎ.నర్సింహారెడ్డి, మీరా, టీఎస్ఈసీ నాయకులు ప్రొఫెసర్ కే.లక్ష్మీనారాయణ, టిపిటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్. అనిల్‌కుమార్, టి.లింగారెడ్డి పాల్గొన్నారు.




# ప్రపంచ వేదికపై పోచంపల్లి చేనేత వైభవం

## చేనేత కళకు అంతర్జాతీయ గుర్తింపు లక్ష్యంగా 'థ్రెడ్ పోచంపల్లి'

## నేతన్నల ప్రతిభకు ప్రపంచ మార్కెట్ దిశగా అడుగులు: మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి

**యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త :** తెలంగాణ చేనేత కళా వైభవాన్ని అంతర్జాతీయ స్థాయిలో మరింత విస్తరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న థ్రెడ్ పోచంపల్లి హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేతజౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప రంగం చేనేతేనని పేర్కొన్నారు. పోచంపల్లి ఇక్కత్ కళ తెలంగాణకు మాత్రమే కాకుండా దేశానికి గర్వకారణంగా నిలిచిందన్నారు. జీఐ ట్యాగ్ ద్వారా పోచంపల్లి చేనేతకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని, ఈ ప్రత్యేకతను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం, రంగ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాల్లో రూ.1,400 కోట్లకు పైగా వ్యయం చేసిందని తెలిపారు. నేతన్నల ఉపాధి భద్రత, ఆధునిక శిక్షణ, మార్కెటింగ్ అవకాశాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్లోబల్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా చేనేత కుటుంబాల యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పోచంపల్లి నేతన్నల ప్రతిభ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందన్నారు. అగ్గిపెట్టెలో పట్టేంత సన్నని చీరలను నేసిన ఘనత పోచంపల్లి చేనేత కళాకారులదేనని కొనియాడారు. పోచంపల్లి ఇక్కత్, పుట్టపాక తెలియా రుమాళ్లు వంటి ఉత్పత్తులు యాదాద్రి భువనగిరి జిల్లాకు ప్రపంచవ్యాప్త ఖ్యాతిని తెచ్చిపెట్టాయని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 12 వేల మంది చేనేత కార్మికులు, అనుబంధ వృత్తిదారులు ఈ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడం, మెరుగైన ఆదాయం అందించడం లక్ష్యంగానే ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 100 చేనేత స్టాల్స్‌తో పాటు స్వయం సహాయక సంఘాలు, అనుబంధ సంస్థల స్టాల్స్ ఏర్పాటు చేయడం ద్వారా వినియోగదారులకు చేనేత ఉత్పత్తుల వైవిధ్యాన్ని పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ ద్వారా చేనేత కార్మికులకు మరిన్ని మార్కెటింగ్ అవకాశాలు లభిస్తాయని, వారి కృషికి తగిన గుర్తింపు దక్కుతుందని అన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వేలాది కుటుంబాలకు చేనేత రంగం జీవనాధారంగా నిలుస్తోందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ పోచంపల్లి చేనేత వైభవాన్ని ప్రపంచానికి మరింత చేరువ చేయడం, నేతన్నలకు కొత్త మార్కెట్ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నామని తెలిపారు. జూన్ 5 నుంచి 7 వరకు మూడు రోజులపాటు కొనసాగనున్న ఈ ఎగ్జిబిషన్‌లో చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్లు, టై అండ్ డై సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, కళాకారులు పాల్గొంటున్నారు. చేనేత రంగానికి విశేష సేవలందించిన పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్యలను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. తెలంగాణ రైజింగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన చేనేత రంగానికి కొత్త ఉత్సాహాన్ని, నేతన్నలకు విస్తృత మార్కెట్ అవకాశాలను తీసుకురానుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి , జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి టి నాగిరెడ్డి, చేనేత జౌళిశాఖ అధికారి శ్రీనివాస్, భువనగిరి డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం, డిపిఆర్ఓ అరుంధతి ,గుండాల చేనేత సహకార సంఘం చైర్మన్ దడక ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణానదిని ఈదిన కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, జూన్ 5, ప్రభాతవార్త :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా కృష్ణానదిని ఈది వినూత్న సందేశాన్ని అందించారు. ఆక్వాడెవిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ లక్ష్మీశా అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఉదయం విజయవాడలోని భవానిఘాట్ నుండి కృష్ణానదిని ఈదుతూ అవతలి ఒడ్డుకు చేరుకున్నారు. అవతలి ఒడ్డున మొక్కలు నాటారు. కలెక్టర్ ధైర్యసాహసాలకు పలువురు అభినందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నదులు కేవలం నీటివనరులు మాత్రమే కాదని, జీవవైవిధ్యానికి, వ్యవసాయ, తాగునీటి అవసరాలకు, పర్యావరణ సమతుల్యతకు మూలాదారమని పేర్కొన్నారు. నదులను కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈకార్యక్రమంలో పాల్గొన్నట్లు కలెక్టర్ తెలిపారు.



ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ సభ్యులతో కలెక్టర్ లక్ష్మీశా

**యోగాడేకు సర్వం సిద్ధం :** ఈనెల 7వతేదీ నుండి 21వతేదీ వరకు జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. శుక్రవారం సిపి రాజశేఖరబాబుతో కలిసి మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 7వతేదీ పోలీస్‌సిబ్బందితో కలిసి విజయవాడలోని బిఆర్‌టిఎస్‌రోడ్‌లో థీమాటిక్ యోగా, 10వతేదీ పవిత్ర సంగమం వద్ద, 13వతేదీ బెరంపార్కు వద్ద, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బిఆర్‌టిఎస్‌రోడ్‌లో ప్రతిరోజూ ఉదయం 6గంటలకు నిత్యయోగా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జూన్ 21న జిల్లాస్థాయి కార్యక్రమం జరుగుతుందని, ఇందులో 300మంది మాస్టర్ ట్రైనర్లు, 5వేల మంది యోగాశిక్షకులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

ప్రతిఒక్కరూ ఈకార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యానికి రూ.2,500కోట్లు : మంత్రి సంధ్యారాణి




ఉత్తమప్రతిభ కనపరచిన విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి

**విజయవాడ, జూన్ 5, ప్రభాతవార్త :** సరైన రహదారి సౌకర్యం లేని గిరిజన గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు రూ.2,500కోట్ల నిధులు కేటాయించి, పలు గ్రామాలకు రహదారులు నిర్మించినట్లు రాష్ట్రగిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఇటీవల విడుదలైన పదవతరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షాఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన గిరిజన విద్యార్థినీవిద్యార్థులను, వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను శుక్రవారం విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సత్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు నేతృత్వంలోని తమ ప్రభుత్వం గిరిజన విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం ప్రతభుత్వం ప్రతివిద్యార్థిపై దాదాపు లక్షరూపాయలు వరకు ఖర్చుచేస్తున్నట్లు వివరి ంచారు. గతంలో గంజాయి సాగు చేసిన ప్రాంతాల్లో గంజాయిని నిర్మూలించి ప్రస్తుతం అక్కడ రెండు లక్షల ఎకరాల్లో కాఫీతోటల పెంపకం చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో నిలిపివేసిన గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలు, టార్పాలిన్‌లు, ఆయిల్ ఇంజన్లు, ట్రాక్టర్లు అందచేస్తున్నట్లు మంత్రి తెలియచేసారు. పల్నాడు జిల్లా ఎత్తిపోతల ఆశ్రమపాఠశాల విద్యార్థులు పాములను ముందుగానే గుర్తించే ప్రోటోటైప్‌షూ రూపొందించి రాష్ట్రస్థాయిలో అవార్డు సాధించటం గర్వకారణమన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని గిరిజన విద్యార్థులు ఐఏఎస్, ఐపిఎస్ వంటి అత్యున్నతస్థాయి ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. 600మార్కులకు గానూ 591 సాధించిన పార్ధు, 590మార్కులు సాధించిన జాస్మిన్‌లు సమాజానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈసందర్భంగా 176మంది విద్యార్థులకు మొమెంటోలు అందించి సత్కరించారు. ఈకార్యక్రమంలో సోషల్‌వెల్‌ఫేర్ కార్యదర్శి యం.మల్లిఖార్జుననాయక్, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి, గురుకులం విద్యాసంస్థల కార్యదర్శి యం.గౌతమి, ట్రైకార్ యండి మణికుమార్, గిరిజన సంక్షేమశాఖ జేడి ప్రతిభాభారతి, తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణ, గోదావరి సంగమంలో పుణ్యనదీ హారతులు



నవహారతులను పూజాదికాలతో ప్రారంభిస్తున్న పండితులు

**ఇంద్రకీలాద్రి, జూన్ 5, ప్రభాతవార్త** పవిత్ర కృష్ణ, గోదావరి పుణ్య నదుల సంగమం వద్ద పుణ్యనదీ హారతులు శుక్రవారం సమర్పించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ శాఖ కమిషనర్ వార్ల ఆదేశాల ప్రకారం ఎన్.టి.ఆర్ జిల్లా యంత్రాంగం సహకారంతో ఈరోజు సాయంత్రం శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం (పవిత్ర కృష్ణ, గోదావరి పుణ్య నదుల సంగమం) వద్ద పుణ్యనదీ హారతులు కార్యక్రమం లాంచనంగా పునః ప్రారంభం జరిగింది. మొదటగా దేవస్థానం స్థానాచార్య వి శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో రాష్ట్ర క్షేమం, ప్రజా సంక్షేమం కోరుతూ ప్రత్యేక పూజా కార్యక్రమములు జరిగి, నదీమతల్లికి పసుపు కుంకుమలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం దేవస్థానం వైదిక సిబ్బంది పవిత్ర నదీమతల్లులకు పంచ హారతులు సమర్పించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయంలో ఆలయాలు,నదుల ప్రాముఖ్యత ఎనలేనిదని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పుణ్య నదీ హారతి కార్యక్రమం శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయం నుండి నిర్వహించడానికి ఏర్పాటు చేశామని, గతంలో మాదిరిగా వైభవంగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహణకు పూర్తి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు జీవి నాగేశ్వరరావు, అవ్వారు శ్రీనివాసరావు, పి. రాఘవరాజు, సరోజినీ దేవి, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకరబాబు, దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్,

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమా దేవి తదితరులు పాల్గొన్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో యూత్ టైం బ్యాంక్ సేవలు ప్రారంభం అయ్యాయి.

# కైలాసగిరి నుంచి భోగాపురం వరకూ బే సిటీ ప్రాజెక్టు

## విశాఖ ఎకనమిక్ రీజియన్ సమీక్షలో అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

**విశాఖపట్నం,జూన్ 05: (ప్రభాత వార్త )** బే సిటిగా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ పై సీఎం 9 జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విశాఖలోని కైలాసగిరి నుంచి భోగాపురం వరకూ ఈ బేసిటీ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. వీఈఆర్ పై ఓ ప్రాజెక్టు మోనిటరింగ్ యూనిట్ ను కూడా ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచనలు ఇచ్చారు. గ్రేహౌండ్స్ కు చెందిన 303 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్ ను నిర్మించాలని ఆదేశించారు. అలాగే కైలాసగిరి ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలకూ ఆహ్లాదం కలిగించేలా బీచ్ వాటర్ స్పోర్ట్స్ తో పాటు వినోదం కలిగించే వివిధ ప్రాజెక్టులు చేపట్టేలా పెట్టుబడులను ఆహ్వానించాలన్నారు. విశాఖలోని జంతు ప్రదర్శన శాలను కూడా ఆధునీకరించి పర్యాటకుల్ని ఆకర్షించేలా చూడాలని సూచించారు. విశాఖలో ఎర్రమట్టి దిబ్బలు, బౌద్ధక్షేత్రాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్టుతో పాటు, పోలవరం ప్రాజెక్టు, పాపికొండలు లాంటి పర్యాటక ప్రాంతాలు అదనపు ఆకర్షణ.

# బిసిలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

## : రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**చిక్కడపల్లి జూన్ 5 ( ప్రభాతవార్త ) :** దేశంలో 75 కోట్లకు పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించడమే లక్ష్యంగా జూలై చివరి వారంలో దేశ రాజధాని ఢిల్లీలో భారీ బహిరంగ సభ, జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు జనాభా ప్రకారం తగిన వాటా దక్కలేదని, గత పాలకులు బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదిత ఢిల్లీ మహాసభకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఒడిశా, గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది బీసీ నాయకులు, ప్రజలు తరలివస్తారని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల అగ్రనేతలు కూడా ఈ సభలో పాల్గొంటారని వెల్లడించారు. త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, అన్ని రంగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల పెంపుపై వినతిపత్రం సమర్పించనున్నట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ప్రధాని మోడీ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన నాయకుడిగా, విశ్వగురువుగా గుర్తింపు పొందారు. ఇంతటి బలమైన నాయకత్వంలోనే బీసీలకు న్యాయం జరగకపోతే, భవిష్యత్తులో మరే ఇతర పాలకుల వల్లా అది సాధ్యం కాదన్నారు. బీజేపీ ప్రభుత్వం అణగారిన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందనడానికి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి కావడమే నిదర్శనమని కృష్ణయ్య పేర్కొన్నారు. కేంద్ర మంత్రివర్గంలో 27 మంది బీసీలకు స్థానం కల్పించడంతో పాటు, నలుగురిని గవర్నర్లుగా చేశారని గుర్తుచేశారు. ఒక గిరిజన మహిళను రాష్ట్రపతిగా, దళిత వర్గానికి చెందిన వ్యక్తిని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమించి, దేశంలోని ఉన్నత పదవులన్నింటినీ బిసి, ఎస్సి, ఎస్టీ లకే అందించిన ఘనత మోడీ ప్రభుత్వానిదేనన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ తరహా నిర్ణయాలు తీసుకోలేదని ప్రశ్నించారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించడం, ఓబీసీ కులాల వర్గీకరణ కోసం జస్టిస్ రోహిణి కమిషన్‌ను నియమించడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

# ఎపిలో కొనసాగుతున్న విభిన్న వాతావరణం

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. మరో మూడు రోజులు పిడుగులతో కూడిన వర్షాలు, కొన్నిచోట్ల ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.ఉండాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. శుక్రవారం నెల్లూరు జిల్లా గూడూరులో 44.6 డిగ్రీలు, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 43.7, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 43.3, కృష్ణా జిల్లా కానుమోలు, మన్యం జిల్లా సాలూరులో 43.1, ప్రకాశం జిల్లా కరేడులో 43, విజయనగరం జిల్లా రాజాంలో 42.7, అనకాపల్లి జిల్లా రాజాంలో 42.6, బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం, ఏలూరు జిల్లా నారాయణపురం, తిరుపతి జిల్లా పూలతోటలో 42.3 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

6-6Pg5.qxd:6-6Pg5.qxd 1/1/02 6:21 AM Page 1



# భారత్‌లో 'ఎయిర్‌ట్రంక్' భారీ పెట్టుబడులు



## - 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటు
## - రూ.3 లక్షల కోట్ల పెట్టుబడి పెడుతోంది: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 5:** భారత్‌లో 'ఎయిర్‌ట్రంక్' సంస్థ భారీ పెట్టుబడులు పెట్టబోతోంది. సుమారు రూ.3 లక్షల కోట్లు (దాదాపు 30 బిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టే ప్రణాళికలను ఎయిర్‌ట్రంక్ ప్రకటించింది. 5 గిగావాట్ల (జిడబ్ల్యు) డేటా సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇది భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో అతిపెద్ద పెట్టు బడులలో ఒకటిగా నిలుస్తుందన్నారు. ఆస్ట్రేలియాకు చెందిన డేటా సెంటర్ సంస్థ ఎయిర్‌ట్రంక్ పెట్టిన రూ.3 లక్షల కోట్ల పెట్టుబడి, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ రంగాలలో భారతదేశాన్ని ఒక ప్రపంచ కేంద్రంగా బలోపేతం చేస్తుందని, అదే సమయంలో ఉపాధి అవ కాశాలను సృష్టిస్తుందని, స్థానిక సరఫరా గొలుసులకు మద్దతు ఇస్తుందని, ఆవిష్కరణల ఆధారిత వృద్ధిని వేగవంతం చేస్తుందని ప్రధాని మోడీ వివరించారు. భారీ స్థాయిలో ప్రపంచ పెట్టుబడులు దేశంలోకి ప్రవహిస్తుండటంతో భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణం బలమైన ఊపందుకుంటోందని అన్నారు. "భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణం అద్భుతమైన ఊపందుకుంటోంది. భారతదేశంలో సుమారు రూ.3 లక్షల కోట్లు (30 బిలియన్లు) పెట్టుబడి పెట్టడానికి, 5 గిగావాట్ల (జిడబ్ల్యు) డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి ఎయిర్‌ట్రంక్ ప్రణాళికలను ప్రకటించింది" అని ప్రధాని మోడీ అన్నారు. వివిధ పరిశ్రమలలో క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా స్టోరేజ్‌కు డిమాండ్ వేగంగా పెరుగుతున్న తరుణంలో, ఈ పెట్టు బడి భారతదేశ డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌కు గణనీయంగా ఊపు నిస్తుందని భావిస్తున్నారు. "దేశ డిజిటల్ మౌలిక సదుపాయాల ఎకో సిస్టమ్‌లో ప్రతిపాదించిన అతిపెద్ద పెట్టుబడులలో ఇది ఒకటి" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఇలాంటి ప్రాజెక్టులు ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భారతదేశ పాత్రను మరింత బలోపేతం చేస్తాయని పరిశ్రమ నిపుణులు భావిస్తున్నారు. ఇలాంటి పెట్టుబడుల పెరుగుదల భారతదేశ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌పై పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. విధానపరమైన మద్దతు, ఆవిష్కరణలు, విస్తృత ప్రతిభావంతుల కారణంగా భారతదేశం తదుపరి తరం డిజిటల్ మౌలిక సదుపాయాలకు కీలక గమ్యస్థానంగా స్థిరంగా ఎదుగుతోందని ప్రధాని మోడీ అన్నారు. "ఇలాంటి పెట్టుబడులు క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐకి ప్రపంచ కేంద్రంగా భారతదేశ స్థానాన్ని బలోపేతం చేస్తాయి, అదే సమయంలో ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి, స్థానిక సరఫరా గొలుసులకు మద్దతు ఇస్తాయి. ఆవిష్కరణల ఆధారిత వృద్ధిని వేగవంతం చేస్తాయి. ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు భారతదేశంలోనే ఎక్కువగా రూపుదిద్దుకుంటోందన్నది స్పష్టం" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

# నాకు 41 యేళ్లు.. మా ఇంట్లో పెళ్లి చేయడం లేదు..



### ఉత్తరప్రదేశ్‌లో పోలీసులను ఆశ్రయించిన ఓ మహిళ!

**లక్నో, జూన్ 5:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఓ విచిత్రమైన ఘటన చోటుచేసుకుంది. 41 ఏళ్ల మహిళ తన పెళ్లి జరగకపోవడానికి కుటుంబ సభ్యులే కారణమంటూ నేరుగా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించడం చర్చనీయాంశమైంది. బాధిత మహిళ ఫిర్యాదు ప్రకారం, గత కొన్ని సంవత్సరాలుగా తనకు అనేక వివాహ సంబంధాలు వచ్చినప్పటికీ, తన కుటుంబ సభ్యులు వాటిని పదే పదే తిరస్కరించారని పేర్కొన్నారు. ముఖ్యంగా తన సోదరుడు, వదిన కావాలనే తన పెళ్లిని అడ్డుకున్నారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, పెళ్లి విషయంలో నిర్లక్ష్యం చేయడమే కాకుండా, మానసికంగా కూడా వేధింపులకు గురి చేస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఇరు పక్షాలతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటన పెళ్లి, కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అంశాలపై మరోసారి చర్చకు దారితీసింది. ఒక వ్యక్తి వివాహం జరగకపోవడం కేవలం కుటుంబ సమస్యేనా? లేక మానసిక వేధింపులు ఉంటే చట్టపరమైన జోక్యం అవసరమా? అనే ప్రశ్నలు ఇప్పుడు ముందుకు వస్తున్నాయి. ప్రస్తుతం పోలీసుల ఫిర్యాదుపై విచారణ కొనసాగిస్తున్నారు. ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు వెలుగులోకి రావల్సి ఉంది.

# ప్రధాని మోడీ మంచి మిత్రుడే..
## అయినా 12.5 శాతం సుంకాలు తప్పవు
# స్పష్టం చేసిన ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 5:** యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీ తనకు మంచి మిత్రుడని చెప్పారు. త్వరలో భారత్, యూఎస్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదరబోతోందని కూడా తెలిపారు. భారత్‌లో యూఎస్ వాణిజ్య బృందం పర్యటన పూర్తైన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై తుది దశ చర్చల కోసం వచ్చిన యూఎస్ బృందం భారత అధికారులతో నాలుగు రోజుల పాటు కీలక సమావేశాల్లో పాల్గొంది. ఇక భారత వాణిజ్య విధానాలను మాత్రం ట్రంప్ మరోసారి విమర్శించారు. అమెరికా విధానాలతో భారత్ లాభపడిందని చెప్పారు. అమెరికా ఉత్పత్తులపై మాత్రం భారీగా సుంకాలు విధించేదని అన్నారు. కానీ పరిస్థితి ప్రస్తుతం పూర్తిగా మారిందని అన్నారు. ఇపుడు భారత్ వల్ల యూఎస్ భారీగా లాభపడుతోందని చెప్పారు. వాణిజ్య ఒప్పందంపై విలేకరులు అడిగిన ప్రశ్నకుఆయన జవాబిస్తూ మోడీ నాకు మంచి మిత్రుడేనని అయితే సుంకాలు మాత్రం కొనసాగుతాయని, 12.5 శాతం తప్పదని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 7న ట్రంప్, మోదీ ఫోన్ కాల్ అనంతరం ఇరు దేశాల మధ్య తొలి దశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన మార్గదర్శకాలు ఖరారు చేసారు. రష్యా చమురు కొంటున్నందుకు భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాన్ని తొలగించడంతో పాటు తొలుత విధించిన 25 శాతం ప్రతీకార సుంకాన్ని 18 శాతానికి తగ్గించేందుకు యూఎస్ అంగీకరించింది. ట్రంప్ ప్రతీకార సుంకాల విధింపు రాజ్యాంగవిరుద్ధమని యూఎస్ సుప్రీం కోర్టు ఫిబ్రవరి 20న తీర్పు వెలువరించింది. ట్రంప్ గతసుంకాల స్థానంలోఅన్ని దేశాలపైనా 10 శాతం సుంకం విధించారు. ఇది 150 రోజుల పాటు అమల్లో ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాలు మరోసారి చర్చలు జరిపాయి. భారత బృందం అమెరికాలో పర్యటించగా తాజాగా అమెరికా బృందం భారత్‌కు వచ్చింది. డీల్ దాదాపు కుదిరినట్టే అని వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కూడా చర్చల అనంతరం ప్రకటించారు.

# అసెంబ్లీ ఓటమితో ఢిల్లీ వైపు దృష్టి మళ్లించిన మమత
## లోక్‌సభకు పోటీచేసేందుకు సన్నాహాలు



**కోల్‌కత్తా, జూన్ 5:** రాష్ట్ర మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అసెంబ్లీఎన్నికల ఓటమి, పార్టీలో తిరుగుబాటు, లోక్‌సభ ఎంపిలుసైతం ప్రత్యేకకూటమిగా ఏర్పాటుకు తిరుగుబాటుచేస్తున్న క్రమంలో దీదీ లోక్‌సభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఆమె దృష్టి ఇపుడు ఢిల్లీ రాజకీయాలవైపు మళ్లింది.అసెంబ్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీయే అసెంబ్లీ సీటును గెల్చుకోలేకపోయింది. అటు పార్టీ పరాజయం, ఇటు తాను ఎమ్మెల్యేగా ఓడిపోయిన నేపథ్యంలో రాష్ట్రంలో ఉండటం కంటే ఢిల్లీయే బెటర్ అని మమతా భావిస్తోంది. అందుకే పార్లమెంట్‌వైపు చూస్తున్నారు. లోక్‌సభకు తిరిగి ఎంపీగా వెళ్లాలనుకుంటున్నారు. ఇప్పుడేమీ ఎన్నికలు లేవు. ఉప ఎన్నికలూ లేవు. అయితే ప్రస్తుతం టీఎంసీ తరఫున ఎంపీగా మాజీ క్రికెటర్ అయిన యూసుఫ్ పఠాన్ 2024లో జరిగిన ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని బహరాంపూర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఆయన టీఎంసీ తరఫున లోక్‌సభ ఎంపీగా గెలుపొందారు. కాంగ్రెస్ అగ్రనేత అధిర్ రంజాన్ చౌదరిని భారీ మెజారిటీతో ఓడించారు. ఇప్పుడు ఆ స్థానం నుంచి మమత పోటీ చేయాలనుకుంటున్నారు. ఇందుకోసం ఆ సీటు నుంచి రాజీనామా చేయాలని యూసుఫ్ పఠాన్‌కు మమత సూచించారని ఆయన కూడా సానుకూలంగానే ఉన్నారని తెలుస్తోంది. అక్కడ జరిగే ఉప ఎన్నికలో టీఎంసీ తరఫున మమతా బెనర్జీ పోటీ చేస్తారు. మమతా బెనర్జీ గతంలో కూడా ఎంపీగా పనిచేశారు. 1974 నుంచి ఆరుసార్లు కోల్‌కతా సౌత్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. 1984లో తొలిసారి జాధవ్‌పూర్ నుంచి కాంగ్రెస్ తరఫున ఎంపీగా గెలిచారు. అనంతరం 1989లో ఓడిపోయారు. కోల్‌కతా సౌత్ నియోజకవర్గం నుంచి 1991, 1996లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచారు. అనంతరం ఆమె కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి, సొంత పార్టీ టీఎంసీని స్థాపించారు. 1998, 1999, 2004, 2009లో ఎంపీగా గెలిచారు. మరి యూసుఫ్ పఠాన్ రాజీనామా చేస్తే ఆ స్థానం నుంచి పోటీ చేసి గెలుస్తారా లేదా అనేది ఆసక్తిగా మారింది.

# కొత్త ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నా!
## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తాం: అన్నామలై ప్రకటన
## రాజీనామాను ఆమోదించిన బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీన్



**చెన్నై, జూన్ 5:** తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై శుక్రవారం భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి, యువతపై దృష్టి సారించే 'వి ది లీడర్స్' అనే కొత్త ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమం భవిష్యత్తులో రాజకీయ పార్టీగా రూపాంతరం చెందుతుందని, తదుపరి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. తనను ప్రజా జీవితంలోకి ఆకర్షించిన లక్ష్యాన్ని కొనసాగించాలనే కోరికతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని అన్నామలై పేర్కొన్నారు. తమిళనాడులో సానుకూల మార్పు తీసుకురావడానికి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి తాను బిజెపిలో చేరానని, అయితే ఇప్పుడు భిన్నమైన రాజకీయ మార్గాన్ని ఎంచుకున్నానని ఆయన చెప్పారు. డిసెంబర్ 2025లో పార్టీని వీడాలనే తన ఉద్దేశాన్ని బిజెపి నాయకత్వానికి ముందే తెలియ జేసినట్లు అన్నామలై తెలిపారు. తమిళనాడు ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పార్టీలోనే కొన సాగాలని సీనియర్ నాయకులు కోరారని, అందుకే అధికారికంగా తప్పుకునే ముందు ఆ సమయం వరకు వేచి చూశానని ఆయన వివరించారు. తుది నిర్ణయం తీసుకునే ముందు బిజెపి అగ్రనేతలతో సంప్రదింపులు జరిపినట్లు కూడా ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పట్ల అత్యంత గౌరవాన్ని ప్రకటిస్తూనే, గత 18 నెలలుగా అనేక అంశాలపై బిజెపితో తనకు విభేదాలు ఉన్నాయని అన్నామలై వెల్లడించారు. పార్టీకి సమస్యగా మారడం తనకు ఇష్టం లేదని, అందుకే వేరే మార్గాన్ని ఎంచుకున్నానని, తన రాజకీయ ప్రయాణాన్ని ఒంటరి పోరాటంగా అభివర్ణించారు.

# కర్ణాటక కేబినెట్‌లో లుకలుకలు!
## మంత్రిత్వ శాఖలపై పలువురిలో అసమ్మతి
## మంత్రి రామలింగారెడ్డి రాజీనామా



**బెంగళూరు, జూన్ 5:** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు తర్వాత కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రుల శాఖల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. మంత్రుల్లో సీనియర్లు తమకు తగిన ప్రాతినిధ్యంఇవ్వలేదని గుర్రుగా ఉన్నారు. వీరిలో అత్యంత సీనియర్ అయిన రామలింగారెడ్డి ఏకంగా రాజీనామాచేసారు. నూతన వారంతా ఢిల్లీ లాబీయింగ్‌కు సిద్ధం అయ్యారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్థిక శాఖను తన వద్దే ఉంచుకోగా, కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత నమ్మకస్తుడైన సీనియర్ నేత ప్రియాంక్ ఖర్గేకు హోం మంత్రిత్వ శాఖ బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆమోదించిన అధికారిక జాబితా విడుదలైంది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్థిక శాఖతో పాటు సిబ్బంది పరిపాలనా సంస్కరణల శాఖ, కేబినెట్ వ్యవహారాలు, ఇంటెలిజెన్స్ (అంతర్గత భద్రత), మరే ఇతర మంత్రికి కేటాయించని శాఖలను తన నియంత్రణలోనే ఉంచు కున్నారు. తద్వారా రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలపై ఆయన పట్టు సాధించారు. ఇక అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడైన ప్రియాంక్ ఖర్గేకు హోం శాఖతో పాటు ఐటీ, బయోటెక్నాలజీ, ఈ గవర్నెన్స్ బాధ్యతలను కట్టబెట్టారు. డిప్యూటీ సీఎం జి.పరమేశ్వరకు రెవెన్యూ, యువజన సేవలు, క్రీడల మంత్రిత్వ శాఖ దక్కింది. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కీలక శాఖలు నిర్వహించిన పలువురు సీనియర్ మంత్రులు ఈ కేబినెట్‌లోనూ తమ పాత పోర్ట్‌ఫోలియోలను నిల బెట్టుకున్నారు. ఎంబీ పాటిల్ పరిశ్రమలు, కేహెచ్ మునియప్ప పౌర సరఫరాలు, సతీష్ జార్కిహోళి పబ్లిక్ వర్క్స్, డాక్టర్ శరణ్ ప్రకాష్ పాటిల్ వైద్య విద్యలు యథా తథంగా కొనసాగుతున్నారు. కాగా, గతంలో డీకే శివకుమార్ నిర్వహించిన బెంగుళూరు నగరాభివృద్ధి శాఖను ఈసారి కృష్ణా బైరెగౌడకు అప్పగించారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్యకు పట్టణాభివృద్ధి శాఖ లభించింది. బెంగళూరు అభివృద్ధి వంటి కీలక శాఖల కోసం మంత్రుల మధ్య తీవ్రస్థాయిలో లాబీయింగ్ జరగడం, సీనియర్ నేత రామలింగారెడ్డి వంటి వారు అసంతృప్తి వ్యక్తం చేయడంతో శాఖల ప్రకటన ఆలస్యమైంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేస్తూ అధిష్ఠానం ఈ కేబినెట్ కూర్పును ఖరారు చేసింది. రానున్న వారాల్లో ఈ మంత్రివర్గాన్ని మరింత విస్తరించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. మంత్రి రామలింగారెడ్డి రాజీనామాతో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో రేగిన కలకలంపై ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. రామలింగారెడ్డి తమకు సీనియర్ నేత మాత్రమే కాదని, తనకు అత్యంత ఆప్తమిత్రుడని సీఎం పేర్కొన్నారు. శాఖల కేటాయింపుపై ఆయనకున్న అసంతృప్తి నేపథ్యంలో, తానే స్వయంగా మాట్లాడి, సమస్యను పరిష్కరిస్తానని వెల్లడించారు.

# 12 మందితో హిమంత బిశ్వశర్మ అసోం కేబినెట్ విస్తరణ

**గువాహతి, జూన్ 5:** అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ తన మంత్రివర్గాన్ని శుక్రవారంనాడు విస్తరించారు. కొత్తగా 12 మంది ఎన్డీయే ఎమ్మెల్యేలకు చోటు కల్పించారు. గువాహటిలోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్త మంత్రులతో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ప్రమాణస్వీకారం చేయించారు. తాజా విస్తరణతో ముఖ్యమంత్రితో కలిపి మంత్రి వర్గం 17కు చేరింది. కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రుల్లో అశ్విని రాయ్ సర్కార్, అశోక్ సంఘాల్, బిమల్ బోరా, బిశ్వజిత్ డైమరీ, జయంత మల్లా బరువా, కౌశిక్ రాయ్, కేషబ్ మహంతా, కిష్ణేందు పాల్, నీలిమా దేవి, పిజుష్ హజారికా, రనోజ్ పెగు, సుశాంత బోర్గో హైన్ ఉన్నారు. బిన్న భాషా సమ్మేళనంగా ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. మంత్రులు వివిధ భాషల్లో ప్రమాణస్వీకారం చేశారు. అస్సామీలో పలువురు ప్రమాణం చేయగా, బిమల్ బోరా సంస్కృతంలో, కౌశిక్ రాయ్ హిందీలో, కృష్ణేందు పాల్ బెంగాలీలో ప్రమాణం చేశారు. అస్సాంకు వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ మే 12న ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ నేతలు అజంతా నియోగ్, రామేశ్వర్ తేలి, అసోం గణపరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) నేత చరణ్ బోరో మంత్రులుగా ప్రమాణం చేశారు. ఖనకపురలోని వెటర్నరీ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. 129 మంది సభ్యుల అసెంబ్లీలో ముఖ్యమంత్రితో సహా 19 మంది మంత్రులకు మంత్రివర్గంలో అవకాశం ఉంది.

# 'సుప్రీం' తీరుపై మద్రాస్ హైకోర్టు తీవ్ర అసంతృప్తి
## - ఆరు నెలల్లోపు తీర్పు ఇవ్వాలంటారు - మార్గదర్శకాలిస్తారు, కట్టుబడి ఉండాలి కదా!
## - ఇలా అయితే, నిరంకుశత్వానికి దారితీస్తుంది: జస్టిస్ జి.జయచంద్రన్ ధర్మాసనం వ్యాఖ్య

**చెన్నై, జూన్ 5:** తిరునెల్వేలి జిల్లాలోని రాధాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి 2016-2021 కాలానికి జరిగిన ఎన్నికలలో, మాజీ స్పీకర్ అప్పావును విజేతగా మద్రాస్ హైకోర్టు ఇటీవల ప్రకటించింది. సుప్రీంకోర్టులో ఈ వ్యవహారం పెండింగ్‌లో ఉండటం వల్ల తీర్పు వెలువడటంలో 10 యేళ్ల దురదృష్టకర జాప్యం జరిగిందని పేర్కొంటూ, జస్టిస్ జి. జయచంద్రన్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాలకు సంబంధించి కింది కోర్టు తీర్పుపై అప్పీల్ సుప్రీం కోర్టులో యేళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై మద్రాస్ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల ఫలితాలకు సంబంధించిన కేసుల్లో ఆరు నెలల్లోపు తీర్పు ఇవ్వాలని సుప్రీం స్వయంగా గతంలో ఇచ్చిన తీర్పును ప్రస్తావించింది. ఈ మార్గదర్శకాలకు సుప్రీం కోర్టు కట్టుబడకపోతే దేశంలో నిరంకుశత్వానికి దారితీస్తుందని హెచ్చరించింది. 'ప్రజా ప్రాతినిధ్య చట్టం' ప్రకారం త్వరితగతిన విచారణ జరపాలన్న నిబంధనను న్యాయస్థానాలు పాటించనప్పుడు, అది ప్రజాస్వామ్యాన్ని, సార్వజనీన వయోజన ఓటు హక్కు నిజమైన స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్నారు. "దేశంలో రాజ్యాంగ పరిరక్షకుడిగా ఉన్న న్యాయవ్యవస్థ, ఇతర రాజ్యాంగ వ్యవస్థలతో సమన్వయంతో వ్యవహరించాలి. తద్వారా, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత స్వాతంత్రం పొంది ప్రజాస్వామ్య పాలనను స్వీకరించిన దేశాలలో, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలలో ఒకటిగా మన దేశం గౌరవాన్ని నిలబెట్టాలి. 'ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951'లోని సెక్షన్ 86(7)లో ఉన్న ఆదేశాలను పాటించకపోవడం ప్రజాస్వామ్యాన్ని, సార్వజనీన వయోజన ఓటు హక్కు స్ఫూర్తిని బలహీన పరుస్తుంది. 'మహ్మద్ అక్బర్ కేసు'లో (పైన పేర్కొన్నది) న్యాయస్థానాలు చేసిన వ్యాఖ్యలను విస్మరించడం కొనసాగిస్తే, మనతో పాటే సుమారు 75 యేళ్ల క్రితం స్వాతంత్రం పొందిన ఇతర నిరంకుశ దేశాల పరిస్థితి మనకూ పట్టవచ్చని ఆందోళన చెందుతున్నాను" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2016 నాటి ఎన్నికల్లో ఎఐఎడిఎంకె అభ్యర్థి ఐ.ఎస్. ఇన్‌బదురై రాధాపురం నియోజకవర్గం నుంచి స్వల్ప మెజారిటీతో గెలిచారు. అయితే, ఈ ఫలితాన్ని అప్పావు మద్రాస్ హైకోర్టులో సవాలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్ల కౌంటింగ్‌లో అవకతవకలు జరిగాయని అన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు అప్పావుకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. ఇన్‌బదురై ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. దీంతో, ఇన్‌బదురై సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టు తీర్పుపై స్టే విధించింది.



# సైనిక నియంతృత్వంలో ఆసిమ్‌మునీర్ టాప్!

**కరాచి, జూన్ 5:** పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం కేవలం కాగితాలకే పరిమితమైందని, తెరవెనుక అంతా సైనిక నియంతృత్వమే నడుస్తోందని అంతర్జాతీయ నిఘా ఏజెన్సీలు సర్వేచేసాయి. పాక్ సైన్యానికి సర్వ సైన్యాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ ఇప్పుడు దేశంలోని ప్రతి రక్షణ, పౌర సంస్థను తన నియంత్రణలోకి తెచ్చుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఈ క్రమంలో దేశంలో తీవ్ర తిరుగుబాటు ముప్పు పొంచి ఉందని అక్కడి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దేశ అత్యున్నత నిఘా సంస్థ ఐఎస్ఐను శాసిస్తున్న మునీర్ దేశంలోని అన్ని పోలీస్ బలగాలను కూడా సైన్యం పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. రక్షణ, అంతర్గత భద్రతకు సంబంధించిన అన్ని విభాగాలను ఒకే కమాండ్ కిందకు తెచ్చి తానే సర్వాధికారిగా మారాలనేది ఆయన వ్యూహం. ఈ ప్రతిపాదన గనుక అమల్లోకి వస్తే పాకిస్థాన్‌లోని ప్రాంతీయ ప్రభుత్వాలపై కూడా పౌర అధికారులకు కాకుండా నేరుగా సైన్యానికే పూర్తి పట్టు దక్కుతుంది.

# మహారాష్ట్రలో రైతులకు రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ

**ముంబయి, జూన్ 5:** మహారాష్ట్రలోని రైతులకు దేవేంద్ర ఫడ్నవీస్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని నిర్ణయించింది. పుణ్యశ్లోక్ అహిల్యాదేవి హోల్కర్ షేట్కారి కర్జ్‌ముక్తి యోజన పథకం కింద ఈ మాఫీ జరగనుంది. ఈ నిర్ణయం వల్ల మహారాష్ట్రలోని 56 లక్షల మంది రైతులకు మేలు జరగనుంది. దీనివల్ల మొత్తం 65 లక్షల వరకు రుణాలు మాఫీ అవుతాయి. ప్రభుత్వం రూ.36,585 కోట్లు కేటాయించనుంది. రైతులు ఇప్పటికే రుణాలు చెల్లించి ఉంటే వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించింది. వీరికి రూ.50 వేల వరకు సాయం అందనుంది. అసలు, వడ్డీ కలిపి రూ.2 లక్షల వరకు రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ అవుతాయి. ఇందుకోసం భూయాజమాన్య డాక్యుమెంట్లు వంటివేమీ అక్కర్లేదు. రూ.2 లక్షలకు మించి రుణాలు ఉన్నవారికి వర్తిస్తుంది. వారు అదనపు డబ్బు ముందుగానే బ్యాంకులకు చెల్లించాలి. అంటే రూ.2 లక్షలకంటే ఎక్కువగా లోన్ తీసుకుంటే రూ.2 లక్షలు మినహాయింపు.

# సంక్షిప్తంగా..

## మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన హింస - ముగ్గురు మృతి, పలు ఇళ్లకు నిప్పు



**ఇంఫాల్, జూన్ 5:** మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. సాయుధ దుండగులు ఒక గ్రామంపై దాడి చేశారు. పలువురిపై కాల్పులు జరిపారు. పలు ఇళ్లకు నిప్పంటించారు. దుండగుల కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు మరణించారు. భద్రతా దళాలు ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నాయి. కాంగ్‌పోక్పి జిల్లాలో న్యూకీథెల్మాన్బి ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం తెల్లవారుఝామున 4 గంటల సమయంలో సాయుధులైన దుండగులు లోయిబోల్ గ్రామంపై దాడి చేశారు. సాయుధ మిలిటెంట్లు విచక్షణారహితంగా కాల్పులు జరుపడంతో ముగ్గురు వ్యక్తులు మరణించారు. పలు ఇళ్లకు వారు నిప్పంటించగా అవి కాలి బూడిదయ్యాయి. ఈ సంఘటనతో ఆ గ్రామంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

## బీహార్ మాజీ సిఎంలు లాలూ, రబ్రీదేవికి జెడ్ ప్లస్ భద్రత ఉపసంహారణ



**పాట్నా, జూన్ 5:** బీహార్ ప్రభుత్వం రాష్ట్ర మాజీ సిఎంలు, ఆర్‌జెడి అధినేత లాలూప్రసాద్ యాదవ్, రబ్రీదేవిలకు కల్పిస్తున్న అత్యున్నత స్థాయి జెడ్ ప్లస్ భద్రతను ఉసంహారించుకుంది. విఐపి భద్రతపై జరిపిన సమీక్షల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. జనశక్తి జనతాదళ్ అధినేత, ఆర్జేడీ అధినేత లాలూ యాదవ్ పెద్ద కుమారుడు అయిన తేజ్ ప్రతాప్‌కు కల్పిస్తున్న వై కేటగిరీ భద్రతను కూడా ఉపసంహరించుకున్నట్లు అధికారులు తెలిపారు. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీదేవిలకు ఇకపై బీహార్ ప్రత్యేక సాయుధ పోలీసులు భద్రత కల్పిస్తారు. ఎంపి మీసా భారతికి, తేజస్వి యాదవ్ భార్య రాజశ్రీ యాదవ్‌కు ఉన్న ప్రస్తుత భద్రతా ఏర్పాట్లు కొనసాగుతాయని ఓ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

## భారత్ విదేశాంగ విధానానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసలు



**సెయింట్ పీటర్స్‌బర్గ్, జూన్ 5:** భారతదేశ విదేశాంగ విధానంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. ఇండియాతో బంధాన్ని మరింత విస్తృతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. రష్యాతో బంధం అంశంపై భారత్‌పై అమెరికా వత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించిందని, కానీ ఆ ప్రయత్నాల్లో అమెరికా విఫలమైనట్లు పుతిన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాలను అమెరికా బలహీనపరిచే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మేటి న్యూస్ ఏజెన్సీలతో పుతిన్ మాట్లాడారు. ఈ సందర్భంగా భారత ఆర్థిక వృద్ధిని ఆయన ప్రశంసించారు. భారత్ వ్యక్తిగత విదేశాంగ విధానాన్ని కూడా ఆయన మెచ్చుకున్నారు.

## అసోంలో గిరిజన తెగల 48 గంటల బంద్



**గువాహతి, జూన్ 5:** అస్సాంలోని మోరాన్, మోటోక్ సామాజిక సంఘాలు 48 గంటల బంద్‌కు పిలుపునిచ్చాయి. కొత్తప్రభుత్వ మంత్రివర్గంలో తమ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, ఈ రెండు ఆదిమవాసుల వర్గాలకు షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) హోదా కల్పించాలని డిమాండ్ చేశాయి. శుక్రవారం టిన్సుకియా, దిబ్రూగఢ్ జిల్లాల్లో ఆల్ మోరన్ స్టూడెంట్స్ యూనియన్, ఆల్ అస్సాం మోటోక్ యూత్ స్టూడెంట్స్ అసోసియేషన్, పలు అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో 48 గంటల బంద్ ప్రారంభించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని ఆ సంఘాల నేతలు హెచ్చరించారు. నిరసనకారులు పలుచోట్ల ప్రదర్శనలు నిర్వహించారు. టిన్సుకియా జిల్లాలోని రూపాయ్ సైడింగ్‌కాకోపతార్ టిని ఆలీ వద్ద ప్రధాన సమావేశం జరిగింది.

## పర్యావరణాన్ని కాపాడుకుంటేనే సమాజానికి మంచి భవిష్యత్తు

**- మంత్రి కొల్లు రవీంద్ర**



**విజయవాడ, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** పర్యావరణాన్ని కాపాడుకుంటేనే సమాజానికి మంచి భవిష్యత్తు ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. పర్యావరణ పరిరక్షణ వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. మంగినపూడి బీచ్‌లో విద్యార్థులతో కలిసి పరిశుభ్రతా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొక్కలు నాటారు. బీచ్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. 'పర్యావరణాన్ని మనం కాపాడుకుంటేనే మనకు భవిష్యత్తు ఉంటుంది' అని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్క నాటి పరిరక్షించాలని కోరారు. పర్యావరణ సంరక్షణను ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలన్నారు. మానవాళి ఉనికి ప్రశ్నార్థకం కాకూడదంటే పర్యావరణ పరిరక్షణ అత్యవసరమని మంత్రి వెల్లడించారు. గ్లోబల్ వార్మింగ్ లాంటి సమస్యల నుంచి బయటపడటం మన చేతుల్లోనే ఉందన్నారు. ప్రకృతిని కాపాడుకోవడంలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సీడ్ బాల్స్ ద్వారా అడవుల విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## 'ఇంధనం వాహనాలకు స్వస్తి చెబుదాం... సైకిల్ వాడదాం'



శ్రీకాళహస్తిలో కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ మహమ్మద్ షరీఫ్

**శ్రీకాళహస్తి, జూన్ 5 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు నేటి పరిస్థితిలో ఇంధనం వాహనాలకు స్వస్తి చెప్పి సైకిల్‌ను వాడుదామని పిలుపు నిస్తూ 'సైకిల్ ర్యాలి'ని నిర్వహించారు. శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాయానికి అనుబంధంగా లోబావిలో నిర్వహిస్తున్న గంగా సదన్‌లో కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధులుగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ప్రభుత్వ మైనారిటీల వ్యవహారాల సలహాదారు శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ మహమ్మద్ పాల్గొన్నారు. ఈ కవి సమ్మేళనంలో రాయలసీమలోని వివిధ ప్రాంతాలకు చెందిన కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో నాటి నాయకుడు నందమూరి తారకరామారావు నుంచి నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వరకు మైనారిటీలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ వస్తున్నారని వివరించారు. మైనారిటీలు ఏదీ కోరినా లేదనకుండా మంజూరు చేసేది ఒక్క తెలుగుదేశం ప్రభుత్వమే అన్నారు. అందులో ముఖ్యంగా హజ్ యాత్రకు తెలుగుదేశం ప్రభుత్వం గతంలోనూ ప్రస్తుతం కూడా చేయూత ఇస్తున్నారని వివరించారు. దేశం హయాంలో మైనారిటి కార్పొరేషన్లు ఉర్దూపాఠశాలలు, యూనివర్శిటీలు, షాదీ ఖానాలు, కమ్యూనిటి హాల్స్‌ను నిర్మించారన్నారు. అలాగే మసీదుల్లో పని చేసే నిరుపేదలైన పేష్ఇమాంలకు మౌజన్‌లకు గౌరవవేతనం మంజూరు చేసిన ఘనత చంద్రబాబునాయుడు ప్రభుత్వానిదే అన్నారు. ఐదేళ్ళ వైకాపా పాలనలో విధ్వంసం సృష్టించి ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ఆంధ్రా చేస్తే రెండేళ్లుగా కూటమి అభివృద్ధికి 'బ్రాండ్ అంధ్రా'గా తీర్చి దిద్దుతున్నారన్నారు. నేడు మనకంటూ ఓ రాజధాని వచ్చిందన్నారు.

# 'ఏక్ పేడ్ మా కే నామ్' మొక్క నాటండి

## గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా





ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే అధికారులు

**గుంతకల్ (రైల్వే), జూన్ 5 ప్రభాతవార్త:** గుంతకల్ రైల్వే డివిజనల్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ముగింపు కార్యక్రమం ఘనంగా గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంతకల్ డివిజన్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా పాల్గొన్నారు. పర్యావరణ గురించి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం కేవలం వార్షిక వేడుక మాత్రమే కాదు, ప్రకృతిని రక్షించడం, వనరులను సంరక్షించడం, రాబోయే తరాలకు సుస్థిర భవిష్యత్తు ను అందించడం అనే మన సామూహిక బాధ్యతను గుర్తు చేసే సందర్భంగా ఇది నిలుస్తుంది. ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజా రవాణా వ్యవస్థలలో ఒకటైన భారతీయ రైల్వేలు పర్యావరణ హిత విధానాలను ప్రోత్సహించడంలో ఎల్లప్పుడూ ముఖ్య పాత్ర పోషిం చిందన్నారు. గుంతకల్ డివిజన్ కూడా మహత్తర లక్ష్యానికి చురుకుగా సహకరించింది. అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది, కాంట్రాక్ట్ కార్మికులు, ఇతర భాగస్వాములు ఎంతో ఉత్సాహంతో, నిబద్ధతతో ఇందులో పాల్గొన్నారు. "ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమం కింద మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించడం. పచ్చదనం, స్థిరమైన రైల్వే కార్యకలా పాల ప్రోత్సాహం కోసం వివిధ పర్యావరణ అను కూలచర్యలు, అవగాహనకార్యక్రమాలు నిర్వహించారు. ఇంజనీరింగ్, మెకానికల్, మెడికల్, కమర్షి యల్, ఎలక్ట్రికల్, ఆపరేటింగ్, ఎస్‌టి, పర్సనల్, ఆర్‌పిఎఫ్ తదితరవిభాగాలు సమన్వయంతో పనిచేశారన్నారు. రైల్వే ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచడంలో ముందుండి సేవలందించిన సఫాయి కర్మచారులు, పర్యవేక్షకులు, స్వచ్ఛంద సేవకులు ప్రత్యేక అభినంద నలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించి పాల్గొన్న ప్రజలకు, విద్యార్థులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యం: ప్రతి ఓటుపై దృష్టి పెట్టాలి

**• ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలి: కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



**విడవలూరు (నెల్లూరు), జూన్ 5 ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని, గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచించారు. విడవలూరు మండలం ఊటుకూరు గ్రామంలో నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో కొత్తగా నమోదైన ఓట్లు, ఓటర్ల జాబితాలను బీఎల్వోలు, బీఎల్ఏలు, నాయకులు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు విజయవంతానికి సహకరించిన క్లస్టర్ నాయకులు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి నెలలో 25 రోజులు జిల్లా పార్టీ కార్యాలయం, నివాసంలో అందుబాటులో ఉంటానని, సమస్యలు ఉన్న నాయకులు, ప్రజలు నేరుగా కలవవచ్చని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటాలని, ఇంధన పొదుపు కోసం వాహనాల వినియోగాన్ని తగ్గించి సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈస్టర్న్ ఛానల్ డిస్ట్రిబ్యూట్ కమిటీ చైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు రామిరెడ్డి విజయ భాను రెడ్డి, పూండ్ల అచ్యుత్ రెడ్డి, మండల ఇంచార్జ్ అడపాల శ్రీధర్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఆవుల వాసు, చెముకుల కృష్ణ చైతన్య, ఒగు నాగేశ్వరరావు, సత్తివోలు సత్యం రెడ్డి, తుమ్మల లక్ష్మయ్య, మండల అధ్యక్షులు ఏటూరు శ్రీహరి రెడ్డి, సమాధి శ్రీనివాసులు, దూది విజయ రాఘవన్, చేవూరు రాంప్రసాద్, సింహాద్రి అయ్యప్ప, జగన్మోహన్, ఇనగంటి సురేందర్ రెడ్డి, శ్రీహరికోట గోపి, రవిబాబు, ఆవుల రవిచంద్ర, సున్నపు పాపారావు, బీఎల్వోలు, బీఎల్ఏలు, క్లస్టర్ ఇన్చార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 9న విక్రమ సింహపురి స్నాతకోత్సవం

**వెంకటాచలం (నెల్లూరు), జూన్ 5 ప్రభాతవార్త:** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ 10, 11, 12 స్నాతకోత్సవ వేడుకలు జూన్ 9వ తేదీన జరుగుతాయని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ అల్లం శ్రీనివాసరావు వెల్లడించాడు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. 6,017 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, డిగ్రీ కోర్సులకు 4921 మంది, పీజీ కోర్సులకు1075, దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 9న నెల్లూరులోని ఈపిఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించే స్నాచకోత్సవ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పట్టాలు అందుకోనున్నారు. గోల్డ్ మెడల్ 45, పీహెచ్ డి పట్టాలు 21 21 మందికి అందజేయనున్నారు. ముగ్గుర ప్రముఖులకు డాక్టరేట్ ప్రధానం ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కే ఐ వరప్రసాద్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, ప్రొఫెసర్ గో వర్ధన్ దాస్ గవర్నర్ చేతుల మీదుగా డాక్టర్ ప్రధానం చేయనున్నారు. డిగ్రీ పట్టాలు పొందే విద్యార్థులకు ప్రత్యేకంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు ఆర్టీసీ బస్టాండు ఆత్మకూరు బస్టాండు అన్నమయ్య సర్కిల్ నుంచి బస్సులు బయలుదేరినట్లు వెల్లడించారు పాసుల పొందిన వారు మాత్రమే బస్సుల్లో అనుమతి కలదని తెలిపారు. ఇచ్చిన సమయానికి అక్కడికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ కే సునీత, ఎగ్జామ్ ఆఫ్ కంట్రోలర్ మధుమతి, సుజనా నాయక్, పాల్గొన్నారు.

# సైబర్ నేరంలో నయా మోసం

**- నకిలీ ఏటిఎం ఇచ్చి నగదు దోపిడీ**

**తిరుపతి, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** అత్యవసరానికి నగదు డ్రాచేయడానికి ఏటిఎంకు వెళ్ళిన బాధితురాలిని ఓ సైబర్‌నేరస్తుడు కొత్త తరహాలో నమ్మించి మోసం చేశాడు. ఆపైగా అదే బ్యాంకుకు చెందిన నకిలీ ఏటిఎం కార్డును ఇచ్చి ఆమె చేతిలోని నిజమైన ఏటిఎం కార్డును పట్టుకెళ్ళి ఏకంగా ఒకేరోజులో రూ.1.26 లక్షలు నగదు డ్రా చేసేశాడు. దీనిపై మొబైల్‌ఫోన్‌కు అందిన మెసేజ్‌లతో బాధితురాలు అప్రమత్తమై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిరుపతి మంచాలవీధికి చెందిన చీకటి కుసుమ తిరుపతి విష్ణు నివాసంలో కాంటాక్ట్ విధానంలో స్వీపర్‌గా పని చేస్తూంది. ఈమెకు తిరుపతి రాయల్ నగర్ కెనరా బ్యాంక్‌శాఖలో అకౌంట్ ఉంది. డబ్బు అవసరమై తన అవసరాల కొరకు గురువారం ఏటీఎం నుండి రూ.3వేలు నగదు డ్రా చేసుకునేందుకు ఆమె కార్డును కుమార్తెకు ఇచ్చి పంపింది. ఆమె కుమార్తె తిరుపతి పాత మెటర్నటీ ఆస్పత్రి కూడలిలోని కెనరా బ్యాంక్ ఏటిఎం లోడబ్బులు డ్రా చేసింది, డబ్బులు డ్రా చేసే సమయంలో ఎవరో ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫిర్యాది కుమార్తెతో మాటలు కలిపి ఆమెను మోసం చేయాలని ఉద్దేశ్యంతో ఆమె వద్ద ఉన్న కెనరా బ్యాంక్ ఏటిఎం కార్డును తీసుకుని వేరొక ఏటిఎం బ్యాంకు ఏటీఎం కార్డు ఇవ్వగా అది చూసుకోకుండా ఫిర్యాది కుమార్తె ఏటీఎం కార్డును ఇంటికి వెళ్ళింది. ఫిర్యాది తన బ్యాంకు ఖాతా నుండి సుమారు రూ.1,26 లక్షలు ఏటిఎం కార్డు ద్వారా వివిధ ఏటిఎం సెంటర్ల నందు డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించింది. శుక్రవారం వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెస్ట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ హేమాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో తండ్రి, కొడుకు మృతి

**రాయదుర్గం, జూన్ 5 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం బొమ్మక పల్లి గ్రామంలో విద్యుత్ షాక్ తో తండ్రి, కొడుకు మృతి చెందారు. బొమ్మక్క పల్లి గ్రామానికి చెందిన ఆనందు కుమారుడు తేజ శుక్రవారం గుమ్మగట్ట మండలం కర సూరయ్య దొడ్డి గ్రామ పంచాయతీ కి చెందిన తాగునీటి సరఫరా బోరు మోటార్ మరమ్మత్తు రావడంతో ట్రాక్టర్ ద్వారా మోటారును పైకి ఎత్తుతుండగా ప్రమాదవశాత్తు పైనున్న కరెంట్ తీగలు ఇనుప పైపులకు తగిలి తండ్రి ఆనందు కొడుకు తేజ ఇద్దరూ క్షణాల్లోనే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ ఆదేశాలతో గుమ్మగట్ట పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విద్యుత్ అధికారులు కాని పంచాయతీ అధికారులు కానీ సంఘటన జరిగిన స్థలానికి రాకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. తండ్రి కొడుకులు మరణంతో బొమ్మక్క పల్లి గ్రామంలో విషాద ఛాయలో నెలకొన్నాయి పొట్టకూటి కోసం పనులు చేసుకుంటూ బతుకుతారు గడుపుతున్న తండ్రి కొడుకులను విధి మృత్యు రూపంలో కవలించిందని వాపోయారు.

## 'ప్రశాంతమైన మనసే విజయానికి పునాది'




**తిరుపతి, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆరోగ్యవంతమైన పోలీసు సిబ్బందే సమాజానికి ఉత్తమ సేవలు అందించగలరని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సూచించారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు, సిబ్బంది యోగా కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్య సూత్రాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన 'హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్' కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పాల్గొన్నారు. పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణ, విధి నిర్వహణలో సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడిందన్నారు. ఈ సందర్భంగా యోగా ధ్యాన సాధనల్లో స్వయంగా పాల్గొని సిబ్బందికి ప్రేరణనిచ్చారు. పోలీసు శాఖలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ప్రతి రోజూ ప్రజాసేవలో నిమగ్నమై ఉంటారని, విధి నిర్వహణలో బిజీగా ఉండటం వల్ల చాలామంది తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యం ప్రతి ఒక్కరికీ అత్యంత విలువైన సంపద అని, ముఖ్యంగా ఎక్కువ సమయం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం అత్యవసరమని ఎస్పీ తెలిపారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా కాపాడుకోవాలని సూచించారు. భారతదేశానికి ప్రపంచానికి అందించిన గొప్ప వారసత్వాల్లో యోగ ఒకటని, యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెంపొందుతాయని చెప్పారు. యోగా సాధన అనేక ఆరోగ్య సమస్యలను అధిగమించడంలో సహాయపడటమే కాకుండా, సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా, ధ్యాన సాధనలను ఆచరించారు.

## విజయవాడలో జీపులతో ఢీకొన్న కేసులో నిందితుల రిమాండ్ 19 వరకు పొడిగింపు

**విజయవాడ, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో జీపులతో ఢీకొన్న కేసులో నిందితుల రిమాండ్ పొడిగిస్తూ న్యాయస్థాన ఆదేశం జారీ చేసింది. రిమాండ్ ముగియడంతో వర్చువల్ విధానంతో నిందితులను కోర్టులో హాజరుపరిచారు. విచారించిన కోర్టు నిందితులు బొల్లా ఓం, రోహిత్‌కు జూన్ 19 వరకు రిమాండ్ పొడగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. నిందితులు ఇద్దరిని విచారించేందుకు కస్టడీ కోరుతూ మరోసారి పిటిషన్ దాఖలు చేశారు. నిందితులు గత నెల ఒక యువతి కోసం విజయవాడలో జీపులతో ఢీకొంటూ హల్‌చల్ చేసారు. వీరిని పోలీసులు అరెస్ట్ చేసి గతంలో కోర్టు పరిచారు. అప్పట్లో వారికి రెండు వారాల రిమాండ్ విధించారు. ఈ కేసులో ఒక నిందితునిపై డ్రగ్స్ తీసుకున్నట్లు మరో కేసును పోలీసులు వైద్య పరీక్షల అనంతరం నమోదు చేసారు.

## టిటిడి ఇంజనీరింగ్ పోస్టుల భర్తీలో అక్రమాలు

**• కొత్త వివాదం తెరపైకి వచ్చిందన్న వైసిపి భూమన**

**తిరుపతి, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడిలో 2023లో ఇంజనీరింగ్ పోస్టుల భర్తీలో నోటిఫికేషన్ విడుదల చేసిన తరూవాత ఎదురైన న్యాయపరమైన సమస్యలతో ఆ నోటిఫికేషన్ నిలిపివేశామని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టిటిడి చైర్మన్‌గా బిఆర్‌నాయుడు బాధ్యతలు చేపట్టిన ఏడాదిన్నర తరువాత మళ్ళీ అదే నోటిఫికేషన్‌పై ఇంజనీరింగ్ పోస్టుల భర్తీకి సన్నాహాలు చేయడం అక్రమాలు జరిగాయన్నారు. గతనెలలో 10, 11తేదీల్లో జరిగిన టిటిడిలోని 60 ఇంజనీరింగ్ పోస్టులు భర్తీలో అక్రమాలపై విచారణ జరిపించాలని కరుణాకకర్‌రెడ్డి శుక్రవారం డిమాండ్ చేశారు. 27 ఎఇఇ, 10 ఎఇ,19 ఎటిఒ, విద్యుత్ జెఇ 4 పోస్టులు భర్తీకు నోటిఫికేషన్ ఇచ్చినట్లే ఇచ్చి నిలిపివేసిన 2023పైనే కొనసాగించా రన్నారు. మొత్తం 60 పోస్టులకు సంబంధించి ఖాళీలు అప్పటి సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో 2023 నవంబర్ 23న నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. 30వేల అప్లికేషన్‌లు వచ్చాయన్నారు. రాయలసీమ ప్రాంత వాసులకు ప్రత్యేక కేటాయింపులు జరపకపోవడంతో అప్పట్లోనే న్యాయ వివాదాలు తలెత్తే అవకాశం ఉండటంతో తాత్కాలికంగా నోటిఫికేషన్ నిలిపి వేశామని ఆయన గుర్తుచేశారు. ఎన్నికల తర్వాత నిర్వహించాలని నిలిపి వేశామని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పోస్టుల భర్తీచేయడానికి చర్యలు తీసుకోవడంలో అర్థం ఏమిటని కరుణాకర్‌రెడ్డి ప్రశ్నించారు. దీని వెనుక కుట్ర దాగి ఉందన్నారు.

## భర్తను కత్తిపీటతో కడతేర్చిన భార్య



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

**శ్రీకాకుళం, జూన్ 5 ప్రభాతవార్త:** మద్యం కోసం అడిగినంత డబ్బులు ఇవ్వలేదనే కోపంతో భార్యపై దాడికి దిగడమే కాకుండా, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేస్తున్న భర్తను భార్యే కత్తిపీటతో కొట్టి ప్రాణాలు తీసిన ఘోర ఘటన శ్రీకాకుళం నగరంలో కలకలం రేపింది. ప్రకాష్‌నగర్ కాలనీలో గురువారం అర్ధరాత్రి ఈ విషాదం వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, నరసన్నపేట మండలం దేవాది గ్రామానికి చెందిన ధర్మాన అసిరినాయుడు (49) గత ఏడాదిన్నరగా జలుమూరు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య జయలక్ష్మి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు మణికంఠ స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ కుటుంబం రెండు నెలల క్రితమే నగరంలోని ప్రకాష్‌నగర్‌లో అద్దె ఇంట్లోకి మారింది. అసిరినాయుడు మద్యానికి బానిస కావడంతో, ప్రతిరోజూ డబ్బుల కోసం భార్యను వేధించేవాడు. గురువారం రాత్రి కూడా భార్య వద్ద మద్యం కోసం డబ్బులు తీసుకున్న ఆయన, కొద్దిసేపటికే మళ్లీ వచ్చి అదనపు డబ్బులు కావాలని గొడవ పడ్డాడు. జయలక్ష్మి నిరాకరించడంతో ఇద్దరి మధ్య వివాదం ముదిరింది. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన అసిరినాయుడు రెండు నెలల క్రితమే కొనుగోలు చేసిన ఎసిని పగలగొట్టడానికి ప్రయత్నించాడు. దీంతో ఆవేశం ఆపుకోలేకపోయిన జయలక్ష్మి, వెనుక నుంచి కత్తిపీటతో భర్త తలపై బలంగా కొట్టింది. తీవ్ర రక్తస్రావం కావడంతో అసిరినాయుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గురువారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన కుమారుడు మణికంఠ, తండ్రి రక్తం మడుగులో పడి ఉండడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాడు. వెంటనే ఆయన 112 అత్యవసర నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. రెండో పట్టణ సిఐ ఈశ్వరరావు తన సిబ్బంది, క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. అయితే కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుకు, పోలీసుల ప్రాథమిక విచారణకు మధ్య తేడాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. డబ్బుల గొడవలో తండ్రి తనను కొట్టాడని, ఎదురుదాడిలో వెనక్కి నెట్టడంతో కిందపడి స్పృహ కోల్పోయాడని తల్లి తనకు చెప్పినట్లు కుమారుడు మణికంఠ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కానీ ఘటనా స్థలంలో లభించిన ఆధారాల ప్రకారం ఇది పథకం ప్రకారం జరిగిన హత్యగా అనుమానిస్తున్నామని సిఐ తెలిపారు. ప్రస్తుతం పోలీసులు ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తమిళనాడు తరహాలో తెలుగు వర్చువల్ అకాడమీ

**• తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్ చంద్ర**



**విజయవాడ, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** తమిళనాడు తరహాలో తెలుగు వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు డి.పి.ఆర్ సిద్ధం చేసినట్టు తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్ చంద్ర తెలియచేశారు. శుక్రవారం వడ్డేశ్వరంలోని అకాడమీ కార్యాలయంలో పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడులో 45 దేశాలకు తమిళం నేర్పిస్తున్న తరహాలో తెలుగు భాష నేర్పించడానికి వర్చువల్ అకాడమీ ఏర్పాటు చెయ్యాలన్న సంకల్పంతో ఈ బృహుత్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. దీనికి సంబందించిన డిపిఆర్ మంత్రి లోకేష్‌కి సమర్పిస్తున్నట్టు తెలియచేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా ముందుకు పోవడానికి ప్రాథమికంగా కనీసం వంద కోట్లు కేటాయించాలని కోరినట్టు ఆయన తెలియచేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మైగ్రేటడ్ లేబర్‌తో పాటు ఇతర దేశాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొన్న వారికి కూడా భాషను పరిచయం చేస్తాము అన్నారు. అకాడమీ ముద్రించే ఇంటర్ పుస్తకాలు బుక్ షాప్స్‌లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు అకాడమీ పుస్తకాలు కొనుగోలు చేయడం లేదని, దాని వల్ల అకాడమీకి తీరని నష్టం జరుగుతుంది అన్నారు. ప్రభుత్వ సిలబస్‌తో తయారు అయిన పుస్తకాలు కొనుగోలు చేయకుండా తాము తయారు చేసుకొనే కంటెంట్ వినియోగించుకోవడం సరైంది కాదని అన్నారు. ముఖ్యంగా చైతన్య, నారాయణ, బాష్యం లాంటి సంస్థలు తమ విద్యార్థులు కొనుగోలు చేసేలా మార్గదర్శకత్వం చెయ్యాలని అన్నారు. భవిష్యత్తులో ప్రతి కాలేజీ సందర్శిస్తామని, 2010లో ఉమ్మడి రాష్ట్రంలో అకాడమీ పుస్తకాలు కొనుగోలు చేసేలా జీవో విడుదల చేశారని, దానిని ఇప్పటికీ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందని, అకాడమీ నష్టాలలోకి పోకుండా చర్యలు తీసుకోవాలి అని ఇప్పటికే లోకేష్‌ని కోరినట్టు విల్సన్ తెలియచేశారు. తెలుగు అకాడమీ కంటెంట్ వాడకుండా పైరసీ చేస్తే కాపీరైట్ ఉల్లంఘనకు పాల్పడినట్టు అవుతుంది అన్నారు. లక్షలాది మంది ఇంటర్ విద్యార్థుల హక్కులు కాపాడ్డానికి అకాడమీ సిద్ధంగా వుంది అన్నారు. అకాడమీ కంటెంట్ వాడే ప్రైవేట్ పాఠశాలల పై కఠిన చర్యలకు సిఫారస్ చేస్తాము అన్నారు.

**యోజన తరహాలో మ్యాగజైన్:** యోజన తరహాలో త్వరలో మ్యాగజైన్ విడుదల చేస్తున్నామని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్ చంద్ర తెలిపారు. విద్యా, వైజ్ఞానిక, సాహిత్యం మహిళా సాధికారిత లక్ష్యంగా మ్యాగజైన్ రూపొందిస్తున్నట్టు విల్సన్ తెలియచేసారు.

**అకాడమీ పోస్టుల భర్తీ:** అకాడమీ పోస్టుల భర్తీ విషయంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు లేఖ రాయడం జరిగిందని, ఎపిపిఎస్‌సి ఆలస్యం చేసే పరిస్థితి ఉంటే ఇతర ప్రభుత్వ ఏజెన్సీలకు అప్పగించాలని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్ చంద్ర కోరారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఔనత్యం కాపాడాలి అంటే కేబినెట్ క్యాడర్ ఇవ్వాలని విల్సన్ కోరారు.

**సంస్కృత అకాడమీకి స్థలం:** తిరుపతి కేంద్రంగా సంస్కృత అకాడమీ అభివృద్ధి చేస్తామని, అందుకు గాను తిరుమలలో ఐదు ఎకరాలు కేటాయించాలని విల్సన్ కోరారు. ఈ మేరకు టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడుకి విజ్ఞప్తి చేశామన్నారు. జాతీయ సంస్కృత యూనివర్సిటీ తిరుపతిలో వున్న నేపథ్యంలో స్థల సేకరణ అనివార్యం అన్నారు. సంస్కృత భాష అభివృద్ధి కోసం తిరుమల తిరుపతి నిధులు కేటాయించాలని కోరారు. సిఆర్‌డిఏ స్థలంలో తెలుగు అకాడమీ ప్రధాన భవనం కోసం రెండు ఎకరాల స్థలం అడిగినట్లు తెలిపారు. త్వరలో స్థలం కేటాయిస్తే అకాడమీ నిధులతో భవన నిర్మాణం చేసుకుంటామన్నారు.

## జిటి ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి

## లోకో పైలట్‌కు తీవ్ర గాయాలు



**ఒంగోలు (క్రైమ్), జూన్ 5 ప్రభాతవార్త:** ప్రకాశం జిల్లా సింగరాయకొండ సమీపంలో ఢిల్లీ- చెన్నై జీటీ ఎక్స్‌ప్రెస్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనలో రైలుపై మద్యం సీసాలు, రాళ్లు విసరడంతో ఇంజిన్ ముందు భాగంలోని అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో లోకో పైలట్ జయరామ్ తీవ్రంగా గాయపడగా, రైల్వే అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. దాడి కారణంగా ఇంజిన్ క్యాబిన్‌లో ఉన్న లోకో పైలట్ ముఖం, శరీరంపై గాయాలు కావడంతో రైలును సమీపంలోని ఉలవపాడు రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. అక్కడ వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు.

లోకో పైలట్ ఆరోగ్య పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఘటన సమాచారం అందుకున్న రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఎదురుగా వస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తూ మద్యం సీసా లేదా రాయి వచ్చి తగిలిందా, లేక రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ఆకతాయిలు ఉద్దేశపూర్వకంగా దాడి చేశారా అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

ఈ ఘటనతో రైల్వే అధికారుల్లో ఆందోళన నెలకొంది. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడం ఊరటనిచ్చినప్పటికీ, రైళ్ల భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. సంఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు తెలిపారు. స్థానిక ప్రాంతాల్లోని సీసీ కెమెరా దృశ్యాలను కూడా రైల్వే పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## మండుటెండలో..
# చంద్రబాబు సైకిల్‌పై సవారీ



**విశాఖ వీధుల్లో సైకిల్‌పై ఫిట్‌నెస్ సందేశం!-వయసు కేవలం సంఖ్య మాత్రమేనని మరోసారి నిరూపించిన సీఎం..-ఆరోగ్యవంతమైన ఏపీ కోసం ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం**

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

'మహా' విశాఖలో భగభగ మండుతున్న ఎండనూ లెక్కచేయకుండా సీఎం ఎన్.చంద్రబాబునాయుడు సైకిల్ తొక్కుతూ మరోసారి తన ఉత్సాహాన్ని చాటిచెప్పారు. ఆరోగ్యకర జీవనశైలి, ఫిట్‌నెస్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలనే లక్ష్యంతో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో ఆయన స్వయంగా 8వ పేజీలో

## కైలాసగిరి నుంచి భోగాపురం వరకూ బే సిటీ ప్రాజెక్టు

విశాఖపట్నం,జూన్ 05,ప్రభాతవార్త

బే సిటిగా విశాఖ నగరాన్ని తీర్చి దిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌పై సీఎం 9 జిల్లాల 8వ పేజీలో



**ఏజెన్సీ ప్రాంతాల్లో టూరిజం ప్రాజెక్టులు -విశాఖ ఎకనమిక్ రీజియన్ సమీక్షలో అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం**



## ఆక్వా రంగంలో ఏపీకి
# గ్లోబల్ హబ్ హోదా..

**6 ప్రాంతాలు కలుపుతూ కారిడార్ -బ్లూ ఎకానమీతోనే భవిష్యత్ -ఆర్థికాభివృద్ధి సాధ్యం -దేశాన్ని అగ్రపథాన నిలిపేలా అద్భుతంగా పని చేస్తున్న ప్రధాని మోదీ -సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్ షాప్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు -రూ.72 కోట్లతో కాకినాడ పోర్ట్ ఆధునీకరిస్తామన్న కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్**







విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త

రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆక్వా రంగానికి భారతదేశం లైట్ హౌస్‌లా ఉంటే... దానికి ఏపీని కేంద్ర బిందువు చేస్తామన్నారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఆక్వా కారిడార్ అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ కారిడార్లో 8వ పేజీలో

## వైకాపాది రాజకీయ నాటకాల పరంపరే

**కోడికత్తి, గులకరాయి నుంచి విగ్రహాల ధ్వంసం దాకా అన్నీ సానుభూతి డ్రామాలే -11 సీట్లకే పరిమితమైనా వైఖరి మారలేదు : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**



గాజువాక,జూన్ 5,ప్రభాతవార్త :

ఐదేళ్లపాటు అరాచక పాలన సాగించిన వైకాపాను గత ఎన్నికల్లో ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా ఆ పార్టీ నాయకులకు బుద్ధి రాలేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కోడికత్తి డ్రామా నుంచి నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం వరకు తామే కుట్రలు చేసి, కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడం వైకాపా అధినేత వైఎస్ జగన్‌కు అలవాటుగా మారిందని మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

### ప్రతిపక్షంలోనూ కుట్ర రాజకీయాలు...

"అధికారంలో ఉన్నప్పుడు కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టిన వైకాపా... ఇప్పుడు ప్రతిపక్ష హోదాకు కూడా పనికిరారని ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టినా మారలేదు" అని పల్లా విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రజల దృష్టి మళ్లించడమే జగన్ వ్యూహమని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం సొంత బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును వాడుకున్న చరిత్ర వారిదేనని, అసలు నిందితులను కాపాడుతూ ప్రత్యర్థులపై బురదజల్లడం వైకాపా నైజమన్నారు.

### అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యం....

రాజధాని అమరావతి నుంచి విశాఖ పెట్టుబడుల వరకు ప్రతి అంశంపైనా వైకాపా బురదజల్లుతోందని పల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖకు టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ వంటి ఐటీ దిగ్గజాలు వస్తుంటే కోర్టుల్లో కేసులు వేసి పెట్టుబడిదారులను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఉచిత బస్సు ప్రయాణం, పోలవరం, అమరావతి నిర్మాణంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తిరుమల, శ్రీశైలం వంటి పవిత్ర పుణ్యక్షేత్రాలను సైతం రాజకీయాలకు వాడుకుంటూ భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ పర్యటనలన్నీ రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడానికేనని, గంజాయి కేసుల నిందితులు, రౌడీషీటర్లను పరామర్శిస్తూ నేరాలను ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. రోజుకో కుట్రతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న ఇలాంటి శక్తుల పట్ల రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అభివృద్ధికి అండగా నిలవాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ: గంటా




## ముఖ్యమంత్రికి ఘనస్వాగతం

విశాఖపట్నం-ప్రభాతవార్త

విశాఖపట్నం పర్యటన నిమిత్తం ఆంధ్రాయూనివర్సిటీ గ్రౌండ్ ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు వాయుమార్గం ద్వారా చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, ప్రభుత్వ విప్ పీ.వి.జి.ఆర్. నాయుడు (గణబాబు), జిల్లా కలెక్టర్ ఎం. అభిశక్తి కిషోర్, శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, సిహెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, వెలగపూడి రామకృష్ణ బాబు, ఏ పి కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి, ఎన్ టి ఆర్ వైద్య సేవ సీతంరాజు సుధాకర్, వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ప్రణవ గోపాల్, వి ఎం ఆర్ డి ఎ కమీషనర్ తేజ్ భరత్, జి వి ఎం సి కమీషనర్ కేతన్ ఘర్గ స్వాగతం పలికారు.

## సీఎం చంద్రబాబుతో కలిసి విశాఖలో మొక్కలు నాటిన
# స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

**ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పచ్చదనం పెంపుపై స్పీకర్ ఆదర్శం**




# సీ ఫుడ్ రవాణాకు పూర్తి సహకారం అందిస్తాం..

**కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**




***సీ ఫుడ్ ఎయిర్ కార్గో రవాణా ఛార్జీలు సరళం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం -కార్గో రవాణాకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. -పొటాటో చిప్స్ అయిన, కండక్టర్ చిప్స్ అయిన సరైన సమయంలో రవాణాకు ఎయిర్ కార్గో నే సమాధానం -పీఎం గతి శక్తిలో భాగంగా భోగాపురం, నోయిడా, నవీ ముంబై విమానాశ్రయాల్లో కార్గో టెర్మినల్స్ అభివృద్ధి***

విశాఖపట్నం,జూన్ 05, ప్రభాతవార్త

దేశీయంగా, అంతర్జాతీయంగా సముద్ర ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో రవాణా చేసేందుకు ఎయిర్ కార్గో సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం నాడు విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్ లో సీ ఫుడ్ ఎక్స్పోర్ట్ అంశంపై జరిగి న నేషనల్ సెమినార్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తో పాటుగా ముఖ్య అతిథిగా రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రామ్మోహన్ నాయుడు సముద్ర ఆహార ఉత్పత్తుల రవాణా విషయంలో విమానయాన శాఖ పూర్తి తోడ్పాటు అందిస్తుందని స్పష్టం చేశారు. దేశీయ రవాణా అయినా, అంతర్జాతీయంగా రవాణా అయినా.. సరైన సమయంలో చేరవేసే వ్యవస్థ మన ఎయిర్ కార్గో వద్ద సిద్ధంగా ఉందని తెలిపారు. ఎయిర్ కార్గో రవాణా ఛార్జీలు కూడా మరింత

## నవీకరించిన పాస్ పుస్తకాల పంపిణీ చేసిన గంటా




## డీటీలకు పదోన్నతులు

**తహశీల్దార్లగా పలు చోట్ల పోస్టింగ్‌లు -తక్షణమే విధుల్లో చేరాలి -విశాఖ కలెక్టర్ ఆదేశాలు**

విశాఖపట్నం, జూన్ 5 ప్రభాతవార్త

విశాఖ పరిధిలో సీనియర్ డిప్యూటీ తహసీల్దార్లగా పని చేస్తున్న పలువురికి పదోన్నతలు లభించాయి. సీసీఎలఏ ఆదేశాల మేరకు జోన్-1 పరిధిలోని పలువుర్ని పదోన్నతిపై తహసీల్దార్లగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. వారు తమ విధుల్లో తక్షణమే చేరకపోతే వారి పదోన్నతుల్ని కోల్పోతారని, వారికి చెల్లించాల్సిన బకాయిలన్నీ తక్షణమే చెల్లించాలని ట్రెజరీ అధికారుల్ని కలెక్టర్ ఆదేశించారు. ఐసీ ఎస్‌డీసీ విభాగంలో పని చేస్తున్న టి.శ్యామలక్ష్మి తహసీల్దార్‌గా కలెక్టరేట్‌లో డిప్యూటేషన్‌గా నియమించారు. ఆనందపురం తహసీల్దార్ ఎస్. శ్రీనుబాబు (అడహాక్)ను ఆనందపుంర తహసీల్దార్‌గా నియమించారు. విజయనగరం నుంచి వచ్చిన దాడిశెట్టి శైలజను పద్మనాభం వేశారు. డీసీఎస- "వోలో డీటీగా పని చేస్తున్న కె.రామలక్ష్మిని పదోన్నతిపై గాజువాక తహసీల్దార్‌గా నియమించారు. అదే విధంగా కలెక్టరేట్‌లోనూ డిప్యూటేషన్‌పై పని చేయాలని ఆదేశించారు. సీతమ్మధారలో హెచ్‌డీటీగా పని చేస్తున్న త్రినాధరావును గాజువాక తహసీల్దార్ (ఎఫఏసీ)గా, స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి ఎస్‌డీసీగా నియమించారు. పెందుర్తిలో పని చేస్తున్న ఐ.వెంకటరావు (అడహాక్)ను జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయ డీటీగా, పెందుర్తి తహసీల్దార్ (ఎఫఏసీ)గా నియమించారు. ఏఎసఆర్ జిల్లా కొయ్యూరు తహసీల్దార్ పి.మురళీబాబు (అడహాక్)ను సీతమ్మధార కార్యాలయంలో హెచ్‌డీటీగా నియమించారు.

## విశాఖ పోర్ట్‌లో చారిత్రక ఘట్టం..
# కేప్ సైజ్ నౌకకు విజయవంతమైన బెర్తింగ్

**భారీ కార్గో నౌకల నిర్వహణలో మరో మైలురాయి.. పెరిగిన విశాఖ పోర్ట్ సామర్థ్యం**





## మండుటెండలో..

7వ పేజీ తరువాయి ..

పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవోటెల్ వరకు సుమారు 5.5 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 21 నిమిషాల 18 సెకన్లలో పూర్తి చేసిన సీఎం, ప్రయాణం మొత్తం ఉత్సాహంగా కనిపించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మార్గాల మీదుగా సాగిన ఈ సైకిల్ యాత్ర నగర ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ఎక్కడా అలసటకు లోనుకాకుండా సైకిల్ తొక్కిన సీఎం, మార్గమధ్యంలో కనిపించిన ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆయనను చూసిన పలువురు



యువత, వృద్ధులు, మహిళలు సైతం ఉత్సాహంగా స్పందించారు. ప్రజలతో మమేకమవుతూ సాగిన ఈ సైకిల్ ప్రయాణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ర్యాలీలో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, శారీరక దృఢత్వం కోసం సైక్లింగ్ ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు సందేశం చేరింది. ప్రస్తుత వేగవంతమైన జీవనశైలిలో వ్యాయామానికి సమయం కేటాయించడం తగ్గిపోతున్న నేపథ్యంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా సైకిల్ తొక్కడం ద్వారా ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలనే సానుకూల సందేశాన్ని సమాజానికి అందించారు. మండుతున్న ఎండలోనూ ఆయన చూపిన చురుకుదనం, క్రమశిక్షణ, ఆరోగ్యం పట్ల ఉన్న శ్రద్ధ పలువురికి స్ఫూర్తిగా నిలిచింది.

## సీఎం చంద్రబాబుతో కలిసి విశాఖలో మొక్కలు నాటిన ..

విశాఖపట్నం-ప్రభాతవార్త

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ పట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింత కాయల అయ్యన్నపాత్రుడు పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చ దనం పెంపొందించ డమే లక్ష్యంగా సాగిన ఈ కార్యక్రమంలో వారు స్వయంగా చెట్లు నాటి ప్రజలకు ఆదర్శంగా నిలి చారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టి, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఆక్వా రంగంలో ఏపీకి..

7వ పేజీ తరువాయి ..

ఆక్వా అభివృద్ధికి అవసరమైన రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్స్, టెక్నాలజీని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అతి తక్కువ వ్యయంతో అత్యధిక ఉత్పత్తి సాధించడమే లక్ష్యమని చెప్పారు. ఆక్వా ఉత్పత్తులకు సంబంధించిన ఉప ఉత్పత్తులతో కూడా ఆర్థిక ప్రగతి సాధించవచ్చన్నారు. శుక్రవారం విశాఖలో జరిగిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్ షాప్‌లో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఆంధ్రా ష్రింప్, ఇండియా సీ-ఫుడ్' బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తున్నామని చెప్పారు. ఆక్వా రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన నాలుగు శాఖలకు చెందిన కేంద్ర మంత్రులు ఒకే వేదికపై రావడం శుభపరిణామంగా అభివర్ణించారు.

### రాష్ట్రంలో మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు

'రూ.72 కోట్లతో కాకినాడ పోర్ట్ మోడ్రనైజేషన్ చేపడతామని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించినందుకు సంతోషమని సీఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. కేంద్ర మత్స్య శాఖకు ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15 రోజుల్లో కేటాయిస్తామన్నారు. నెల రోజుల్లో కార్యాలయానికి శంకుస్థాపన చేసి నిర్మాణం ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు. ఆక్వా ఉత్పత్తులను మరింత పెద్ద స్థాయిలో ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రం తీసుకునే చర్యలకు రాష్ట్రం వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తామని ఇప్పటికే చెప్పిందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలు చేరుకోవడానికి బ్లూ ఎకానమీ ఎంతో కీలకమని, పాండ్ టు పోర్ట్స్, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్, బ్లూ ఎకానమీ టు వికసిత్ భారత్ అనే విధానంతో పని చేయాలన్నారు. భారత ఆశలను... ఆశయాలను నెరవేర్చేందుకు ఏపీ బ్లూ ఎకానమీ దోహదపడుతుందని భావిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే సీ-ఫుడ్ బిజినెస్‌లో ఇండియా వాటా కేవలం 5 శాతం మాత్రమే ఉందని, ఈ రంగంలో ఇండియాకు పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి.' అని ముఖ్యమంత్రి అన్నారు.

### ఏటా రూ.28,000 కోట్ల ఎగుమతులు

'భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదే. బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్న చోట నాగరికతలు విలసిల్లుతాయని, ఏపీలో గోదావరి, కృష్ణ వంటి జీవ నదులు ఉన్నాయని సీఎం చంద్రబాబు వివరించారు. సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఏపీ రెండో అతి పెద్ద రాష్ట్రం. 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఉత్పత్తి ఏపీలో జరుగుతోంది. ఏపీలో బ్లూ ఎకానమీ పెరిగితే... దేశ ప్రగతికి దోహద పడుతుందన్నారు. భారతదేశం మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతంగా ఉందన్నారు. భారత దేశం మొత్తం రొయ్యల ఉత్పత్తిలో ఏపీ షేర్ 66 శాతమని, భారతదేశం మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో దాదాపు ఏపీ నుంచే 38 శాతం ఆదాయం వస్తోందన్నారు.

### ప్రధాని మోదీని మరింత బలపరుద్దాం..

'ఆక్వా పరిశ్రమలో ఇన్నోవేషన్లు చేసే వారిని ఆంధ్రప్రదేశ్ ఆహ్వానిస్తోందని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ఏపీ పని చేస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడితే.. ఆ పెట్టుబడులకు ప్రోత్సాహమిచ్చి... అభివృద్ధి చేస్తాం. ఆక్వా ఉత్పత్తులతో చక్కటి ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రజలు ఇప్పుడు ప్రొటీన్ ఉత్పత్తులనే ఆహారంగా తీసుకుంటున్నారు. ఆక్వా ఉత్పత్తుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. సరైన సమయంలో సరైన నేత నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండటం అదృష్టమని, 21వ శతాబ్దం నరేంద్ర మోదీదే అని తెలిపారు. భవిష్యత్తులో భారత దేశాన్ని అగ్ర భాగంలో నిలపడానికి ప్రధాని మోదీ అద్భుతంగా పని చేస్తున్నారన్నారు. ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న మోదీని మరింత బలపర్చాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు.

### కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఉత్పత్తులు

ఆక్వా రంగం అభివృద్ధిపై కేంద్ర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆక్వా రంగం విషయంలో కేంద్ర ప్రభుత్వం సంక్షోభం నుంచి అవకాశాలను అన్వేషిస్తోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు. అమెరికా టారిఫ్‌లు విధించినప్పటికీ... గతేడాది కంటే మిన్నగా ఆక్వా ఎగుమతులు చేసుకోగలిగామని, అంతర్జాతీయంగా కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఎగుమతులు వెళ్లాయన్నారు. ఇప్పుడు మన ఆక్వా ఉత్పత్తులకు మరిన్ని మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆక్వా ఎగుమతులతో ఆర్థికాభివృద్ధితో పాటు.. మత్స్యకారులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. మోడ్రనైజ్డ్ బోట్లను మత్స్యకారులకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని, 200 మోడ్రనైజ్డ్ బోట్లు ఏపీకి వస్తున్నాయని చెప్పారు. ప్రజల ఆహార అలవాట్లు మారాయని, ప్రొటీన్ ఆహారాన్ని అధికంగా తీసుకుంటున్నారని... దీంతో ప్రొటీన్ ఎక్కువ ఉండటం వల్ల ఆక్వా ఉత్పత్తులకు రోజు రోజుకూ డిమాండ్ పెరుగుతోందన్నారు. ఆక్వాలో కేవలం 12 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేస్తున్నాం... సీ-ఫుడ్ ప్రాసెసింగ్ విషయంలో మరింత అభివృద్ధి చేయాలి. ఆక్వాలో టెక్నాలజీ, ఇన్నోవేషన్లకు పెద్ద పీట వేయాలి. వ్యవసాయంతో పోల్చుకుంటే ఆక్వాలో ఎక్కువ అభివృద్ధి కనిపిస్తోంది. ఆక్వాకు రూ.1.50కే విద్యుత్ ఇస్తున్నాం. ఫిష్ ఫీడ్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఫిష్ మీల్ ఎగుమతులను 50 శాతానికి పరిమితం చేయాలని కోరుతున్నాం. సోయా విషయంలోనూ కేంద్రం నుంచి సహకారం అవసరం. ఇతర దేశాలతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లు జరగాల్సి ఉంది.. దీనికి కేంద్రం ఇప్పటికే సహకరిస్తోంది. ప్రపంచంలోని ప్రతీ కిచెన్‌లోకి ఇండియన్ ఆక్వా ఉత్పత్తులు వెళ్లేలా కేంద్రం ప్రణాళికలు రూపొందించడం సంతోషంగా ఉంది.' అని అన్నారు. 'పీఎంఎంకేఎస్ఎస్‌వై పథకాన్ని ఏపీలో అమలు చేస్తాన్నారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం... ఏడాది 30 బిలియన్ యూఎస్ డాలర్ల విలువైన ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వ లక్ష్యం పెట్టుకుంది. కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యంలో 30 శాతం ఏపీ వాటా ఉంటుందని హామీ ఇస్తున్నాం. సర్కులర్ ఎకానమీకి ఆక్వా రంగాన్ని అనుసంధానం చేసేలా భీమవరంలో ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందిస్తోందని సీఎం వివరించారు. మార్కెట్ ఇబ్బందులతో మద్దతు ధర కోల్పోయిన వివిధ పంటల రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు.

## సీ ఫుడ్ రవాణాకు పూర్తి సహకారం అందిస్తాం..

7వ పేజీ తరువాయి ..

సరళం చేసేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నేడు సీ ఫుడ్ ఎక్స్పోర్ట్ లో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది అంటే దానికి కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని తెలిపిన రామ్మోహన్ నాయుడు.. ఇందుకు 1990 దశకంలోనే చంద్రబాబు నాయుడు బీజం వేసినట్టు స్పష్టం చేశారు. సరైన కార్యాచరణతో నేడు దేశంలోనే మొదటి స్థానంలో రాష్ట్రంలోని సీ ఫుడ్ ఎక్స్పోర్ట్ నిలవడం ఆనందంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో సీ ఫుడ్ వ్యాపారం కాదని.. అదిమత్యాకారుల జీవన విధానం అని స్పష్టం చేసారు. భోగాపురం విమానాశ్రయం కూడా ఎగిరే చేప ఆకృతిలో నిర్మించామని.. వన్ ఎయిర్ పోర్ట్.. వన్ ప్రొడక్ట్ నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని.. సీ ఫుడ్ ఎక్స్పోర్ట్ నెట్వర్క్ ను భోగాపురంలో మరింత విస్తృతం చేస్తామని హామీ ఇచ్చారు. విమానయానం అంటే అందరూ.. ప్రయాణీకుల రవాణా గురించే ఆలోచన చేస్తారని.. అంతకంటే ఎక్కువ ప్రాధాన్యత కార్గో రవాణాకు తాము ఇస్తున్నట్టు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. 2014నుండి దేశంలో 90కి పైగా విమానాశ్రయాలు నిర్మాణం అయ్యాయని.. 2047 నాటికి 350 విమానాశ్రయాలకు చేరుకుంటామనే కార్యాచరణ తో ముందుకు వెళ్తున్నట్టు స్పష్టం చేశారు. సీ ఫుడ్ ను మరింత నాణ్యతతో అందివ్వాలి అంటే ఎయిర్ కార్గో రవాణా అత్యంత అవసరం అని గుర్తు చేశారు. జాతీయ రహదారులు, పోర్టులు, ఎయిర్పోర్టులు.. ఇలా మల్టీ మోడల్ కనెక్టివిటీని ఉపయోగించుకుని సరైన సమయంలో.. సరైన స్థానానికి.. మత్స్య సంపద చేరుకునేలా.. మంచి లాభాలు పొందేలా ఈ విభాగంలో వ్యాపారం చేసేవారు ఆలోచన చెయ్యాలని అన్నారు. పీఎం గతి శక్తి పథకంలో భాగంగా భోగాపురం, నవీ ముంబై, నోయిడా ఇంకా అనేక విమానాశ్రయాలలో కార్గో టెర్మినల్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇందులో సీ ఫుడ్ రవాణా అధిక ప్రాధాన్యత ఇస్తూ పూర్తి సహకారం అందిస్తామని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఈ పరిశ్రమలో ఉన్న వ్యక్తులు అందరూ ఎయిర్ కార్గో సేవలను మరింతగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రాజీవ్ రంజన్, చిరాగ్ పాశ్వాన్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ బీద మస్తాన్ రావు పాల్గొన్నారు.

## కైలాసగిరి నుంచి భోగాపురం వరకూ బే సిటీ ప్రాజెక్టు

7వ పేజీ తరువాయి ..

కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విశాఖలోని కైలాసగిరి నుంచి భోగాపురం వరకూ ఈ బేసిటీ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. వీఈఆర్ పై ఓ ప్రాజెక్టు మోనిటరింగ్ యూనిట్ ను కూడా ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచనలు ఇచ్చారు. గ్రేహౌండ్స్ కు చెందిన 303 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్ ను నిర్మించాలని ఆదేశించారు. అలాగే కైలాసగిరి ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలకూ ఆహ్లాదం కలిగించేలా బీచ్ వాటర్ స్పోర్ట్స్ తో పాటు వినోదం కలిగించే వివిధ ప్రాజెక్టులు చేపట్టేలా పెట్టుబడులను ఆహ్వానించాలన్నారు. విశాఖలోని జంతు ప్రదర్శన శాలను కూడా ఆధునీకరించి పర్యాటకుల్ని ఆకర్షించేలా చూడాలని సూచించారు. విశాఖలో ఎర్రమట్టి దిబ్బలు, బౌద్ధక్షేత్రాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్టుతో పాటు, పోలవరం ప్రాజెక్టు, పాపికొండలు లాంటి పర్యాటక ప్రాంతాలు అదనపు ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. ఈ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా పెద్ద ఎత్తున పర్యాటక ప్రాజెక్టులు వచ్చే అవకాశముందని తెలిపారు. వివిధ ప్రాజెక్టుల వద్ద పారిశ్రామిక ప్రాంతాలను ఆనుకుని ఏర్పాటు చేసే టౌన్ షిప్ ల అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. నీతి ఆయోగ్ సమర్పించిన వీఈఆర్ ప్రాజెక్టు నివేదికను ప్రజల్లో చర్చకు ఉంచాలని , విద్యార్థులు, మేధావుల నుంచి అభిప్రాయాలు, ఆలోచనలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి, విశాఖ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి వరకూ 9 జిల్లాల కలెక్టర్లు, వీఈఆర్ కన్వీనర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టీ కృష్ణబాబు, వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి సౌరబ్ గౌర్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త కిషోర్ తదితరులు హాజరయ్యారు.

## విశాఖ పోర్ట్‌లో చారిత్రక ఘట్టం..

విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త:

దేశంలోని ప్రముఖ పోర్టులలో ఒకటైన విశాఖపట్నం పోర్ట్ అథారిటీ మరో కీలక మైలురాయిని అధిగమించింది. భారీ కేప్ సైజ్ బల్క్ క్యారియర్ నౌక 'ఎం.వి. గ్రేషియస్'ను ఇన్నర్ హార్బర్‌లోని ఈక్యూ-1 బెర్త్ వద్ద విజయవంతంగా బెర్తింగ్ చేసి తన నిర్వహణ సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది. సుమారు 292 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పు, 12.2 మీటర్ల డ్రాఫ్ట్ కలిగిన ఈ భారీ నౌక 1,00,198 మెట్రిక్ టన్నుల కార్గోతో విశాఖపట్నం పోర్టుకు చేరుకుంది. ఇంత భారీ కేప్ సైజ్ నౌకను విజయవంతంగా బెర్తింగ్ చేయడం ద్వారా పోర్టు చరిత్రలో మరో కీలక అధ్యాయం నమోదైంది. ఈ విజయంతో విశాఖపట్నం పోర్ట్ భారీ బల్క్ క్యారియర్ నౌకలను మరింత సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యాన్ని పెంచుకుంది. అంతర్జాతీయ సముద్ర వాణిజ్యంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా పోర్టు మౌలిక వసతులు, కార్యాచరణ సామర్థ్యాలు ఉన్నత స్థాయికి చేరుకుంటున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘనత వెనుక పోర్ట్ ఛైర్‌పర్సన్ జాస్మీత్ సింగ్ బింద్ర, డిప్యూటీ ఛైర్‌పర్సన్ రోష్ని అపరంజి కోరటి అందించిన మార్గదర్శకత్వం, పోర్ట్ సిబ్బంది సమిష్టి కృషి కీలక పాత్ర పోషించిందని తెలిపారు. పోర్ట్ కార్యదర్శి ఎం. శంకర్ బాబు మాట్లాడుతూ, సముద్ర వాణిజ్య రంగంలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా పోర్టు సామర్థ్యాలను నిరంతరం అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కేప్ సైజ్ నౌక విజయవంతమైన బెర్తింగ్ విశాఖపట్నం పోర్టు ప్రతిష్టను మరింత పెంచడమే కాకుండా, భవిష్యత్తులో భారీ కార్గో నిర్వహణకు కొత్త అవకాశాలను తెరుస్తుందని పేర్కొన్నారు.

## కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు స్వాగతం

విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త



విశాఖ పర్యటన నిమిత్తం నగరానికి విచ్చేసిన కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ఉత్తర నియోజక వర్గ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.విష్ణు కుమార్ రాజు ఘన స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా కేంద్ర మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన అయన విశాఖ పట్నం అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక రంగ ప్రగతికి చేపడుతున్న కార్యక్రమాలు దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాయని పేర్కొన్నారు.

## నవీకరించిన పాస్ పుస్తకాల పంపిణీ చేసిన గంటా

పద్మనాభం, జూన్ 4, ప్రభాతవార్త

వైసీపీ హయంలో స్వలాభంతో రెవిన్యూ వ్యవహారాలు అస్తవ్యస్తంగా చేశారని, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ పేరుతో రైతులను భయబ్రాంతులకు గురి చేశారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పద్మనాభం మండలం రేవిడి గ్రామంలో గురువారం పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ రూ. 682 కోట్లతో పాస్ పుస్తకాలపైనే కాకుండా సర్వే రాళ్లపై కూడా తన ఫోటోను ముద్రించుకుని జగన్మోహన్ రెడ్డి.. రైతుల భూముల పై పెత్తనానికి సిద్ధపడ్డారని విమర్శించారు. 77 లక్షల సర్వే రాళ్లపై జగన్ ఫోటోను తీసేయడానికి కోట్ల రూపాయల ప్రజా ధనం ఖర్చయ్యిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాలపై రాజముద్ర వేసి దశల వారీగా అందించడానికి రూ.22 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. గ్రామ సభల్లో భూ వివరాలు ప్రకటనతో భూ యజమానులు సంతృప్తి చెందితేనే పాస్ బుక్ లు అందజేస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని వెల్లడించారు. మరోవైపు 24 నెలల కాలంలో రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లకు దక్కుతుందన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి అనేక ఐటీ ఆధారిత ప్రాజెక్టులు వస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, కాళ్ల నగేష్ కుమార్, గాడు వెంకటప్పడు, కురుమిన లీలావతి, కాళ్ల సత్యనారాయణ, ఆవాల గంగరాజు, మజ్జి నందీష్, పాండ్రంగి అప్పలనాయుడు, వాల్ల నందిని, నీలాపు సూర్యనారాయణ, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సైకిల్ యాత్రకు పటిష్ట వైద్య భద్రత..

### 12 మెడికల్ క్యాంపులు, 3 అంబులెన్సులు ఏర్పాటు

విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త :



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైకిల్ యాత్ర సందర్భంగా ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల నుంచి నోవాటెల్ వరకు నిర్వహించిన సైకిల్ యాత్ర మార్గంలో ప్రతి 300 మీటర్లకు ఒకటి చొప్పున మొత్తం 12 మెడికల్ క్యాంపులు, మూడు అంబులెన్సులను అందుబాటులో ఉంచినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు తెలిపారు. సైకిల్ యాత్రలో పాల్గొన్న ప్రజలు, అధికారులు, సిబ్బందికి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాలను నియమించారు. మొదటి రిఫరల్ యూనిట్‌గా భానోజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, కాంటింజెన్సీ ఆసుపత్రిగా అపోలో ఆసుపత్రిని సిద్ధంగా ఉంచారు. అదనంగా మూడు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ 108 అంబులెన్సులు, వైద్య సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర ఔషధాలను అందుబాటులో ఉంచి సమగ్ర వైద్య భద్రత కల్పించారు. ఇదిలా ఉండగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు మాట్లాడుతూ, మొక్కలు మానవాళికి ప్రాణవాయువును అందించడమే కాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సుంకర రాంబాబు ప్రధమ వర్ధంతి

### రక్తదాన శిబిరానికి విశేష స్పందన

గాజువాక జూన్ 5,ప్రభాతవార్త



దివంగత సుంకర రాం బాబు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు సుంకర ఉదయ్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వ హించారు. గాజువాక డిపో సమీ పంలోని హనుమాన్ ఆలయం వద్ద గల ఫిట్‌నెస్ ఫారెస్ట్ జిమ్‌లో సంజీవిని బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ శిబిరాన్ని ప్రారంభించారు. యువత నుంచి విశేష స్పందన లభించగా, సుమారు 75 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. గుడివాడ లతీష్ మాట్లాడుతూ సుంకర రాంబాబు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. తండ్రి ఆశయాలను కొన సాగిస్తూ కుమారుడు ఉదయ్ రక్తదాన శిబిరం నిర్వహించడం అభినంద నీయమన్నారు. యువత ఇలాంటి సామాజిక సేవా పనుల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు, స్థానిక యువత పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత..

విశాఖపట్నం జూన్ 5, ప్రభాతవార్త



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కింగ్ జార్జ్ హాస్పిటల్‌లో సూప రింటెండెంట్ డా.ఐ.వాణి హాస్పిటల్ సిబ్బంది నర్సింగ్ సిబ్బంది స్టూడెంట్స్‌తో ప్రతిజ్ఞ చేయించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ పర్యావర ణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, కాలుష్యాన్ని తగ్గించడానికి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేధించాలని, ప్రతి ఒక్కరికి దీనిపై అవగాహన కల్పించాలని అన్నారు. హాస్పిటల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సూపరింటెండెంట్ అడిషనల్ డీఎంఈ డా.ఐ.వాణి డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డా.జి.వాసవి లత, డా.ఎం.చంద్రశేఖర నాయుడు, డా.సౌమిని డిసీఎస్ఆర్ఎంఓ డా.ఆర్వీ ఎస్ కుమార్ ఆర్ఎంఓలు డా.ఏ.రాజేష్, డా.బంగారయ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, శానిటేషన్, నర్సింగ్ సిబ్బంది నర్సింగ్ స్టూడెంట్లు పాల్గొన్నారు.

## చిన్నారి వైద్యానికి స్థానికులు ఆర్థిక సాయం...

### బలిరెడ్డి పిలుపుతో దాతలు సహకారం.....

అగనంపూడి ప్రభాత వార్త.

ఏడాది పాపకి క్యాన్సర్ తో బాధపడుతున్న చిన్నారికి వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారు. వేపగుంట బీసీ కాలనీ గ్రామానికి చెందిన సానా పతి సురేష్, సత్యవతి దంపతుల కుమార్తె సహస్రకు బ్యూరో క్యాన్సర్ సోకింది. సుమారుగా 30 లక్షల రూపాయలు వైది ఖర్చులు అవుతాయని డాక్టర్లు చెప్పారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అగనంపూడి గ్రామానికి చెందిన బలి రెడ్డి నాగేశ్వరరావు మానవసేవ మాధవ సేవ ఉద్దేశంతో దాతలు కొరకు పాప పేరు మీద వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. గ్రూపులో పాప పరిస్థితిని వివరించి తల్లిదండ్రుల యొక్ ఎకౌంటు స్కాన్ గ్రూపులో పెట్టడం జరిగింది. ఎంతోమంది, పెద్దలు, యువకులు, మాజీ క్రీడాకారులు, గూగుల్ పే, పేటీఎం,ద్వారా స్పందించి రూ 2,55,433 సమకూర్చారు. రెండు రోజుల్లో దాతలు స్పందించిన పట్ల నాగేశ్వరావు వారికి కృతజ్ఞతలు తెలిపారు. పాప వైద్యానికి మరి కొంతమంది సహాయం చేయాలని కోరారు.

వార్త VAARTHA CLASSIFIEDS
CLASSIFIEDS

SITUATION VACANT
★ A leading Construction and Interiors Company is looking for dynamic Sales Professionals. contact 7989580108, hr@ogipl.in
(Ro.No.8896)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ — A Government of India Undertaking

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591), విశాఖపట్నం
మెలొడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాభాగ్, విశాఖపట్నం-530020.
ఫోన్: 8332956773, 7095199455, ఇ-మెయిల్: cb13591@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నం వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే లాంఛనంగా/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 23.06.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం: 23.06.2026, మ॥ 01.00 గం.ల నుండి మ॥ 02.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 22.06.2026, సాయంత్రం 6.00 గం॥ల లోపు

| క్ర. నెం. | ఋణగ్రహీత / హామీదారులు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నంకు బదిలీ చేయడమైనవి) | తనఖాలో ఉన్న ఆస్తి వివరములు | రిజర్వు ధర (రూ.) | ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%) |
|---|---|---|---|---|
| 1 | M/s. జైన్ ఆగ్రో ఫుడ్స్, అధీకృత సంతకందారు/పార్టనర్లు: 1. శ్రీ నితేష్ కుమార్ బొహ్రా మరియు 2. శ్రీ ఆషిక్ జైన్, హామీదారు: శ్రీ ప్రకాష్ ఎమ్ జైన్ తేది 30.04.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 723.63 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | ఆంధ్రప్రదేశ్-531031, విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, అనకాపల్లి రెవిన్యూ డివిజన్, అనకాపల్లి రిజిస్ట్రేషన్ జిల్లా, కశింకోట మండలం, జమ్మాదులపాలెం పంచాయితీ, బయ్యవరం గ్రామం, ఎస్.నెం. 663/18 లో శ్రీ ఆషిక్ జైన్ పేరున గల ఎ. 3.02 సెంట్లు లేదా 1.200 హెక్టార్లు భూమి. హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 605.65 లక్షలు | రూ. 60.57 లక్షలు |
| 2 | M/s జైన్ ఆగ్రో ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్ పోర్ట్స్, అధీకృత సంతకందారు/పార్టనర్లు: (1) శ్రీ ఆషిక్ జైన్ మరియు (2) శ్రీ ప్రకాష్ ఎమ్ జైన్, హామీదారు: శ్రీ నితేష్ కుమార్ బొహ్రా. తేది 30.04.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 396.93 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | ఆంధ్రప్రదేశ్ – 531031, విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి, అనకాపల్లి రెవిన్యూ డివిజన్ మరియు ఎస్ఆర్ఓ, కశింకోట మండలం, బయ్యవరం పంచాయితీ, బయ్యవరం గ్రామం, పట్టా నెం 1717 మరియు 1718, ఎస్.నెం. 663/17 లో ఆషిక్ జైన్ పేరునగల ఎ. 2.50 సెంట్లు లేదా 1.00 హెక్టార్లు (రెండు ఐటమ్‌లుగా ఉన్నది) మెట్ట భూమిగా మార్చబడినది. హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 501.60 లక్షలు | రూ. 50.16 లక్షలు |
| 3 | శ్రీ ప్రసంగి నానాజి, తండ్రి: అప్పలరాజు & శ్రీమతి ప్రసంగి మహేశ్వరి, భర్త: శ్రీ పి. నానాజి తేది 30.04.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 37.77 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | సెర్సాయ్ ఐడి: 400026139515: షెడ్యూలు-ఎ: విశాఖపట్నం జిల్లా, పెదగంట్యాడ సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్, అనకాపల్లి రిజిస్ట్రేషన్ జిల్లా, చినగంట్యాడ గ్రామం, సర్వే నెంలు. 147/8 మరియు 147/9 నందు 865.75 చ॥గ॥ల లేదా 732.88 చ॥మీ॥ స్థలం. హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 26.82 లక్షలు | రూ. 2.69 లక్షలు |
| | షెడ్యూలు-బి: విశాఖపట్నం జిల్లా, చినగంట్యాడ గ్రామం, మొత్తం 865.75 చ॥గ॥లలోని అవిభాజ్యపు మరియు అనిర్దేశపు 42.86 చ॥గ॥లు లేదా 35.836 చ॥మీ॥లు వాటా స్థలంతో "ఎవిఎస్ ఎన్‌క్లేవ్" నాలుగవ అంతస్తులో 1000 చ॥అ॥ (ఉమ్మడి ఏరియాలు కలుపుకొని) మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లో కారు పార్కింగ్ 80 చ॥అ॥లుతో అసంపూర్తిగానున్న రెసిడెన్షియల్ ఆర్‌సిసి ఫ్లాట్ నెం.504. హద్దులు డీడ్ ప్రకారం. | | | |
| 4 | 1. మెస్సర్స్ మౌంట్ డియాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ (ఋణగ్రహీత), 2. శ్రీమతి ముత్తంశెట్టి విజయ నిర్మల (ఛైర్‌పర్సన్), 3. శ్రీ ముత్తంశెట్టి కృష్ణారావు (జనరల్ సెక్రటరీ), 4. శ్రీ సుమేధ యాగ్ని ముత్తంశెట్టి (వైస్ ప్రెసిడెంట్), 5. శ్రీ ముత్తంశెట్టి అఖిల (జాయింట్ సెక్రటరీ), 6. శ్రీమతి ముత్తంశెట్టి నాగేశ్వరమ్మ (ట్రెజరర్), 7. మెస్సర్స్ నోవా ఎడ్యుకేషనల్ సొసైటీ, 8. ప్రియదర్శిని ఎడ్యుకేషనల్ సొసైటీ, 9. మెస్సర్స్ మౌంట్ డియాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ, అడవివరం. తేది 30.04.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 2746.74 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు. | ఆస్తి నెం-1: i. పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మండలం, శనివారపుపేట గ్రామపంచాయతీ, నేషనల్ హైవే రోడ్డు, ఆర్‌యస్ నెం.11/1బి నందు 0.98 సెంట్లు విస్తీర్ణముగల తనఖావుంచిన కమర్షియల్ ఖాళీ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. ఆర్‌యస్ నెం.11/1బి యొక్క హద్దులు. హద్దులు డీడ్ ప్రకారం. ii. పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మండలం, శనివారపుపేట గ్రామపంచాయతీ, నేషనల్ హైవే రోడ్డు, ఆర్‌యస్ నెం.12/1A, 12/1C నందు 2 ఎకరముల 91 సెంట్లు విస్తీర్ణముగల తనఖావుంచిన కమర్షియల్ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 613.00 లక్షలు | రూ. 61.30 లక్షలు |
| | ఆస్తి నెం-2: i. పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మండలం, తంగెళ్ళమూడి గ్రామపంచాయతీ, నేషనల్ హైవే వద్ద, సమీప డోర్ నెం.5-148, నోవా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీ, ఆర్.యస్. నెం.15/1 నందు 0.42 సెంట్లు విస్తీర్ణముగల తనఖావుంచిన స్థలము మరియు అందులోని భవనమునకు సంబంధించిన యావదాస్తి. హద్దులు డీడ్ ప్రకారం. ii. పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మండలం, తంగెళ్ళమూడి గ్రామపంచాయతీ, నేషనల్ హైవే వద్ద, సమీప డోర్ నెం.5-148, నోవా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆర్.యస్. నెం.15/6 నందు 0.85 సెంట్లు విస్తీర్ణముగల తనఖావుంచిన స్థలము మరియు కాలేజీ భవనమునకు సంబంధించిన యావదాస్తి. హద్దులు డీడ్ ప్రకారం. iii. పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మండలం, తంగెళ్ళమూడి గ్రామపంచాయతీ, నేషనల్ హైవే వద్ద, సమీప డోర్ నెం.5-148, నోవా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆర్.యస్. నెం.15/2 Part, 15/3 Part, 15/4 Part, 15/5Part, నందు 1 ఎకరము 31 సెంట్లు విస్తీర్ణముగల తనఖావుంచిన స్థలము మరియు కాలేజీ భవనమునకు సంబంధించిన యావదాస్తి. హద్దులు డీడ్ ప్రకారం. | | రూ. 1154.00 లక్షలు | రూ. 115.40 లక్షలు |
| | ఆస్తి నెం-3: పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మండలం, తంగెళ్ళమూడి గ్రామపంచాయతీ, నేషనల్ హైవే దగ్గర, సమీప డోర్ నెం.5-148, నోవా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీ, ఆర్.యస్. నెం.14/2 Part, 14/3 Part,14/4 Part, 14/5 Part, 14/6 Part, 15/1 Part, 15/2 Part, 15/3 Part, 15/4 Part, 15/5 Part, 15/6 Part, 16/60 Part,16/64 Part, 16/66 Part, 16/69 Part, & 16/61 Part నందు 39784.80 చ॥గ॥ విస్తీర్ణముగల ఖాళీ స్థలము. హద్దులు డీడ్ ప్రకారం. | | రూ. 1259.00 లక్షలు | రూ. 125.90 లక్షలు |

ఆస్తి తనిఖీ తేది & సమయం : 16.06.2026, ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 83329 56773, 70951 99455

రిజర్వు ధరలో 10% సొమ్మును ధరావత్తుగా ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా https://baanknet.com లోని E-వాలెట్‌కు బిడ్డర్ లాగిన్ అయి తేది.22.06.2026, సా॥ 6:00 గం.ల లోపుగా చెల్లించవలెను.
* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ. 50,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్(baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com. హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 30.05.2026, ప్రదేశం : విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్




## మెగా డీఎస్సీ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది

### మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్



అనకాపల్లి , జూన్ 5 (ప్రభాత వార్త):

తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు 9 మెగా డీఎస్సీలు నిర్వహించి 2,16,179 ఉద్యోగాలు ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీని అత్యంత పారదర్శంగా నిర్వహించారని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా, ఆన్లైన్లో పరీక్షలు నిర్వహించి, ఎటువంటి అపోహలకు తావు లేకుండా, పరీక్ష ఫలితాలను పబ్లిక్ డొమెన్లో పెట్టిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఈ ఘనత దక్కుతుందన్నారు. శ్రీభోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ మెగా డీఎస్సీలో ఉత్తీర్ణులైన ఉపాధ్యాయులు వారు కష్టపడి చదివి సాధించు కున్న ఉద్యోగాలు మీద రాజకీయ వైరంతో వైసిపి నాయకులు ధర్నాలు ఉద్యమాలు చేయడం భావ్యం కాదని, ఉద్యోగులు పొందిన వారి వైసీపీ కుటుంబ సభ్యులు కూడా ఉన్నారని విషయం మరిచిపోయి దీనిలో రాష్ట్రా వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉద్యోగాలు పొందిన వారు ఉన్నా రని, కార్యక్రమంలో రాష్ట్ర విశ్రాంతిఉద్యోగ సంక్షేమ సంఘం కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలకు పచ్చని కానుక అందిద్దాం

### ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పిలుపు



( అచ్యుతాపురం, జూన్ 5, ప్రభాతవార్త ) :

పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్య త అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని జీవన విధానంగా మార్చుకోవాలని ఎలమం చిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పిలుపుని చ్చారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలోని అచ్యుతాపురం రేషన్ స్కూల్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన 'నెట్ జీరో' కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బొందలపు శ్యామ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మూలపేట ఛానెల్ హెడ్ రెగ్యులేటర్ పునరుద్ధరణకు శ్రీకారం

( అచ్యుతాపురం జూన్ 5 ప్రభాతవార్త )



మునగపాక మండలం మూలపేట గ్రామంలో నీటి వనరుల పునరుద్ధరణ పథకం కింద చేపట్టనున్న మూలపేట ఛానెల్ హెడ్ రెగ్యులేటర్ పునరుద్ధరణ పనులను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రారంభించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ ప్రాజెక్టును రూ. 18.87 లక్షల వ్యయంతో అమలు చేయనున్నారు. ఏషియన్ పెయింట్స్ సీఎస్ఆర్ నిధుల సహకారంతో, అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పనులు చేపడుతున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏషియన్ పెయింట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సాగునీటి సౌకర్యాలు మెరుగుపరచడం, నీటి వనరులను పరిరక్షించడం, వ్యవసాయాభివృద్ధికి తోడ్పడడం లక్ష్యంగా ఇటువంటి పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వంతో పాటు కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతలో భాగంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, యువకులు, ఏషియన్ పెయింట్స్ సిబ్బంది, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు సమిష్టిగా కృషి చేద్దాం



### జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పిలుపు

అనకాపల్లి, జూన్ 5 (ప్రభాత వార్త) :

పర్యావరణ పరిరక్షణకు సమిష్టిగా కృషి చేద్దామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ముఖ్య అతిథిగా విచ్చేసి, పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి స్వయంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన ఇల్లు ప్రకృతి మన జీవనాధారం. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన అందరి కనీస బాధ్యత అన్నారు. కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్.బి డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, ఏవో సిహెచ్.తిలక్ బాబు, ఇన్స్పెక్టర్లు బాల సూర్యారావు, లక్ష్మి, శ్రీనివాసరావు, సేనం రమేష్, పిల్లా రమేష్, రామకృష్ణారావు వివిధ విభాగాల ఎస్సైలు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : రూరల్ సీఐ అశోక్ కుమార్

అనకాపల్లి , జూన్ 5,(ప్రభాత వార్త):



ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని రూరల్ సీఐ జి అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం లో భాగంగా శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పర్యావరణ పరిరక్షణ మనుగడకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా పర్యావరణ పరిరక్షణ సమతుల్యతకు కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణ బాధ్యత తీసుకొని భారీ వృక్షాలుగా మార్చాలని ఆయన ఆకాంక్షించారు. రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## జానకయ్య పేటలో మొక్కలు నాటిన కూటమి నాయకులు

(నక్కపల్లి/అడ్డ రోడ్డు, ప్రభాతవార్త) మండలం లోని జానకయ్య పేట గ్రామంలో పర్యావరణం పరిరక్షణ దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు శుక్రవారం పలు పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూటమి నాయకులు చేపట్టారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కురందాసు నూకరాజు , కురందాసు సింహాచలం , కురందాసు అప్పలరాజు, బిజెపి రాష్ట్ర నాయకులు ఈగల వెంకటేశ్వరరావు , స్థానిక పంచాయతీ కార్యదర్శి తాతారావు వీఆర్పీ చిట్టిబాబు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ముమ్మరంగా కొనసాగుతున్న దర్యాప్తు



(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త )



ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయం లో జరిగిన చోరీ కేసు విషయంలో జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు సీఐ మురళి పెద్ద ఎత్తున దర్యాప్తును కొనసాగిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగిన సంఘటన పాఠకులకు తెలిసినదే.! ఈ మేరకు డిఎస్పి శ్రీనివాసరావు పోతిరెడ్డి, ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతుంది. శుక్రవారం కూడా ఆలయ పరిసరాల్లో అణువణువున సీఐ జూరెడ్డి మురళి తోపాటు మిగతా క్రైమ్ విభాగాలకు చెందిన వారు పరిశీలిస్తున్నారు. సీసీ ఫుటేజ్ లను మరొకసారి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ దర్యాప్తు కోసం నియమించిన బృందాలు ఇప్పటికే రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో దర్యాప్తును కొనసాగిస్తున్నారు. నిందితులను వేగంగా పట్టుకునే పనిలో నిమగ్నమై ఉన్నామని సీఐ జూరెడ్డి మురళి స్థానిక విలేకరులకు తెలిపారు.

## రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

(అడ్డురోడ్డు, ప్రభాతవార్త)

అనకాపల్లి జిల్లాలోని దేవరాపల్లిలో యువ రైతు పోతల సత్తిబాబు అప్పులు చేసి పంటలకు పెట్టుబడి ఆ పంటలకు గిట్టుబాటు ధర రాక అప్పులు తీర్చలేక ఆత్మాభిమానం చంపుకోలేక ఆత్మహత్య చేసుకొని మరణించడం తక్షణమే ప్రభుత్వం పోతల సత్తిబాబు యువ రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు కోరారు.

## చిత్రలేఖనంతో ఆవిష్కృతమైన పచ్చని లోకం

### పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల ప్రతిభ



అనకాపల్లి , జూన్ 5 , (ప్రభాతవార్త) :

వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పర్యావరణ స్పృహను అలవరచుకోవాలని రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్సీ) సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ పిలుపునిచ్చారు. గ్రీన్ క్లబ్ 12వ వార్షికోత్సవం, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భముగా పర్యావరణ పరిరక్షణ అంశంపై గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ గౌరీ గ్రంథాలయంలో చిత్ర లేఖనం పోటీలు జరిగాయి. ఈ పోటీలకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి 300 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో పాల్గొన్న కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ పర్యావరణం బాగుంటేనే మానవ మనుగడ సాధ్యం, విద్యార్థులు గీసిన ఈ చిత్రాలు కేవలం రంగుల కలయికలు కావు, ప్రకృతిని కాపాడుకోవాలని మనకు పంపిన సందేశాలు అని కొనియాడారు. విద్యుత్ పొదుపు, సహజ వనరుల వినియోగంలో యువత భాగస్వామ్యం అవసరమని ఆయన గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ పోటీలను గ్రీన్ క్లబ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. సృజనాత్మకతకు, ప్రకృతి పట్ల విద్యార్థులకున్న బాధ్యతాయుతమైన ఆలోచనలకు చిత్ర లేఖనం పోటీలు వేదికగా నిలిచాయన్నారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ కాలుష్యం, వాతావరణ మార్పులు కేవలం సమస్యలు మాత్రమే కావని అవి మానవ మనుగడకు హెచ్చరికలన్నారు. చెట్లు నాటడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని సూచించారు. పర్యావరణ హితమైన అలవాట్లను పెంపొందించుకోవడానికి ఇటువంటి పోటీలు నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. సబ్ జూనియర్స్ (కిడ్స్)కు పర్యావరణ పరిరక్షణ, 4 నుంచి 7వ తరగతుల విద్యార్థులు (సబ్ జూనియర్స్)కు నీటి సంరక్షణ, 8 నుంచి 10 తరగతుల విద్యార్థులు (సీనియర్స్)కు జీవ వైవిధ్య పరిరక్షణ అంశంపై జరిగిన చిత్రలేఖనం పోటీల విజేతలకు అతిథులు నగదు, సర్టిఫికేట్లు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ ప్రతినిధులు కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), బీరా వినోద్ కుమార్, పెంటకోట ఉమామహే శ్వరరావు, రావూరి అనిత, నైశెట్టి సత్తిబాబు, అనిత, సుంకర పద్మలత, కె.రత్నం, ఉప్పల తాయారు, బుద్ధ వరలక్ష్మి, శ్రీ గౌరీ గ్రంథాలయ అధ్యక్షుడు బుద్ధ రమణాజీ, మాజీ కార్యదర్శి మళ్లఅ బాపునాయుడు పాల్గొన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

## అంబేద్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

అనకాపల్లి, జూన్ 5 (ప్రభాతవార్త):

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు , జూనియర్ ఇంటర్మీడియట్‌లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయ అధికారి జి. గ్రేస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని గురుకుల విద్యాలయాల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం జూన్ 8, 2026 (సోమవారం) కౌన్సెలింగ్ నిర్వహించబడుతుంది. కౌన్సెలింగ్ డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, శ్రీ కృష్ణాపురం (విశాఖపట్నం ) ప్రాంగణంలో ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు జరుగుతుంది. 5వ, 6వ, 7వ, 8వ, 9వ తరగతులు , జూనియర్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు పొందదలచిన విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు, కుల, ఆదాయ, జనన ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, మార్కుల మెమోలు తదితర అవసరమైన పత్రాలతో హాజరుకావాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు: 7780107050, 7207000723, 0891-2799641 నెంబర్లతో సంప్రదించగలరు.

## రేపే యాదవ విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనకాపల్లి, జూన్ 5, (ప్రభాత వార్త) :



అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘశీ ఆధ్వర్యంలో జూన్ 7వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుండి ఈ విద్యా సంవత్సరశీ 2026 లో 10వ తరగతి, ఇంటర్ పరీక్షలలో మెరిట్ సాధించిన యాదవ విద్యార్థిని, విద్యార్థులకు మెరిట్ ప్రోత్సాహకాలు ఇవ్వటం జరుగుతుంది అని జిల్లా యాదవ సంక్షేమ సంఘశీ అధ్యక్షులు భరణికాన బాబురావు యాదవ్ తెలిపారు. ఇందుకు సంబం దించిన పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సంవత్సరం 260 మంది విద్యార్థులు పురస్కారాలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సిఎం రమేష్, గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, వైసీపీ సమన్వయ కర్త మనసాల భరత్, యాదవ సంఘము జాతీయ నాయకులు భరణికాన రామారావు తదితరులు విచ్చేయుచున్నారు అని తెలిపారు. అనకాపల్లి జిల్లా యాదవ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘశీ నాయుకులు భరణికాన నరసింహామూర్తి, సబ్బి శ్రీనివాసరావు, కరక సోమునాయుడు, పంచదార్ల సూరిబాబు, బంధం వెంకటరమణ, మొల్లి ప్రసాద్ వియ్యపు సింహాచలం, మొల్లి నాగు, పంచదార్ల కన్నారావు, కారుకుండి కన్నా, తదితరులు పాల్గొన్నారు.

## సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ నిబంధనపై అవగాహన

ఎలమంచిలి, జూన్ 5, ప్రభాతవార్త:



పట్టణములోని పురపాలక సంఘ పరిధిలో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో భాగంగా మూడవ వారం థీమ్ అయిన మార్కెట్లు, కమర్షియల్ కాంప్లెక్సులో "సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్- 2026" నిబంధనలపై మున్సిపల్ కమిషనర్ బి.జె.ఎస్.పి. రాజు ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్స్పెక్టర్ కలిసి స్థానిక కూరగాయల మార్కెట్, గాంధీనగర్ లోని వివిధ అపార్ట్‌మెంట్‌లలో బల్క్ వేస్ట్ జనరేటర్స్ (ఎక్కువ మొత్తంలో చెత్త ఉత్పత్తి చేసే కేంద్రాలు) పనితీరును స్వయంగా పరిశీలించారు. ??చెత్త తయారైన చోటే వ్యర్థాలను వేరు చేయడంపై కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. తడి, పొడి చెత్తతో పాటు హానికరమైన వ్యర్థాలు, ఈ-వేస్ట్‌లను వేర్వేరుగా విభజించాలని అధికారులను కోరారు. వీటిని నిబంధనల ప్రకారం బ్లూ, గ్రీన్, రెడ్, బ్లాక్ కలర్ బిన్లలో వేర్వేరుగా ఉంచి, మున్సిపల్ సిబ్బందికి అందించాలని ప్రజలకు, వ్యాపారులకు ఈ సందర్భంగా స్పష్టంగా వివరించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కొక్కిరాపల్లి బాలికల వసతి గృహంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మున్సిపల్ ఏఈ నానాజీ, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నేడు అనకాపల్లి జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపిక



ఎలమంచిలి, జూన్ 5, ప్రభాతవార్త:

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా వేదికగా ఈ నెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనున్న అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే అనకాపల్లి జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీలు నేడు. (శనివారం) ఉదయం 6:00 గంటల నుంచి స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతాయని జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ కోటారు నరేష్, ప్రతినిధులు జీవీ రెడ్డి, దాసరి మహేష్, నేవీ రాంబాబు సంయుక్తంగా వెల్లడించారు. అనకాపల్లి జిల్లా పరిధిలోని ఆసక్తి గల హాకీ క్రీడాకారులందరూ నేడు (శనివారం)ఉదయం 6:00 గంటలకల్లా తమ క్రీడా దుస్తులు, అవసరమైన ధృవీకరణ పత్రాలతో యలమంచిలి డిగ్రీ కళాశాల గ్రౌండ్‌కు చేరుకుని ఎంపిక పోటీల్లో పాల్గొనాలని కోరారు. ?ఈ జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియకు అధికారిక సెలెక్టర్‌గా శెట్టి రమేష్ వ్యవహరిస్తారని అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో అనకాపల్లి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి : కొప్పిశెట్టి

(నక్కపల్లి, ప్రభాతవార్త ):



పర్యావరణ పరిరక్షణలో సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఉపమాకలో స్కూలు సచివాలయాల ప్రాంగణంలో మొక్కలు నాటి ప్రతి ఒక్క ఇంటి వద్ద ఒక మొక్క నాటితే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరము కృషి చేసిన వాళ్లమవుతామని మొక్కలు పెంచడం వల్ల సంపూర్ణమైన ఆరోగ్యం పొందగలుగుతామని అన్నారు. ఉపాధి హామీ కూలీలతో పాటు పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్‌తో పాటు తోలేటి శ్రీను,కొప్పిశెట్టి వాసు, విష్ణు, అప్పారావు, జగదీష్ తోపాటు పలువురు ఉన్నారు.

## వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఎలమంచిలి, జూన్ 5, ప్రభాతవార్త:

మండలంలోని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కులం పేరుతో దూషించినందుకుగాను ఒక వ్యక్తి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే చాకలి నూకరాజు అనే వ్యక్తిని కాంద్రకోట చిరంజీవి అనే వ్యక్తి కులం పేరుతో దూషించాడు అంటూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

## పర్యావరణ పరిరక్షణకై ప్రజలందరూ కృషి చేయాలి

### అనకాపల్లి పట్టణంలో టీడీపీ శ్రేణుల సైకిల్ ర్యాలీ

అనకాపల్లి , జూన్ 5, (ప్రభాత వార్త) :



పర్యావరణ పరిరక్షణకై ప్రజలందరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పీల గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా టీడీపీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అనకాపల్లి పట్టణంలో శుక్రవారం ఘనంగా సైకిల్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుండి ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డ్ వరకు సుమారు 4కిలో మీటర్లు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం నాడు టీడీపీ శ్రేణులు ఎలక్ట్రికల్ లేదా సైకిల్ పై ప్రయాణం చేయాలనీ కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ కాలుష్య నివారణకు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర ,బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు , టీడీపీ బీజేపీ కూటమి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

## మొక్కల పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలి : చలపతిరావు





ఎలమంచిలి, జూన్ 5, ప్రభాతవార్త:

మున్సిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లిలో గ్రామజ్యోతి యువతీ యువకుల ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ పార్లమెంట్ సభ్యులు సీనియర్ తెలుగుదేశం నాయకులు పప్పల చలపతిరావు, ఎమ్మార్వో వరహాల రావు, సీఐ ధనుంజయరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూకాంబిక చెరువుగట్టు ప్రక్కన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షణ ఒక బాధ్యతగా తీసుకోవాలని కోరారు. మొక్కలు నాటడం వాటి ఎదగడం ద్వారానే సహజమైన ఆక్సిజన్ లభిస్తుందని అన్నారు. అనంతరం రిటైర్డ్ కలెక్టర్ ఐ ఎస్ రావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు గ్రామంలో గల పిల్లలకు బుక్స్ అందజేశారు. ఎన్నారై మజ్జి శివకృష్ణ పదవ తరగతి, ఎంతటి ప్రతిభావంతుల విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు గొర్లె శివన్నారాయణ, జనసేన పట్టణ పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు అబ్దుల్లా, మాజీ సర్పంచ్ కాకర దేవుడు, గ్రామ జ్యోతి యువతి యువకులు పాల్గొన్నారు.

## గ్రామీణ, పట్టణ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏ వన్ ఆధారిత ఈసిడి స్క్రీనింగ్ శిక్షణ

ఎలమంచిలి, జూన్ 5, ప్రభాతవార్త:



పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు ఉన్నత పాఠశాలలో మండల గ్రామీణ, పట్టణ అంగన్వాడీ కార్యకర్తలకు ఖ1 ఆధారిత ఈసిడి స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని డబ్ల్యూ డి సి డబ్ల్యూ పిడి ఎన్ సూర్యలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో పిల్లల అభివృద్ధి మైలురాళ్లు, అభివృద్ధి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించే విధానం, ఖ1 ఆధారిత స్క్రీనింగ్ ప్రక్రియ, మొబైల్ యాప్ వినియోగం, డేటా నమోదు విధానాలపై అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. చిన్నారులలో అభివృద్ధి సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించడం ద్వారా వారికి సకాలంలో అవసరమైన సేవలు అందించవచ్చునని వివరించారు. శిక్షణ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ సూర్యలక్ష్మి పరిశీలించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఇందిరాదేవి, వైద్యాధికారి రోహిణి, సూపర్వైజర్ల రమ్య, మీరాభి, అన్నపూర్ణ, అపరంజిని అంగన్వాడీ కార్యకర్తలు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు.

## వారపుసంతలో మజ్జిగ పంపిణీ.!



(నక్కపల్లి ,ప్రభాతవార్త) :

నక్కపల్లి సత్య సాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం వారపు సంతకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి భజన మండలి సభ్యులు కక్కిరాల సురేష్ తో పాటు నున్న విశ్వేశ్వరరావు, కొత్త రాము, భగవాన్ ,నున్న కాశీ విశ్వనాథ్ ,సత్తికొండ, నవర నూకరాజు శర్మ , కర్రి వెంకట సత్యనారాయణ (కే.వి), ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు కొల్నాటి సుబ్బులక్ష్మి, నున్న పత్తికొండ,తదితరులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## పట్టణ పోలీస్ స్టేషన్లో మొక్కలు నాటిన పట్టణ ఎస్సై , ట్రాఫిక్ ఎస్ఐ

ఎలమంచిలి, జూన్ 5, ప్రభాతవార్త:



ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టణ ఎస్సై సావిత్రి, ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ పర్యావరణం కాపాడుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యతని, మొక్కలను నాటికమే కాకుండా వాటిని సంరక్షణ కూడా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ పోలీస్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలు



( నక్కపల్లి రూరల్ ,ప్రభాతవార్త):

ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ జిల్లా కమిటీ సభ్యులు కోసూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నక్కపల్లి లో ఉపాధి కూలీలకు శీతల పానీయాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ రత్న భరత్ యువ మోర్చ అధ్యక్షులు శ్రీరంగం,రమేష్ ,వర్మ రాజు ,గాంధీ ,వేముల రమణ ,శ్రీను, బంగారి, శివ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుదాం : కోసూరి

( నక్కపల్లి, ప్రభాతవార్త):





ఆస్తి సంపాదించడం కంటే ఆరోగ్యాన్ని సంపాదించడం చాలా ముఖ్యమని అదే నినాదంతో ప్రతి ఒక్కరం ప్రతి ఇంటి వద్ద ఒక మొక్క నాటి సంపూర్ణమైన ఆరోగ్యం సంపాదిద్దామని జిల్లా బిజెపి కమిటీ సభ్యులు కోసూరు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యవరణ దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు "అమ్మ పేరు తో ఒక మొక్క" కార్యక్రమం పాయకరావుపేట నియోజక వర్గంలో పాయకరావుపేట మండలం పెదరామభద్రపురం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం నక్కపల్లి కేజీబీవీ పాఠశాల ప్రాంగణం, తో పాటు వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కోసూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నినాదంతో ప్రతి ఒక్కరు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వామ్యం అవుదామని కోరారు. సురేంద్ర వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రత్న భరత్ , బిజెవైఎంసి జిల్లా అధ్యక్షులు శ్రీరంగం రమేష్ ,కోసూరు శ్రీనివాస్ ,మంచాల గాంధీ ,వేముల రమణ ,మూల స్వామి,సూరిబాబు ,బంగారు శివ ,డాడీ శ్రీను , తో పాటు పలువురు బీజేపీ నాయకులు, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెలగ సుధాకర్, జనసేన పార్టీ నాయకులు కర్రీనానాజీ, టిడిపి నాయకులు మీగడ సత్యనారాయణమూర్తి ,తదితరులు ఉన్నారు.

## మొక్కలు నాటి సంపూర్ణ ఆరోగ్యం పొందుదాం : డాక్టర్ బంగారయ్య

(నక్కపల్లి ,ప్రభాతవార్త )



ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా భూమి రోజురోజుకీ బాగా వేడెక్కుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు "ఒక మొక్క నాటండి- భూమి వేడిని తగ్గించుకుందాం- మానవజాతిని కాపాడుకుందాం" అనే ఏకైక లక్ష్యంతో ప్రతి ఒక్కరు అడుగులు వేయాలని కేజీహెచ్ ఆర్ ఎం ఓ డాక్టర్ బంగారయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## ఆదివాసి పోరాటాలన్నీ.. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలే



పాడేరు, జూన్ 5, ప్రభాతవార్త

ప్రకృతిలో అంతర్భాగమైన ఆదివాసులు అడవులు... పర్వతాలు... నదులు... సహజవనరులు... ప్రాణికోటి రక్షణకు అనుబంధంగానే తమ మనుగడను తరతరాలుగా సాగిస్తువస్తున్నారనీ దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ సభ్యులు సమరెడ్డి మాణిక్యం పేర్కొన్నారు. చరిత్రలో వలస వాదం... వాణిజ్యవాదం... సామ్రాజ్యవాదం... దోపిడి విధానాలు ...దోపిడి శక్తులు పుట్టుకొచ్చి లాభార్జనే ధ్యేయంగా పరమావధిగా ప్రకృతి సంపద, సహజ వనరుల దోపిడి చేసే క్రమంలో వారు అమానవీయంగా, అత్యంత క్రూరంగా సాగించిన దౌర్జన్యాలు, హత్యాకాండలపై తిరుగుబాటు చేసిన ఆదివాసులు తమ మనుగడ, అస్తిత్వం, సహజ హక్కులు కోసం తమ జీవనంలో అంతర్భాగమైన అడవులు, ప్రకృతి పరిరక్షణ కోసం చేసిన, చేస్తున్న పోరాటాల చరిత్రలో పర్యావరణ పరిరక్షణ అత్యంత ప్రధానభాగం! ఒక్కమాటలో చెప్పాలంటే ఆదివాసి పోరాటాలన్నీ పర్యావరణ పరిరక్షణ పోరాటాలేనని చెప్పవచ్చు!!! 53వ ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు మాణిక్యం తెలియజేసారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పాడేరులో సైకిల్ ర్యాలీ

### పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి : టీడీపీ రాష్ట్రరాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్ళి సుబ్బారావు



పాడేరు,జూన్5, ప్రభాతవార్త

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో తెలుగు దేశం పార్టీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్ళి. సుబ్బా రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పాడేరు పురవీధుల్లో సాగిన ఈ ర్యాలీ ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించింది. అనంతరం స్థానిక గిరిజన రైతులకు పూల మొక్కలను, పండ్లు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొట్టగుళ్ళి సుబ్బారావు మాట్లాడుతూ ఒకప్పుడు ప్రకృతి స్వచ్ఛంగా ఉండేదని, వాహనాల వినియోగం తక్కువగా ఉండటం వల్ల కాలుష్యం కూడా పరిమిత స్థాయిలో ఉండేదని అన్నారు. ప్రస్తుతం వాహనాల సంఖ్య విపరీతంగా పెరగడం, ప్లాస్టిక్ వినియోగం అధికమవడం వల్ల పర్యావరణం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. భావితరాలకు పచ్చని ప్రకృతిని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. చెట్లు మనిషికి ప్రాణవాయువును అందించడమే కాకుండా ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, గ్రామ గ్రామాన ఉచిత మొక్కల పంపిణీ చేపడుతూ పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యావరణ హిత కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. అనవసరంగా వాహనాల వినియోగాన్ని తగ్గించి, సాధ్యమైనంత వరకు సైకిళ్లు వినియోగిస్తే కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న గాలి కాలుష్యం కారణంగానే శ్వాసకోశ సంబంధిత వ్యాధులు అధికమవుతున్నాయని, ప్రకృతి పరిరక్షణ ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని చెట్టుగా పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ భూరెడ్డి రామ్ నాయుడు, బీజేపీ మహిళా మోర్చా కేజీయా రాణి, బీసీ సెల్ మాజీ ప్రెసిడెంట్ ప్రశాంత్, కార్లు నాయుడు, వాసవి హిల్స్ ప్రకాష్, గడ్డి కాలనీ మహిళలు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశలుగా మార్పు చేయాలి: సిఐటియు



పాడేరు,జూన్5, ప్రభాతవార్త

పాడేరు ఐటిడిఏ పరిధిలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశలుగా ప్రమోట్ చేయాలని ఏపీ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం పాడేరు ఐటిడి ముందు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. కార్యక్రమం ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కమ్యూనిటీ హెల్త్ వర్క్లాగా పనిచేస్తూ రోగులకు అనేక సేవలు అందిస్తున్నారని కానీ కేవలం 4వేలు వేతనం ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు ఆశ కార్యకర్తలతో సమానంగా పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు వేతనంలో వ్యత్యాసం ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఆశలకు పదివేల రూపాయలు వేతనం చెల్లిస్తున్నారని అంతే కాకుండా ఇటీవలే సిఐటియు ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు ఉద్యమం ఫలితంగా గ్రాడ్యుటీ, గ్రూప్ ఇన్సూరెన్స్, రిటర్మెంట్ బెనిఫిట్ స్కీమ్స్ సాధించుకున్నారని ఇవి ఏవి కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు వర్తించడం లేదని అన్నారు ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న విధులు అన్ని సమానంగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పనిచేస్తున్నారని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆశలుగా మార్పు చేయాలని పెద్దఎత్తున ఉద్యమిస్తూ ఉన్నత అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని అన్నారు వీళ్లంతా వెనకబడిన గిరిజన ప్రాంతంలో కొండ కోనల్లో కష్టంతో కూడిన పనులు చేస్తున్నారని తక్షణ ప్రభుత్వం ఆలోచించి ఆసాలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు ఉచితంగా మొబైల్స్ యూనిఫార్మ్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. భవిష్యత్తులో సమస్త పరిష్కారం కాకపోతే ఐటీడీఏ ముందు సమస్య పరిష్కారం అయ్యేంతవరకు కూర్చొని ఉద్యమిస్తామని అన్నారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందర్రావు మాట్లాడుతూ వర్కర్స్ అందరూ ఐక్యంగా పోరాడితేనే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల పట్ల రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని అన్నారు. అనంతరం ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసుల వారికి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ, జిల్లా నాయకులు దాసమ్మ, పార్వతి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పబ్లిసిటీకే పరిమితం..రాష్ట్ర అభివృద్ధి పట్ల శూన్యం

### పాడేరు శాసన సభ్యులు, వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు




పాడేరు,జూన్5, ప్రభాతవార్త

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన చంద్రబాబు వెన్నుపోటుకి రెండేళ్లు అనే కార్యక్రమం పాడేరు శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అధ్వర్యంలో పాడేరు జిల్లా కేంద్రం అంబేద్కర్ కూడలి వద్ద వైయస్సార్సీపి నేతలతో కలిసి చంద్రబాబు వెన్నుపోటు పొడిచిన వైనంపై చేసిన సంతకాలు బాండ్ పత్రిక పత్రాలను దహనం చేసి నినాదాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు గడిచిన ఎన్నికల ముందు మ్యానిఫెస్టో సూపర్ సిక్స్ అనేక హామీలు ఇచ్చి ఇప్పటివరకు హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని అన్నారు.. ఎన్నికల ప్రచారంలో నోటికి వచ్చినట్టు గడప గడపకు వెళ్లి తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత గ్యాస్, యువతకు ఉద్యోగాలు, రైతులకు భరోసా లేదు, వాలంటీర్ వ్యవస్థ లేదు, పెన్షన్ ల తొలగింపు, ఎన్నో అబద్ధాలు చెప్పి రాష్ట్ర ప్రజలకు నిట్టన ముంచేశారు, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రజలు గమనించారు, వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యురాలు ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురూస పార్వతమ్మ, జిల్లా అధికార ప్రతినిధి కూడా సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీధరి మంగ్గన్న దొరా, నియోజక వర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు శరభ సూర్యనారాయణ, మాజీ ఏఎంసి చైర్మన్ లకే రామసత్యవతి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కిల్లో ఊర్వశి రాణి, మండల యువజన విభాగం అధ్యక్షుడు గల్లెలి లింగమూర్తి, ఎంపిటిసిలు లకే రామకృష్ణ పాత్రుడు,తాజా మాజీ సర్పంచులు వంతల రాంబాబు, వనుగు బసవన్న దొరా, గొల్లూరి నీలకంఠం, బిడిమెల సర్పంచ్ సోమెలి లక్ష్మణ రావు, వంతల బొంజుబాబు, పాంగి నాగరాజు, మినుముల కన్నపాత్రుడు, సీనియర్ నాయకులు కిల్లు కోటిబాబు, దూసురు గంగరాజు, ముదిలి సుదర్శన్, వంతల నరేష్, రాజేష్, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణను అందరి బాధ్యతగా తీసుకోవాలి

### సైకిల్ ర్యాలీలో ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డా.సియ్యారి దొన్ను దొర



అరకులోయ, జూన్ 5, ప్రభాతవార్త

పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవలసిన అవసరం ఉందని ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ సియ్యారి దొన్ను దొరఅన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం అరకులోయ పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైకిలిస్టులు, పర్యావరణ ప్రేమికులు అందరితో కలిసి అరకులోయ పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించిన అనంతరం దొన్ను దొర మీడియాతో మాట్లాడారు. నేడు వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని పర్యావరణాన్ని రక్షించుకోకపోతే భవిష్యత్తు ప్రమాదకరంలో పడిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడ్డ విభిన్న పరిస్థితుల వలన ఎండల తీవ్రతను కల్లారా చూస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు మరిన్ని ఏర్పడే అవకాశాలు ఉన్నాయని, అందుకే ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, వాహనాలు వినియోగాన్ని కూడా పరిమితంగా ఉపయోగించాలని, పర్యావరణ పరిరక్షణ కోసం పర్యావరణ వేత్తలు శాస్త్రవేత్తలు సూచించిన సూచనలు మనమంతా పాటించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వాలతో సాధ్యం కాదని, వ్యక్తులతో మాత్రమే సాధ్యమవుతుందని, సమాజం ఏక మొత్తంలో పర్యావరణ పరిరక్షణ కృషి చేస్తే మనమంతా భవిష్యత్ ను కాపాడిన వారమవుతామని పేర్కొన్నారు. టిడిపి అరకులోయ మండల అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, ఏఎంసి చైర్మన్ బోరి బోరి లక్ష్మి, మాజీ ఎంపిటిసి కిల్లో కుమార్, సీనియర్ నాయకుడు రాజు పాల్గొన్నారు.

## 6వ తేదీ వరకు యండపల్లివలస సబ్ స్టేషన్ పరిధిలో నేషనల్ హైవే క్రాసింగ్ పనులు

### అరకు ట్రాన్స్ కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీ.ఎన్.ప్రతాప్

పాడేరు,జూన్5, ప్రభాతవార్త

ఈ నెల 3వ తేదీ నుంచి చేపట్టిన విద్యుత్ మరమ్మత్తు పనులు ఈ నెల 6వ తేదీ వరకు కొనసాగ నున్నాయని యండపల్లివలస సబ్ స్టేషన్ పరిధిలో నేషనల్ హైవే క్రాసింగ్ పనుల నిమిత్తం టవర్ సిఫ్టింగ్ కొరకు 132 కేవీ టిబివర- అరకు సర్క్యూట్-2 (రెండు రోజులు), 132 కేవీ టి.బి వర అరకు-సర్క్యూట్-1(ఒక రోజు)లో మాత్రమే విద్యుత్ సరఫరాకు అంతగాయం ఉంటుందని ఏపీ ట్రాన్స్ కో అరకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీ.ఎన్.ప్రతాప్ పేర్కొన్నారు. మరమ్మత్తుల నిమిత్తం దాని పరిధిలో (అరకు,పాడేరు, డుంబ్రిగుడ, హుకుంపేటలో) అత్యవసర సమయంలో తప్పా సాధారణంగా విద్యుత్ సరఫరాకు ఆటంకం ఉండదని కావునా వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించ వలసిందిగా డిఈఈ పీఎన్.ప్రతాప్ కోరారు.

## అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు



పాడేరు,జూన్5,ప్రభాతవార్త:

పాడేరు గిరిజన ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ వారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఒక్క కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మాజీ జెడ్పిటిసి రొబ్బ ఉషారాణి, బాకూరు పాండురాజు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు,ఆలయ కమిటీ సభ్యులు చల్లా రామకృష్ణ, భోనంగి వెంకటరమణ, కిల్లు చంద్రమోహన్ కుమార్, కొణతాల సతీష్, గూడెపు సూర్య ప్రకాష్ కురస లక్ష్మయ్య, పలాసి రమణమ్మ, కూర రాము, బడగాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్‌ల ద్వారా వినియోగదారులకు సేవలు

పాడేరు,జూన్5,ప్రభాతవార్త

పాడేరు డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ల సేవలను వినియోగదారులు వినియోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీ. వేణుగోపాల్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వర్షాకాలం నేపథ్యంలో ఎటువంటి విద్యుత్ సమస్యలు ఏర్పడిన తక్షణమే కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. సర్కిల్ స్థాయిలో కంట్రోల్ రూమ్ నెంబర్: 9490610027, ఏఈ 944816362, జేఈ హుకుంపేట: 8328313769, ఏఈ పెదబయలు, ముంచంగిపుట్టు: 9440816363, ఏఈ అరకు, డుంబ్రిగూడ: 9440814223,, ఏఈ అనంతగిరి: 9440816364, ఏఈ చింతపల్లి: 9440812554, జేఈ జి. కె.వీది 9492747592, ఏలఈ జీ మాడుగుల: 9490614773, ఏఈ కొయ్యూరు: 9440812557 నెంబర్లను వినియోగదారులు సంప్రదించాలని ఈ ఈ వేణుగోపాల్ సూచించారు.

## బైక్ ప్రమాదంలో గాయపడి మృత్యువుతో పోరాడుతూ ఇద్దరు గిరిజనులు మృతి



గూడెం కొత్తవీధి, జూన్ 5, ప్రభాతవార్త

మండలంలోని నాలుగు రోజుల క్రితం పెట్రోల్ బంక్ సమీపంలో బైక్ ప్రమాదం జరిగింన సంగతి తెలిసిందే. అయితే రోడ్డు ప్రమాదంలో గాయపడి మృత్యువుతో పోరాడుతూ ఇద్దరు గిరిజనులు శుక్రవారం మృతి చెందారు. జీకేవీధి పెట్రోల్ బంక్ రోడ్డుపై సోమవారం రాత్రి రోడ్డుపై నడిచి వెళుతున్న వ్యక్తిని బైక్ ఢీకొన్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పాదాచారుడు గాసిరామ్, వాహనదారుడు బాబూరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరూ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడారు. గురువారం రాత్రి గాసిరాం చనిపోగా శుక్రవారం బాబురావు చనిపోయారని కుటుంబ సభ్యులు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

### జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీపూజ



డుంబ్రిగుడ, జూన్ 5, ప్రభాతవార్త

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడనని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీపూజ అన్నారు. మండలంలోని అంజోడ సిల్క్ ఫాం పీనరిలో శాంతినగర్ వన సంరక్షణ సమితి, అటవీ సిబ్బంది నేతృత్వాన శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న జిల్లా జాయింట్ కలెక్టర్ విత్తన బంతులను పరిశీలించి వాటి ఆవశ్యకతపై అడిగి తెలుసున్నారు. ముందుగా మొక్కలను ఆమె నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడి మొక్కలు నాటాలన్నారు. పచ్చని మొక్కలతో జీవరాశులకు మేలు చేరుకురేందుకు దోహదపడుతుందని అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకుంటే భవిష్యత్తు సురక్షితంగా ఉండడమే కాకుండా భవిష్యత్తు తరాల వారికి వెన్నుగా నిలిచే వారవుతామని ఆమె సూచించారు. డీఎఫ్‌ఓ ఉమామహేశ్వరి, అరకు అటవీశాఖ రేంజర్ బి.కోటేశ్వరరావు, సిబ్బంది, వన సంరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## శ్రమకి తగ్గ వేతనం చెల్లించాలని కార్మికుల ఆందోళన




డుంబ్రిగుడ, జూన్ 05 ప్రభాతవార్త

మధ్యాహ్న భోజన కార్మికులకు శ్రమకి తగ్గ వేతనం రూ.10వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పోతురాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీఐటీయూ శుక్రవారం ఆధ్వర్యాన శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి జాతీయ రహదారి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీని చేపట్టారు. అనంతరం ఆర్ఐ రాముకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల శ్రమను గుర్తించి కార్మిక చట్టాలకు అనుగుణంగా కనీస వేతనాలు చెల్లించే చర్యలు తీసుకోవాలన్నారు. వారికి ఇచ్చే వేతనం ప్రతినెల 1న చెల్లిస్తూ మెనూ ఛార్జీలు ఒక్కోక్క విద్యార్థికి రూ.20లు చెల్లించాలని చెప్పారు. ప్రతినెల 5లోపు మెస్ బిల్లులు చెల్లించి, వంట పాత్రలకు ఇచ్చే నిధులను విడుదల చేయాలన్నారు. గ్రూపు ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించి, గుర్తింపు కార్డులు, యూనిఫాం ప్రమాదం వాటిల్లితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్స్రేషియ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సింహాచలం, రాణి, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### ప్రతి పంచాయితీలో మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలి : పాడేరు శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు



పాడేరు, జూన్5, ప్రభాతవార్త

రానున్న స్థానిక ఎన్నికల్లో పాడేరు మండలంలో ప్రతి పంచాయతీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పాడేరు ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు పిలుపు నిచ్చారు. పాడేరు శాసన సభ్యులు క్యాంప్ కార్యాలయంలో పాడేరు మండల నాయకులతో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 24 పంచాయితీకి సంబంధించిన నాయకులకు దిశా నిర్దేశం చేస్తూ రానున్న స్థానిక ఎన్నికల్లో పాడేరు మండలంలో ప్రతి పంచాయతీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై గడప గడపకు తెలియజేయాలన్నారు. అలాగే ఓటర్ల వెరిఫికేషన్‌పై కూటమి చేస్తున్న కుట్రలను ప్రజలకు తెలియ జేస్తూ నాయకు లందరూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు, అలాగే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఐడి కార్డు వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అలాగే ఈనెల 12న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడండి : డా.సియ్యారి దొన్ను దొర



అరకు రూరల్, జూన్ 5, ప్రభాతవార్త

వేసవి ఎండలు చాలా తీవ్రంగా ఉన్నాయని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ విజయ నగరం ప్రాంతీయ జోన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ డా.సియ్యారి దొన్ను దొర అన్నారు. తాగునీరు, డ్రైనేజీ, కొత్త పెన్షన్ల పైన వినతులను ప్రజల నుంచి స్వీకరించారు. దొన్ను దొర మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికీ తాగునీటి సమస్యపై ఫిర్యాదులు వస్తుండడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా చేయాలనే లక్ష్యంతో పని చేస్తుంటే ఇంకా తమ గ్రామాల్లో నీరు అందడం లేదని ఫిర్యాదులు రావడం బాధనిపిస్తుందన్నారు. ఎక్కడెక్కడ తగినీటి సమస్యలు ఉన్నాయో అధికారులు వెంటనే గుర్తించి ఆ సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో చాలా విపరీతంగా ఎండలు కాస్తున్న నేపథ్యంలో తాగునీరు లేక ప్రజలు అల్లాడి పరిస్థితి రాకూడదన్నారు. ప్రతి ఇంటికి తాగునీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈనెల 12వ తేదీ నుంచి నూతన పెన్షన్ నమోదుకు ప్రభుత్వ ఆప్షను అవునందని తెలిపారు. అరకులోయ మండల అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, ఏఎంసి చైర్మన్ బోరి బోరి లక్ష్మి, మాజీ ఎంపీటీసీ కుమార్, సీనియర్ నాయకుడు రాజు, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ప్రపంచ పర్యావరణ దినోత్సవం - 2026 మహోత్సవం

### ప్రకృతి స్ఫూర్తితో... వాతావరణ పరిరక్షణే మన భవిత" -అమ్మ పేరుతో ఒక చెట్టు నాటుదాం ప్రకృతి సమతుల్యతను కాపాడుదాం : జిల్లా కలెక్టర్ టి.నిశాంతి పిలుపు



పాడేరు,జూన్5,ప్రభాతవార్త

పర్యావరణాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యత. రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలిని, పచ్చని పరిసరాలను అందించడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయం గిరిజన బాలికల హాస్టల్ ప్రాంగణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా అటవీశాఖ వారు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మొక్కలను నాటారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం-అనంత అరణ్య ప్లాంటేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుండి సమ్మర్ క్యాంపులో పాల్గొని కంప్యూటర్ శిక్షణ, ఎ1, యోగ, ఆరోగ్యం, న్యూట్రిషన్, ఇమ్యూనిటీ పవర్, వంటి వివిధ హంసలపై శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ శిక్షణ ద్వారా అన్ని రంగాలలో రాణించే విధంగా తరిఫీదవాలన్నారు. వారు నేర్చుకున్న అంశాలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "పర్యావరణ సమతుల్యత సాధించాలంటే ప్రతి ఇంట్లో ఒక మొక్క నాటాలి. ఈ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, దానిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. ప్రతిఒక్కరు అమ్మ పేరున ఒక చెట్టు, మనకు జన్మనిచ్చిన అమ్మపై ఉన్న ప్రేమను చాటుకుంటూ, భూమాతను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ "అమ్మ పేరున ఒక చెట్టు" నాటాలని ప్రత్యేక పిలుపు. ఒక మొక్క - ఒక భవిష్యత్తు: ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. పాడేరు మెడికల్ కాలేజ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర రావు, వైస్ ప్రిన్సిపల్ చంద్రమోహన్,ప్రొఫెసర్ లక్ష్మి కుమారిలతో పాల్గొని మొక్కలను నాటే కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్,అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్, డా.వంపురు గంగలయ్య, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి,జిసిసి డైరెక్టర్ బొర్ర నాగరాజు, జిల్లా ఫారెస్ట్ అధికారి ఉమామహేశ్వరి, డ్వామా పిడి విద్యాసాగర్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ పిబీకే పరిమళ, ఐసిడిఎస్ పిడి ఝాన్సీరాం, డిపిఓ చంద్రశేఖర్ రావు, డిఎల్‌పిఓ పిఎస్ కుమార్, ఏపీఎస్ఎస్ఏ స్వామి నాయుడు, గురుకులం ఓఎస్డి మూర్తి, యుహెచ్‌డిఎఫ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీదారులకు ఉచిత భోజనం




పాడేరు, జూన్ 5, ప్రభాతవార్త

సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ, అన్న క్యాంటీన్' సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పరిపాలనవిభాగం వారు కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పాల్గొన్న అర్జీదారులకు ఉచిత భోజనాన్ని పంపిణీ చేశారు. ఈ ఉచిత భోజనం ప్రతి వారం జిల్లా నలుమూలల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్)కు వచ్చే అర్జీదారుల సౌకర్యార్థం, ఉచిత భోజన పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే గిరిజనులు, పేద ప్రజలు ఆకలితో అలమటించకుండా చూడటం, ఆకలి తీర్చడం బాధ్యతగా భావించి, ఈ భోజనం ఏర్పాటు చేశామన్నారు. కొంతమంది బయట భోజనం చేయలేక ఆకలితో తిరిగి వెళ్లే వారికి ఇదొక మంచి అవకాశం అని, అలాగె పిజిఆర్ఎస్‌లో వారి సమస్యలను చెప్పుకున్నందుకు వచ్చిన అర్జీదారుల ప్రతి ఒక్కరికి ఈ భోజన సదుపాయం అందించడం జరుగుతుందన్నారు. ఐటీడీఏ పాడేరు విభాగం, అన్న క్యాంటీన్ నిర్వాహకుల సంయుక్తశీగా నిర్వహించే ఈ ఉచిత భోజనం కార్యక్రమం పిజిఆర్ఎస్ అర్జీదారులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దూర ప్రాంతాల నుండి ఎన్నో ఆశలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కనీస వసతులు కల్పించడం తమ బాధ్యతని, అందులో భాగంగానే ఈ ఉచిత భోజన పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సదుపాయాన్ని అర్జీదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో హేమలత, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పీబికే పరిమళ,,అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్న క్యాంటీన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంకాడ పంచాయితీ పరిధిలోని గ్రామాల్లో టీడీపీ యూనిట్ స్థాయి సమావేశం



గూడెంకొత్తవీధి జూన్ 5, ప్రభాతవార్త

జీకే వీధి మండలం సంకాడ పంచాయతీ పరిధిలోని పెద్ద జడుమూరు, చిన్న జడుమూరు, గ్రామాలలో గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు అధ్యక్షతన యూనిట్ స్థాయి సమావేశాలు ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా మండల అధ్యక్షులు పొత్తురు కొండలరావు, క్లస్టర్ ఇంచార్జ్ పడేలు పాండురాజు హాజరై గ్రామంలోని పలు సమస్యల కొరకు చర్చించడం జరిగింది. ప్రధానంగా వాటర్ సమస్య, సిసి రోడ్ల సమస్య, డ్రైనేజీలు మిగతా అంశాలపై చర్చించడం జరిగింది. ఈ సమస్యలపై గ్రామస్తుల సమక్షంలో ఒక తీర్మానం చేసుకొని తీర్మానం కాపీని మై టిడిపి ఆప్ ద్వారా పార్టీ కార్యాలయానికి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండలరావు మాట్లాడుతూ మీ గ్రామంలో ఏ విధమైన సమస్యలు ఉన్నాయి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతూన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మీకు ఏ సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు, తెలుగు యువత నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ తగ్గి సోమరాజు, యూనిట్ ఇంచార్జ్ మామిడి చంటిబాబు, తెలుగు యువత మండల ఉపాధ్యక్షులు దేశగిరి గంగాధర్, ఎస్టీ సెల్ అధ్యక్షులు కాకూరు చిన్న శివ కేశవ, గ్రామ కమిటీ కోశాధికారి దేసగిరి సంజీవరావు, మామిడి సత్యవతి, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ



గూడెం కొత్తవీధి జూన్ 5, ప్రభాతవార్త

సాగులు గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు భూమి హక్కు పత్రాల (పట్టాల) పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న స్థలాలకు సంబంధించి నిరుపేదలకు, ముఖ్యంగా గిరిజన కుటుంబాలకు ఈ పట్టాలను అందజేయడం జరిగింది. ఈ పంపిణీ కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచ్ రాజు, సర్పంచ్ బుజ్జి బాబు, ఆదివాసీ నాయకులు రాజుబాబు, పెసా కమిటీ అధ్యక్షులు సత్తిబాబు, జే.ఏసీ నాయకులు ఎల్.రామచంద్ర, వి.ఆర్.ఓ, సాగులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమకు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న భూమి హక్కులు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమీక్ష



అరకు రూరల్, జూన్ 5, ప్రభాతవార్త

అరకులోయ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు రంజపల్లి ఉషారాణి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో మండల పరిధిలో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, విద్య, వైద్యం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజా సమస్యలను సభ్యులు సమావేశ దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులు వాటిపై వివరణలు అందించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే మండల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సభ్యులు తమ సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని, అభివృద్ధి కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీసం ప్రసాద్, మండల తహసీల్దార్ జి.రాజా శ్రీధర్, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు-1 కిల్లో రామన్న, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు-2 కొర్రా సుమాంజలి, మండల ప్రాదేశిక సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ రహితుల, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, మండల ప్రజా పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

## పద్మనాభంలో వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమానికి విశేష స్పందన



పద్మనాభం, జూన్ 5, ప్రభాతవార్త

రాష్ట్ర వైసీపీ అధ్యక్షులు జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు కె.లక్ష్మణరావు, ఎంపీపీ కె.రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం పద్మనాభంలో నిర్వహించిన టీడీపీ వెన్నుపోటుకి రెండేళ్లు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన నియోజకవర్గ సమన్వయ కర్త చిన్నశ్రీను ముందుగా వై ఎస్ ఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జంక్షనులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మానవహారం నిర్వహించి పలు నినాదాలు చేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోర విఫలమైందని ఆయన ఆరోపించారు. ఎన్నికల హామీల కరపత్రాలను దహనం చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారప్పడు, ఆదిబాబు, ఈశ్వరరావు,మురళీరాజు, గోవింద,తాలాడ పద్మనాభం,అల్లు అప్పలరాజు,నారాయణరావు,పాల్గొన్నారు.

## పద్మనాభం నూతన ఎమ్మార్వోగా పదవీ బాధ్యతలు చేపట్టిన డి.శైలజ

పద్మనాభం,జూన్ 5, ప్రభాతవార్త



పద్మనాభం మండల నూతన తహశీల్దారు గా దాడిశెట్టి శైలజ శుక్రవారం పద్మనాభం తహశీల్దారు కార్యాలయంలో పదవీ బాధ్య తలు చేపట్టారు. అయితే ఉప తహశీల్దారు చంద్రశేఖర్ ఆమెకు పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. శైలజ విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండల ఉప తహశీల్దారుగా పనిచేసి,అక్కడ నుండి విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో భూ సేకరణ విభాగంలో పనిచేసి పదోన్నతిపై పద్మనాభం తహశీల్దారుగా నియమితులయ్యారు. అయితే ముఖ్యంగా రైతులకు సంబందించి భూ సమస్యలను ఎప్పటికపుడు పరిష్కరిస్తారని ఆమె అన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మురళీనగర్‌లో ఘనంగా సీడ్ బాల్ కార్యక్రమం

విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మురళీనగర్ వైశాకి పార్క్‌లో వనమాలి గార్డెనింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో సీడ్ బాల్ తయారీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా సిటిజి మన కూరగాయల తోట మరియు వనమాలి బృందం సంయుక్తంగా విశాఖపట్నం నగరంలోని 20 ప్రాంతాల్లో సీడ్ బాల్ కార్యక్రమాలను నిర్వహించి సుమారు ఏకకాలంలో 50,000 సీడ్ బాల్స్ తయారు చేయించింది. మురళీనగర్ వైశాకి పార్క్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పార్క్ యాజమాన్యం, వనిత వాకర్స్ క్లబ్ సభ్యులు, వివిధ వాకింగ్ గ్రూపుల సభ్యులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమాన్ని వనమాలి ఫౌండర్స్ అరుణ అరవల, సరిత మల్ల, జ్యోతి నాదెళ్ల సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి పూర్తి సహాయ సహకారాలు అందించిన వైశాకి పార్క్ ప్రెసిడెంట్ సన్నపుల వరప్రసాద్, సెక్రటరీ రాజు, పొందూరు సూర్యనారాయణగారు మా వాకర్స్ ప్రెసిడెంట్ అప్పలకొండ గారు సెక్రెటరీ గారు సాయిరాం గారువనిత వాకర్స్ ప్రెసిడెంట్ సుదీత మా వాకర్స్‌తో పాటు సహకరించిన ప్రతి ఒక్కరికీ వనమాలి బృందం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

## జూ పార్కులో ఘనంగా పర్యావరణ దినోత్సవం

### సోలార్ ప్లాంట్ల ప్రారంభం, జంతువుల దత్తత

ఆరిలోవ, జూన్ 5, ప్రభాతవార్త



విశాఖలోని ఇందిరా గాంధీ జంతుప్రదర్శన శాలలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాతావరణ చర్య అనే ఇతివృత్తంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూ పార్క్ లో పలు పర్యావరణ అనుకూల కార్యక్రమాలు చేపట్టారు. ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద జూలోని వన్యప్రాణి భవన్, ప్రైమేట్ విభాగం,ఫీడ్ స్టోర్ల వద్ద ఏర్పాటు చేసిన 25కిలో వాట్ల సామర్థ్యం గల రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థలను ప్రధాన అటవీ సంరక్షణాధికారి ఐ.కాశీ విశ్వనాథ రాజు ఐఎఫ్ఎస్ ప్రారంభించారు. జూ స్వయం సమృద్ధికి,కాలుష్య రహిత నిర్వహణకు ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అని ఆయన పేర్కొన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి,జీవీఎంసీ, ఇండియా,జేసీఐ వైజాగ్ ఎక్సలెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో 110మంది విద్యార్థులు పాల్గొన్నారు.నేచర్ గార్డెనర్స్ గ్రూప్ వ్యవస్థాపకురాలు ఐశ్వర్య మాచవరపు జూ ప్రాంగణంలో నాటడానికి 100 మొక్కలను అందజేశారు. జూలోని వన్యప్రాణుల దత్తత కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రావు కుటుంబానికి చెందిన ఎ.శ్యామలత బృందం లక్ష్మి అనే ఏనుగును 6నెలల కాలానికి 2,16,000 విరాళంతో దత్తత తీసుకున్నారు. రెండేళ్ల చిన్నారి ధీమహి అడబాల ఇటీవల జన్మించిన సింహపు పిల్లను 90వేలు, మీర్కాట్‌ను దత్తత కోసం 10 వేలు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో జూ క్యూరేటర్ జి.మంగమ్మ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రవీంద్రనాథ్, క్లస్టర్ హెడ్ డి.ఎస్.వర్మ, జూ అధికారులు పాల్గొన్నారు.



## గాజువాక రామాలయంలో చోరీ

### -24 గంటల్లో నిందితుడి అరెస్ట్

గాజువాక,జూన్ 5,ప్రభాతవార్త

గాజువాక చట్టివానిపాలెంలోని రామాల యంలో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. క్రైమ్ ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రామాలయంలో గురువారం ఉదయం వెండి వస్తువులు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై త్వరితగతిన దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. వడ్లపూడి ప్రాంతానికి చెందిన చీపుర్ల పవన్ అనే యువకుడిని నిందితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి చోరీకి గురైన వెండి వస్తువులను (చోరీ సొత్తు) స్వాధీనం చేసుకుని, అనంతరం అతనికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

ఆనందపురం, జూన్ 5, ప్రభాతవార్త



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలం పాలవలస గ్రామంలో విశాఖ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పొట్నూరు వెంకట కృష్ణారావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు జాతీయ ఉపాధి హామీ పథకం శ్రామికులతో కలిసి మొక్కలు నాటడంతో పాటు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం.ఎన్. పరశు రామరాజు, రాష్ట్ర కిసాన్ మోర్చా కన్వీనర్ పాకలపాటి రవిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా పరశు రామరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటి, దానిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శులు డి.రామకృష్ణరాజు, డి.పి. రాజు, ఉపాధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీను, కొలుసు శ్రీను, హంష మహేష్, కార్యదర్శులు డి.సుధాకర్ వర్మ, టి.అప్పన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు మీసాల రామునాయుడు, మహిళా మోర్చా ట్రెజరర్ మాదబత్తుల బుజ్జి, మండల బీజేపీ ఉపాధ్యక్షులు బంక సీతం నాయుడు, నిమ్మకాయల అప్పలరాజు, వి.ఆర్.పి. పుష్ప పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ: గంటా

మధురవాడ, జూన్ 5, ప్రభాతవార్త

పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారానే భూమిపై మానవ మనుగడను రక్షించుకోగలుగుతామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సందర్భంగా శుక్రవారం మిథిలాపురి లే అవుట్ గాంధీ విగ్రహం నుంచి మొగదారమ్మ పార్కు వరకూ ఆయన సైకిల్ నడిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాలి, నీరు వంటి సహజ వనరులు కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. "పర్యావరణ పరిరక్షణకు నేను సైతం" అన్న సీఎం చంద్రబాబు పిలుపు మేరకు ప్రజలందరూ ఇంధన పొదుపు సంకల్పాన్ని తీసుకోవాలని కోరారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించి ఉష్ణోగ్రతలు పెరగకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. అనంతరం పార్కు కమిటీ సభ్యులతో కలసి గంటా మొక్కలు నాటారు. జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఏఎంహెచ్ఓ రవి కుమార్, డీఈ మణికుమార్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గరే గుర్నాథ్, పిల్లా వెంకట్రావు, నాగోతి సత్యనారాయణ, కానూరు అచ్యుతరావు, మామిడి దుర్గారావు, నాగోతి సూర్య ప్రకాష్, గాదు చిన్ని కుమారి లక్ష్మి, చెట్టుపల్లి సన్యాసిరావు, నమ్మి రమణ, చెట్టుపల్లి గోపీ, పిల్లా మోహన్ కృష్ణ, నాగోతి శివాజీ, నాగోతి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## కాంక్రీటుపై పచ్చని నందనవనం!

### 63 ఏళ్ల వయసులో మిద్దెతోట సాగు చేస్తున్న రాజేశ్వరి -పుట్టినరోజులకు 'మొక్కల' బహుమతి



గాజువాక,జూన్ 5,ప్రభాతవార్త

పచ్చదనంపై ఆమెకున్న మక్కువ.. కాంక్రీటు వనాన్ని సైతం నందనవనంగా మార్చేలా చేసింది. వయసు అరవై దాటినా.. పట్టుదలతో తన ఇంటి మేడపైనే అరుదైన పండ్లు, కూరగాయలను పండిస్తూ తోటివారికి ఆదర్శంగా నిలుస్తున్నారు గాజువాక శ్రీరాంనగర్‌కు చెందిన పప్పు రాజేశ్వరి. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆమె 'మిద్దెతోట' విశేషాలు 'ప్రభాతవార్త'తో పంచుకున్నారు. వ్యవసాయ, చేనేత నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన రాజేశ్వరికి చిన్నతనం నుంచే మొక్కల పెంపకమంటే ప్రాణం. 40 ఏళ్లకు పైగా అనుభవంతో.. ప్రస్తుతం తన ఇంటి రెండో అంతస్తుపై డ్రాగన్ ఫ్రూట్, ప్యాషన్ ఫ్రూట్, మస్క్ మెలన్, కక్రి మెలోన్, జామ వంటి వైవిధ్యమైన పండ్లతో పాటు ఇంటికి సరిపడా కూరగాయలు, పూల మొక్కలను సాగు చేస్తున్నారు. బియ్యం కడిగిన నీరు, కూరగాయల తొక్కలు, గొర్రె పెంట వంటి ప్రకృతిసిద్ధమైన ఎరువులతోనే ఆమె మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

### బొకేలు వద్దు.. మొక్కలే ముద్దు!

శుభకార్యాలకు వెళ్లేటప్పుడు పూలగుచ్ఛాలు ఇస్తే రెండు రోజుల్లో ఎండిపోతాయని, అదే ఒక మొక్కను కానుకగా ఇస్తే అది ఎన్నాళ్లో నిలిచి ఉండి ఫలాలను ఇస్తుందని రాజేశ్వరి అంటారు. ఇందుకోసం తన తోటలోని మొక్కల కట్టింగ్స్ ద్వారా కొత్త మొక్కలను తయారు చేసి, బంధుమిత్రుల పుట్టినరోజులు, నూతన సంవత్సర వేడుకలకు బహుమతులుగా ఇస్తూ సరికొత్త సంస్కృతికి శ్రీకారం చుట్టారు. గతేడాది యూట్యూబ్ ద్వారా 'ఎన్‌జి గ్రూప్'లో చేరిన తర్వాత తోటి మిద్దెతోటదారులతో విత్తనాలు, మొక్కల మార్పిడి చేసుకుంటున్నారు.

### ఇల్లే ఒక పాఠశాల....

ఈ తోట పనుల్లో ఆమె భర్త, టీడీపీ రాష్ట్ర పార్టీ పరిశీలకులు పప్పు రాజారావు (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్) నిరంతరం అండగా నిలుస్తూ నీరు పెట్టడం, కలుపు తీయడం వంటి పనులు చూసుకుంటారు. ఇంటిలోని మనుమలు, మనుమరాళ్లు సైతం ఈ తోటపనుల్లో ఉత్సాహంగా పాల్గొంటూ వానపాములు, వేరుపురుగుల గురించి తెలుసుకుంటున్నారు. మొక్కల పెంపకంపై ఉన్న అపోహలను తొలగించేందుకు రాజేశ్వరి ఒక సమూహంగా ఏర్పడి.. ఇంట్లో పాడైపోయిన ప్లాస్టిక్ డబ్బాల్లోనే సులువుగా కూరగాయలు ఎలా పెంచాలో ఇతరులకు నేర్పిస్తూ, ఉచితంగా విత్తనాలు పంపిణీ చేస్తున్నారు.

### ఆరోగ్యానికి మేలైన వ్యాయామం!

"మనం ఆరోగ్యంగా ఉండాలంటే మన ఇంటి ఆవరణలోనో, మేడపైనో ఎంతో కొంత స్థలంలో కూరగాయలు పండించుకోవాలి. దీనివల్ల రసాయనాలు లేని శుభ్రమైన కూరగాయలతో పాటు, ఆరోగ్యకరమైన గాలి లభిస్తుంది. తోటలో చేసే పనులు ఒంటికి మంచి వ్యాయామాన్ని, మనసుకు ఎనలేని ఉత్సాహాన్ని ఇస్తాయని పప్పు రాజేశ్వరి, మిద్దెతోట పెంపకందారు, గాజువాక తెలిపారు.

## ఒక నెల- ఒక నియోజకవర్గం- నాలుగు పర్యటనలు కార్యక్రమంలో 38 అర్జీల స్వీకరణ

ఆనందపురం, జూన్ 5, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఒక నెల- ఒక నియోజకవర్గం- నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా మూడో శుక్రవారం ఆనందపురం మండల ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి రెవెన్యూ శాఖకు సంబంధించిన 34 అర్జీలు, ఇతర శాఖలకు సంబంధించిన 4 అర్జీలు అందగా, మొత్తం 38 అర్జీలు స్వీకరించబడినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలను అధికారులకు నేరుగా అందజేసి పరిష్కారం కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వరనాయుడు, ఆనందపురం, భీమిలి, పద్మనాభం తహశీల్దార్లు, ఎంపీడీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## 11వ వార్డులో మంచినీటి బోరును ప్రారంభించిన టీడీపీ శ్రేణులు



ఆరిలోవ, జూన్ 5, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 11వ వార్డు ప్రియదర్శిని కోలనీలో శుక్రవారం వార్డ్ అధ్యక్షుడు ముగడ రాజారావు, ఇంచార్జ్ రాగతి అచ్యుత్ రావు, వార్డు నాయకులు కాకి గంగరాజు చేతులు మీదుగా "మంచినీరు బోరు" ప్రారంభించారు. కోలనీ మహిళలు మంచినీటి సమస్య తీర్చినందుకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు, వార్డు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జీవీఎంసీ వర్క్ ఇన్స్పెక్టర్ శేఖరు, బిజెపి నాయకులు మదుపాడ సన్యాసిరావు, ఎం.అప్పారావు, పేపర్ నాయుడు, లింగం సత్యనారాయణ, బోయి శ్రీను, కొల్లి ఎర్రాజీరావు తదితరులు పాల్గొన్నారు,

## పర్యావరణం- ఆరోగ్య హితం కోసం సైకిల్

### తిరుగు ప్రయాణంలోనూ సైకిల్ పై సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, జూన్ 05 ప్రభాతవార్త



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు తన తిరుగు ప్రయాణంలోనూ సైకిల్ పై హెలిపాడ్ వరకూ ప్రయాణించారు. నోవోటెల్ హోటల్ నుంచి బీచ్ రోడ్డు మీదుగా వైఎంసీఏ, వుడా పార్కు సర్కిల్, పోలమాంబ గుడి మీదుగా ఏయూలోని ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్ దగ్గర ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు సైకిల్‌పై ప్రయాణించారు. 5.5 కిలో మీటర్ల దూరాన్ని 17 నిమిషాల్లో సీఎం చేరుకున్నారు. దారిలో ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముఖ్యమంత్రి ముందుకు సాగారు. పర్యావరణ హితంతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం కోసం సైకిల్ వినియోగించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. విశాఖ సుందరమైన నగరమని.. ఇలాంటి నగరంలో సైకిల్ పై ప్రయాణించటం మరింత ఆహ్లాదం కలిగిస్తుందని సీఎం పేర్కొన్నారు. విశాఖలో సైకిల్ పాత్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని సీఎం వివరించారు. కాలుష్య రహితంగా మన రాష్ట్రాన్ని తయారు చేసేందుకు ఉద్దేశించిన నెట్ జీరో కార్యక్రమానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏ కార్యక్రమం ప్రారంభించినా విశాఖ వాసులు విజయవంతం చేస్తారని .. వివిధ సందర్భాల్లో నగర వాసులు తనకు అండగా నిలబడ్డారని సీఎం అన్నారు. విశాఖకు మరిన్ని పెట్టుబడులు తీసుకురావటం ద్వారా రుణం తీర్చుకుంటానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విశాఖను నాలెడ్జ్ హబ్ గా చేయాలని ప్రయత్నిస్తుంటే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని వచ్చే రోజుల్లో అనేక అవకాశాలకు విశాఖ కేంద్రం అవుతుందని సీఎం అన్నారు. వివిధ ప్రాజెక్టులతో సమీప భవిష్యత్తులోనే అనేక అవకాశాల కేంద్రంగా విశాఖ రూపుదిద్దు కుంటుందన్నారు. త్వరలోనే పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసి విశాఖకు గోదావరి నీళ్లు తీసుకువస్తామని అన్నారు. విశాఖను మరింత సుందరంగా తీర్చిదిద్దటంతో పాటు సంపద సృష్టికి కేంద్రంగా మారుస్తామన్నారు.

## విశాఖపట్నం పోర్ట్‌లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

విశాఖపట్నం, జూన్ 05 ప్రభాతవార్త



ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026ను విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఉత్సాహభరితంగా, పర్యావరణ పరిరక్షణ పట్ల తన నిబద్ధతను చాటుతూ నిర్వహించింది. ఈ సందర్భంగా పోర్టు యాజమాన్యం పోర్టు ప్రాంగణంలోని ఫైర్ ఆఫీస్ ప్రాంతంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పోర్ట్ చైర్‌పర్సన్ జె.ఎస్. బింద్రా, ఐఆర్‌టీఎస్, మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ, మొక్కల పెంపకం అనేది ఒక నిరంతర ప్రక్రియ అని, దానిని ఒకే రోజుకు పరిమితం చేయరాదని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు పోర్ట్ కట్టుబడి ఉందని, ఈ ఏడాది 8 లక్షల మొక్కలను నాటే లక్ష్యంతో విస్తృత స్థాయి హరిత కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య విజిలెన్స్ అధికారి శ్రీ టి. అరుణ్ ప్రసాద్, ఐఈఎస్, విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు, ఇతర భాగస్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ నగరంలోని వివిధ ప్రభుత్వ సంస్థలకు, అలాగే పోర్ట్ స్టేడియం, బీచ్ రోడ్ మరియు ఇతర ప్రధాన ప్రజా ప్రదేశాల్లో ప్రజలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ అవగాహన పెంపొందించడంతో పాటు హరిత కార్యక్రమాలను ప్రోత్సహించింది.

## అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నాశనం చేయొద్దు

### సిపిఐ డిమాండ్



ఆరిలోవ, జూన్ 5, ప్రభాతవార్త

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్న నేపథ్యంలో విశాఖ నగరంలో రాష్ట్ర ప్రభుత్వమే పర్యావరణాన్ని నాశనం చేస్తున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కామ్రేడ్ జె వి సత్యనారాయణమూర్తి విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ముడసర్లోవ రిజర్వాయర్ ఎదురుగా ఆధానీ, ఎయిర్టెల్ ప్రైవేట్ సంస్థలకు కేటాయించిన సింహాచలం దేవస్థానంనకు చెందిన 160 ఎకరాలు భూమిని తక్షణమే రద్దు చేసి పర్యావరణాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఆ భూమి వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో పాల్గొని సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో వాయు, ధూళి కాలుష్యం బాగా పెరిగిందని, ప్రభుత్వం సంస్థలు నివేదిక ఇచ్చాయని వాయు కాలుష్యానికి విశాఖ నగరం ప్రధాన కేంద్రం అయ్యిందన్నారు. నగరాన్ని కాలుష్య కోరల నుండి కాపాడే విధానాలు ప్రభుత్వం వద్ద ఏమి లేవని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖలోను, ఉత్తరాంధ్ర లోను అభివృద్ధి పేరుతో ప్రభుత్వం భూములు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి పర్యావరణ విధ్వంసం సృష్టిస్తు లక్షలాది ఉద్యోగాలు వస్తాయని రసాయిన పరిశ్రమలు అన్నిటిని ఉత్తరాంధ్రలోనే నెలకొల్పుతున్నారని అన్నారు. డేటా సెంటర్లు పేరుతో ఆధానీ, గూగుల్, ఎయిర్టెల్, రిలియన్స్ తదితర సంస్థలకు కేటాయిస్తున్న భూములలో విధ్వంసం సృష్టిస్తూ విశాఖ నగరానికి తీవ్రంగా నష్టం కులుగుతున్నదన్నారు. తక్షణమే డేటా సెంటర్ కి కేటాయించిన సింహాచలం దేవస్థానంకు చెందిన 160 ఎకరాలు భూములు అన్ని అనుమతులు రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె రహిమాన్, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎ విమల, రాష్ట్ర సమితి సభ్యుడు ఎం పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ నాగభూషణరావు, ఆర్.శ్రీనివాసరావు పార్టీ నాయకులు ఎ దేముదమ్మ మస్తాన్ భీభి, బి. పుష్పలత, యు. నాగరాజు, వై రాంబాబు, పి గోవింద్, కె లక్ష్మణరావు, ఎం శ్రీనివాసరావు ఈ అప్పలరాజు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత: ప్రభుత్వ విప్ గణబాబు

విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్క రించుకుని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు పర్యావరణ పరిరక్షణపై ఒక వినూత్న కార్యక్రమా నికి శ్రీకారం చుట్టారు. కాలుష్య నివారణే ధ్యేయంగా, సమాజంలో పర్యావరణ స్పృహ పెంచేందుకు ఆయన తన నివాసం నుండి కొత్తపాలెంలోని పార్క్ వరకు సైకిల్‌పై ప్రయాణించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. (ప్రకృతి స్ఫూర్తితో.. వాతావరణం కోసం.. మన భవిష్యత్తు కోసం) అనే నినాదంతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో, 89వ వార్డు కొత్తపాలెం పార్క్‌లో జీవీఎంసీ హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వయంగా మొక్కలు నాటారు. ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ విశాఖ నగరంలో వాహన కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోతోం దని, దాన్ని అరికట్టడానికి సైకిల్ తొక్కే అలవాటును ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని తెలిపారు. సైక్లింగ్ ద్వారా అటు ఆరోగ్యం, ఇటు పర్యావరణం రెండూ సురక్షితంగా ఉంటాయన్నారు. విశాఖకు కొండలు, సముద్రం వంటి అద్భుతమైన సహజ వనరులు ఉన్నాయని, పచ్చదనం ప్రజలకు ఆహ్లాదాన్ని ఇస్తుందని చెప్పారు. కేవలం ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా భారతదేశం అంతా పచ్చగా మారాలన్నదే మన లక్ష్యం కావాల న్నారు. కొత్తపాలెం పార్క్‌లో చేపట్టిన ఈ ప్లాంటేషన్ కార్యక్రమం కేవలం ఒక్క రోజుతో ముగిసేది కాదని, ఇదొక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమావతి, జీవీఎంసీ హార్టికల్చర్ అధికారులు పల్లవి, పూజిత, ఎపిడి చిరంజీవి, మాజీ కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, వార్డు నాయకులు బొడ్డేటి విజయ్, సత్తిరాజు, దాడి రమేష్ నాయుడు, దాడి సురేష్, ఎలమంచిలి ప్రసాద్ మరియు సచివాలయం సిబ్బంది, మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో షిరిడీ సాయిబాబా, పార్వతమ్మ ఆలయాల వార్షికోత్సవం



పద్మనాభం, జూన్ 5, ప్రభాతవార్త

పద్మనాభం జంక్షనులో వేంచేసియున్న షిరిడీ సాయిబాబా, పార్వతమ్మల ఆలయాల 23వ వార్షికోత్సవంను ఆలయాల ధర్మకర్త మొకర అన్నమయ్య ఆధ్వర్యంలో శుక్రవారం భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. అన్నమయ్య దంపతులు సాయిబాబా, పర్వతమ్మలకు విశేష పూజలు చేసారు. అనంతరం భక్తులు సాయిబాబా, పార్వతమ్మలను దర్శించుకొని పూజలు చేసారు. మొదటి నుండి కొనసాగిస్తున్న అన్నదాన కార్యక్రమంను ఈ ఏడాది కూడా సుమారు నాలుగు వేల మందికి అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కె రమణ, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ సభ్యులు దామోదరరావు, నాయకులు కంటుబోతు ఎర్రనాయుడు, తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

## కెజీహెచ్‌కు బేయర్ 50 మిరేనా వైద్య పరికరాల అందజేత

### బేయర్ సంస్థను అభినందించిన కెజీహెచ్ చీఫ్ డాక్టర్ వాణి

విశాఖపట్నం జూన్ 5,ప్రభాతవార్త



నడి వయసు స్త్రీల బుతుక్రమ సమయంలో అధిక రక్త ప్రవాన్ని నిరోధించడం, గర్భ సంచి తొలగింపు ఆపరేషన్లను నివారిచడంలో ఉపయోగ పడే 50 మిరేనా కీలక వైద్య పరికరాలను బేయర్ సంస్థ శుక్రవారం కెజీహెచ్ గైనిక్ విభాగానికి విరాళాంగా అందజేసింది. ప్రెజర్వ్ ది ఉటరస్ కాంపెయిన్ ఎల్ఎన్‌జీఐయుఎస్ పైలెట్ ప్రాజెక్ట్ లో భాగంగా రెండు లక్షలు విలువ చేసే 50 మీరేనా పరికరాలను బేయర్ సంస్థ ఆసుపత్రి కి అందజేసినట్టు కెజీహెచ్ గైనిక్ వైద్య విభాగాధిపతి డాక్టర్ జీ.సౌమిని తెలిపారు. 40 నుంచి 50 ఏళ్ల నడి వయసు లో ఎక్కువ మంది స్త్రీలుబుతుక్రమ సమయంలో అధిక రక్త స్రవం భాధ భరించలేక గర్భసంచి తొలగిపు ఆపరేషన్‌లకు మెగ్గుచూపడం పరిపాటి గా మారిందని, అలాటి సందర్బంల్లో గర్భ సంచి తొలగింపు (హిస్టక్టమీ) ఆపరేషన్ ను 90 శాతంమేరకు అవసరం లేకుండా ఈ మీరేనా పరికరం స్త్రీల సమస్యలకు మంచి ఉపశమనం గా ఉపయోగ పడుతుందని డాక్టర్ సౌమిని చెప్పారు ఈ సందర్బంగా ఆసుపత్రికి వైద్య పరికరాలు ను ఉచితంగా అందజేసిన బేయర్ సంస్థ బిజినెస్ మేనేజర్ సుభోజిత్ ను కెజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి అభినందించారు.

## మత్స్య ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానం.. ఆంధ్రప్రదేశ్

### విశాఖలో జాతీయ ఫిషరీస్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు ఉత్తరాంధ్రకు వరం -రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు -కాకినాడ ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణకు రూ.72 కోట్ల కేటాయింపుపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి



విశాఖపట్నం, జూన్ 5 ప్రభాతవార్త

మత్స్య సంపద ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్‌ను తొలి స్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విశాఖపట్నంలో జాతీయ సముద్ర ఆహార ఎగుమతుల వర్క్ షాప్ లో పాల్గొన్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, తెలిపారు,విశాఖలో జాతీయ ఫిషరీస్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యాలయం ద్వారా మత్స్యకారులు, ఆక్వా రైతులు, ఎగుమతిదారులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని 15 రోజుల్లో కేటాయిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడంశుభపరిణామమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మత్స్య రంగాన్ని మరింత బలోపేతం చేసే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కాకినాడ ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం రూ.72 కోట్లు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ఈ నిధులతో హార్బర్‌లో ఆధునిక సౌకర్యాలు కల్పించి మత్స్యకారులకు మెరుగైన మౌలిక వసతులు అందించనున్నట్లు చెప్పారు.రాష్ట్రంలో ఆక్వా రంగాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు రైతులు, మత్స్యకారులకు పూర్తి సహకారం అందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మత్స్య, ఆక్వా రంగాల అభివృద్ధి ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రం చేపట్టే కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.

## పర్యావరణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

అగనంపూడి ప్రభాత వార్త



పర్యావరణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని 85వ టిడిపి అధ్యక్షులు కర్రి దశంద్ర అన్నారు. పర్యావరణ దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పెట్రోల్ డీజిల్ తగ్గించాలని ఒకరోజు సైకిల్ పర్యటించిన ఆదేశాలకు అనుగుణ వార్డులో సైకిల్ పై పర్యటించారు. అగనంపూడి హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ గోపికృష్ణ తో కలిసి మొక్కలు నాటారు. సందర్భంగా డాక్టర్ గోపికృష్ణ మాట్లాడుతూ నేడు ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుం దని పచ్చదనం పెరిగితే ఉష్ణోగ్రతలు తగ్గడం ప్రజలకు ఉపయోగకరంగ ఉంటుందన్నారు. రమేష్, అండి బోయిన మంగరాజు, చందు రమేష్, నాగరాజు, కర్నశీ అప్పారావు, తలారి శ్రీనివాసరావు, సాలపు బుచ్చిబాబు, పాల్గొన్నారు.

26skl13:26skl13.qxd 05-06-2026 23:01 Page 1



## శ్రీ రామ ఐటిఐలో మొక్కలు నాటే కార్యక్రమం



రాజాం, జూన్ 5, ప్రభాతవార్త:

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పొందూరు శ్రీరామ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు పర్యావరణ విషయంపై అవగాహన కల్పిస్తూ భవిష్యత్తులో మరిన్ని మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత విద్యార్థులపై ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పొన్నాడ చిన్నబాబు, ఇన్‌స్ట్రక్చర్ కుప్పిలి అన్నారావు, శివకుమార్, గిరి కుమార్, ఆఫీస్ అకౌంటెంట్ సంతోషి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత



రాజాం, జూన్ 5, ప్రభాతవార్త:

పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలని పెరుమాలి గ్రామ సర్పంచ్ ప్రతినిధి అప్పల నరసింహరాజు (అప్పచ్చి) అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభావతి జాగృతి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో వ్యవస్థాపక అధ్యక్షుడు రోటేరియన్ సప్పటి వసంతరావు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెరుమాలి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం వైద్యాధికారి డాక్టర్ ఎస్.వెంకటేష్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోటేరియన్ వసంతరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆర్భాటాలకు పోకుండా తమ పుట్టినరోజు, పెళ్లి రోజు వంటి కార్యక్రమాల సమయంలో మొక్కలు నాటడం ద్వారా భూతాపం నియంత్రణకు తోడ్పడి, భావితరాల మనుగడను కాపాడగలమని అన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న జగన్నాథవలస సర్పంచ్ ప్రతినిధి జి.వెంకటరావును, ముఖ్య అతిథి అప్పచ్చిలను ప్రభావతి జాగృతి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో వైద్యాధికారులు డాక్టర్ మనోజ్ఞ రమణి, డాక్టర్ శ్రీనివాస్ చేతుల మీదుగా వసంతరావు సత్కరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్థులు, గ్రామ అధికారులు పాల్గొన్నారు.

## నేడు కడకెల్ల ఫీడర్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

వీరఘట్టం, జూన్ 5 ప్రభాతవార్త

11 కేవీ కడకెల్ల ఫీడర్ నందు ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, చెట్లు తొలగించుట మరియు ఇతర పనుల నిమిత్తం కడకెళ్ళ ఫీడర్ పరిధిలో పనులు చేయుట వలన ఈ నెల ఆరో తేదీ ఉదయం 8 నుండి రెండు గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.విష్ణుమూర్తి శుక్రవారం విలేకరులకు తెలిపారు. దీని పరిధిలో ఉన్న నడుకూరు, కిమ్మి , చిట్టిపులివలస, విక్రంపురం, కంబరవలస, కంబర, నడిమికెల్ల, కడకెళ్ళ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు.

**బిటివాడ ఫీడర్ నందు కూడా...**

బిటివాడ ఫీడర్ నందు కూడా శనివారం చిదిమి, యు.వెంకంపేట, రేగులపాడు, కత్తుల కవిటి, కె.ఇచ్చాపురం, ఎం.రాజపురం, తూడి, పాలమెట్ట, గంగంపేట, హుస్సేన్‌పురం, కొంచ గ్రామాలకు కూడా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ విష్ణుమూర్తి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

## పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కండి

### టిడిపి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ



వీరఘట్టం, జూన్ 5 ప్రభాతవార్త :

పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలని, ఇది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ అధ్యక్షులు మోజూరు తేజోవతి, పాలకొండ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పడాల భూదేవిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం వీరఘట్టంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైకిల్ ర్యాలీని నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. మండుటెండని కూడా లెక్క చేయకుండా వీరిద్దరూ కాసేపు సైకిల్ తొక్కి అందర్నీ ఉత్సహ పరిచారు. అనంతరం మన గ్రోమోర్ సెంటర్ నుండి అంబేద్కర్ జంక్షన్ వరకు పర్యావరణంపై నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. కాలుష్య రహిత సమాజ స్థాపనకు అందరూ కలిసికట్టుగా నడుం బిగించాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం అంబేద్కర్ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి పర్యావరణంపై నినాదాలు చేస్తూ ప్రజలని చైతన్యవంతులని చేశారు. పాలకొండ ఇన్‌చార్జ్ పడాల భూదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సాసుబిల్లి వెంకటరమణ (బుజ్జి), వీరఘట్టం పట్టణ శాఖ అధ్యక్షులు పప్పల మహేష్, పాలకొండ నగర పంచాయతీ పట్టణ శాఖ అధ్యక్షులు గుమ్మడి సింహాద్రి, గేదెల గజేంద్రనాయుడు, తమరాపు అప్పలనాయుడు, ఏఎంసీ డైరెక్టర్ కొప్పర సుహాసిని, పోరెడ్డి వెంకట నాయుడు, సాదు నారాయణరావు, పక్కి రవి, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి



వీరఘట్టం, జూన్ 5 , ప్రభాతవార్త:

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంఈఓ డి.గౌరునాయుడు అన్నారు. శుక్రవారం వీరఘట్టం బాలికోన్నత పాఠశాల, రేగులపాడులోని కేజీబీవీ పాఠశాలల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి పాఠశాల మొక్కలతో, పచ్చదనంతో చూడముచ్చటగా ఉండాలని ఇందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పాఠశాలల్లో అనంత అరణ్య క్రమంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఎనఆరఈజీఎస్ ఏపీవో జి.సత్యం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈసీ ప్రధానోపాధ్యాయులు, ఎస్.ఓ, ఉపాధ్యాయులు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, పాఠశాలల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారు కాలనీలో పలు సమస్యలు పరిష్కరించిన కమిషనర్



రాజాం, జూన్ 5, ప్రభాతవార్త

రాజాం మున్సిపాలిటీ పరిధిలో అమ్మవారి కాలనీలో చేతి పంపు బోరు ప్లాట్‌ఫారం ఏర్పాటు చేయాలని తెల్పగా వెంటనే స్పందించి బోర్ చుట్టూ ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అదేవిధంగా సాయిబాబా మందిరం వెళ్లే మార్గంలో వీధి దీపాలు వెలగక సమస్యను తెలుపగా వెంటనే స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేశారు. అలాగే పారిశుద్ధ్యం సమస్య లోపించడంతో సంబంధించిన సూపర్వైజర్ భాను ప్రకాష్‌కు విషయాన్ని తెలిపి సమస్యను పరిష్కరించే దిశగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు ఏఈ, సూపర్వైజర్లు స్థానికులు ఉన్నారు.

## మలేరియా జ్వరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



సీతంపేట, జూన్ 5 ప్రభాతవార్త

మండలంలో మలేరియా జ్వరాలు నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా మలేరియా నివారణ అధికారి సత్యనారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం సీతంపేట ఏరియా ఆసుపత్రిని ఆయన సందర్శించారు. మలేరియా జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలను ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ బి.శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే 195 గ్రామాలలో మలేరియా దోమల నివారణకు ఐఆరఎస్ పిచికారి చేయడం జరిగిందన్నారు. రెండో విడత మిగిలిన గ్రామాలను ఐఆరఎస్ పిచికారి చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు పాల్గొన్నారు.



**పెద్ద శ్రీరాంపురం రైతు సేవ కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షులు మాదిన రామారావు 50% రాయితీపై కట్టెజనము విత్తనాలు రైతులకు పంపిణీ చెయ్యడం జరిగింది. హార్టికల్చర్ లటర్ గంగరాజు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.**

**- ప్రభాతవార్త-కంచిలి**

## ప్రజాదర్బార్‌తో సమస్యలు పరిష్కారం

### -ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన



ఆమదాలవలస, జూన్ 5 (ప్రభాతవార్త)

ప్రజాదర్బార్‌తో ప్రజా సమస్యలను పరిష్కరించుకోవచ్చునని, సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతివారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమదాలవలస ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఇండస్ట్రియల్ ఏరియా ఎమ్మెల్యే క్యాంప్ విజన్ ఆఫీస్ శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని అన్నారు. ప్రజా పాలన దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. ప్రజల నుండి వచ్చిన పలు వినతలు తెలుసుకొని సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు మొదలవలస రమేష్, రాష్ట్ర కార్యంగా కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, తమ్మినేని సుజాత, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తమ్మినేని గీత, మాజీ వైస్ చైర్మన్ కె.వి.రాజ్యలక్ష్మి, పట్టణ పార్టీ అధ్యక్షులు సంపదరావు మురళీధర్, పిఎసిఎస్ అధ్యక్షులు సిమ్మ మాధవి, నాగళ్ళ మురళీధర్, కూన ఆంజనేయులు, బగాది భాస్కరరావు, టిడిపి నాయకులు, క్యాంప్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



జలుమరు, జూన్ 5 ప్రభాతవార్త :

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతతో కూడుకోవాలని జలుమూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా స్కూల్ ఆవరణలో ఆమె మొక్కలను నాటుతూ ఈ విషయంలో అత్యంత బాధ్యతతో వ్యవహరించాలన్నారు. మొక్కలు నాటటం అనేది బాల్యం నుంచి నేర్పాలని సూచించారు. పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు ప్రాధాన్యతను చక్కగా తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో తొమ్మిదేళ్ల బాలుడు మృతి

రాజాం, జూన్ 5 ప్రభాతవార్త:

రాజాం ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం, చీపురుపల్లి మండలానికి చెందిన రాజు అనే 9 ఏళ్ల బాలుడు క్యాన్సర్ పిక్కలు శస్త్రచికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఈఎన్‌టి, మత్తు డాక్టర్లు ఇరువురులు కలిపి బాలుడికి 12 వేలు రూపాయలు అదనంగా తీసుకుని వైద్యం చేశారు. అయితే ఆపరేషన్ సమయంలో మత్తు ఎక్కువ అయిందో లేకా మరో కారణంగా ఆఖరి క్షణంలో శ్రీకాకుళం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. అనంతరం బాలుడు మృతి చెందగా వైద్యుల నిర్లక్ష్యమంటూ తల్లిదండ్రులు హాస్పిటల్ వద్ద బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేయడంతో అక్కడి నుంచి వైద్యులు రాత్రి 8 గంటలకు సెటిల్మెంట్లు కాగా ముందస్తుగా ఐదు లక్షలు ఇచ్చి ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తుంది. దీంతో రాజాం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ హరిబాబును కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లుగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ పద్మశ్రీ రాణి తెలిపారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిల్ యాత్ర



ఇచ్ఛాపురం, జూన్ 5 ప్రభాతవార్త:

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ముఖ్యమంత్రి మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ళ జైదేవ్ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మరియు పర్యావరణ ప్రేమికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సైకిల్ యాత్ర ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కాళ్ళ జైదేవ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వాహనాల వినియోగాన్ని తగ్గించి, సాధ్యమైనంత వరకు సైకిళ్లు ఉపయోగించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు.అదేవిధంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పరిశుభ్రమైన మరియు హరితమయమైన ఇచ్ఛాపురం నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సైకిల్ యాత్ర విజయవంతం కావడానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం నాయకులు నర్తు అప్పారావు, పిట్ట శివ, కొరికాన ధర్మ, బచ్చు శంకర్, కాళ్ళ శివ, సుభాష్ రౌలో తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు ఏఐ ఆధారిత శిక్షణ



ఇచ్ఛాపురం, జూన్ 5 ప్రభాతవార్త:

మున్సిపల్ బాలికొన్నత పాఠశాలలో ఏ ఐ ఆధారిత శిక్షణ ఇచ్చారు. ఇచ్ఛాపురం ఐ సి డి ఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్వాడీలకు ప్రోజెక్టు ఆఫీసర్ ఎం.రాజేశ్వరి శిక్షణ ఇచ్చారు. నవ చేతన యాప్‌పై అంగన్వాడీ కార్యకర్తలకు ట్రైనింగ్ అందించారు. 0-6 ఏళ్ల పిల్లలకు ఐదు అభివృద్ధులకు సంబంధించి పిల్లలకు స్క్రీనింగ్ చేయాలని, మొబైల్ యాప్ ద్వారా నవ చేతన అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించడం జరుగుతుందని వివరించారు. ఈ నెల 9 వరకు విడతల వారీగా శిక్షణ ఇస్తామని చెప్పారు.

## పర్యావరణ రక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్యే కూన



ఆముదాలవలస, జూన్ 5, (ప్రభాతవార్త) :

పర్యావరణాన్ని పరిరక్షించడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం 22వ వార్డు లక్ష్ముడిపేట చెరువులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం మీద వాతావరణంలో పెను మార్పులు సంభవించడం వల్ల మనిషి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. భారతదేశ అత్యధిక జనాభా కలిగిన దేశమని, కాబట్టి ప్రతి ఒక్కరు దేశం పట్ల కనీస బాధ్యత కలిగి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధం, కాలుష్య నివారణపై ప్రజలకు దిశ నిర్దేశం చేయాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, కాలుష్య రహిత సమాజ స్థాపనకు అందరం నడుం బిగించాలని ప్రజలకు కోరారు. రాష్ట్రకాలింగా కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, పిఎసిఎస్ అధ్యక్షులు సిమ్మ మాధవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కనితి విజయలక్ష్మి భాయ్, నాగళ్ళ మురళీధర్, కూన ఆంజనేయులు, గురుగుబెల్లి నాగేశ్వరరావు, కూన అప్పలనాయుడు, పప్పల కృష్ణారావు, బగాది భాస్కరరావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీమంత్రి లక్ష్మణదాసు 112వ జయంతి



పాతపట్నం, జూన్ 5, ప్రభాతవార్త :

స్థానిక శాఖా గ్రంథాలయంలో రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి లుకలాపు లక్ష్మణదాసు 112వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోరుశెట్టి వెంకటరమణ, ముడిదాన వెంకటరమణమూర్తి హాజరై లక్ష్మణదాసు చిత్రపటానికి జాతీయ నూలు పోగులు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణదాసు చేసిన సేవలను వారు కొనియాడారు. శ్రీకాకుళం జిల్లా రాజకీయ చరిత్రలో ఆయన విశిష్ట స్థానాన్ని సంపాదించారని, ఆయన సేవలను చిరస్థాయిగా నిలిపేందుకు శ్రీకాకుళం జిల్లాలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.సింహాచలం, ఎం.రాజు, గోరుశెట్టి మిన్నారావు, కొండక లోకేష్, వైకుంఠరావు, గుమ్మడి అప్పారావు, గరికపాటి అప్పారావు, గరికపాటి సాదురావు, గ్రంథాలయ పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## అవయవదానంతో అమరజీవిగా పుండరీ కాంక్షయ్య



బూర్జ, జూన్ 5, ప్రభాతవార్త :

మండల కేంద్రమైన బూర్జ గ్రామానికి చెందిన సూరి పుండరీకాంక్షయ్య (44) ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి. కానీ ఈరోజు ఎంతోమందికి ఆదర్శవంతంగా నిలిచారు. అతను ఒక సాధారణ ఆటో డ్రైవర్‌గా తన జీవనం సాగిస్తున్న కుటుంబంలో మూడు సంవత్సరాల క్రితం ఆకస్మాత్తుగా తన ఆరోగ్యంలో మార్పు వచ్చి రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయి. అక్కడినుంచి డయాలసిస్ మీద ఆధారపడి అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో కొంతమంది శ్రేయోభిలాషుల ద్వారా తెలుసుకొని “ఆంధ్రప్రదేశ్ జీవన్ దాన” కిడ్నీ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ సమయంలోనే అతనికి వచ్చిన ఆలోచనే అవయవ దానం మీద అవగాహన. ఈరోజు నాకు ఒక అవయవం అవసరం వచ్చింది. దానికోసం నేను వెతుకులాడుతున్నాను కదా ఇలానే నాలాంటి వాళ్ళు ఈ సమాజంలో ఎంతోమంది అవయవాల కోసం ఎదురు చూస్తుంటారని ఒక మంచి ఆలోచన చేసి నేను అవయవాన్ని తీసుకోవడమే కాకుండా నా తదనంతరం కూడా నా వయవాలు కూడా ఎవరికైనా ఉపయోగపడాలి అని ఒక గొప్ప నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ రకంగా ఒక సాధారణ కుటుంబం నుంచి అంత గొప్ప నిర్ణయం తీసుకున్నందుకుగాను ఆసుపత్రి యాజమాన్యం ఆ పార్థివ దేహానికి జీవన్దాన్ సర్టిఫికెట్ను అందించి ,ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా సత్కరించారు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు ఇదొక స్ఫూర్తిదాయకమైన కార్యక్రమం అని భావించి ఘన నివాళిగా రాగోలు ఆసుపత్రి నుండి బూర్జ గ్రామం వారి స్వగృహం వరకు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించి, జేజేలు పలికి ఆ భౌతికకాయాన్ని తరలించారు. కార్యక్రమంలో గ్రామంలో ఉన్నటువంటి పెద్దలు చిన్నలు, బంధువులు స్నేహితులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెన్నుపోటు చంద్రబాబు డౌన్ డౌన్



సంతబొమ్మాళి, జూన్ 5, ప్రభాతవార్త:

ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రెండేళ్లుగా ప్రజలను మోసగించిన వెన్నుపోటు చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ వైఎసఆర్సిపి నాయకులు నినాదాలు చేశారు. మండల కేంద్రం సంతబొమ్మాళి బస్టాండ్ కూడలి వద్ద చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం వైఎసఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వెన్నుపోటు చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా వస్తున్న వైఎసఆర్సిపి నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. రోప్ సహాయంతో ర్యాలీ ముందుకు వెళ్లకుండా పోలీసులు ప్రయత్నించగా వైఎసఆర్సిపి శ్రేణులు తోసుకుంటూ ముందుకు సాగారు. చంద్రబాబు రాక్షస పాలన నశించాలని పోలీసులు దౌర్జన్యం నశించాలంటూ ర్యాలీని ముందుకు సాగి స్థానిక బస్టాండ్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను, టిడిపి మేనిఫెస్టో కాపీలను చించి వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పిటిసి పాల వసంత రెడ్డి, వైఎసఆర్సిపి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పి.రవి కుమార్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బి.మోహన్ రెడ్డి, వైఎసఆర్సిపి నాయకులు నక్క భీమారావు, మార్పు నాగభూషణరావు, సురాడ రాజారావు, అంగ మల్లేష్, , దుక్క భూషణ్ రెడ్డి , మార్పు అశోక్ చక్రవర్తి, శ్రీరంగం వీరస్వామి, , తదితరులు ఉన్నారు.

## ఎన్‌జేకే ప్రీమియర్ లీగ్‌లో ఛాంపియన్‌గా సీతంపేట జట్టు



సీతంపేట, జూన్ 5, ప్రభాతవార్త :

ఎన్‌జేకే ప్రీమియర్ లీగ్‌లో క్రికెట్ ఛాంపియన్‌గా సీతంపేట జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. మొదట బహుమతిగా 50 వేల రూపాయలు చెక్కును స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన్, కర్నాన అప్పలనాయుడు మార్కెట్ కమిటీ చైర్మన్ సంధ్యారాణి , తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : కూన



బూర్జ, జూన్ 5 ప్రభాతవార్త

డ్వాక్రా మహిళా సంఘాల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తూ ప్రభుత్వం వారికి నిరంతరం అండగా నిలుస్తుందని పి యు సి చైర్మన్, ఆముదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రమైన బూర్జలో డ్వాక్రా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన “మన డబ్బులు-మన లెక్కలు” కార్యక్రమంలో శాసనసభ్యులు కూన రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రతి రూపాయి పొదుపు, ప్రతి లావాదేవీకి సంబంధించిన లెక్కలు పారదర్శకంగా నిర్వహించడం ద్వారా సంఘాలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. “మన డబ్బులు-మన లెక్కలు” కార్యక్రమం ద్వారా మహిళల్లో ఆర్థిక అవగాహన, బాధ్యతాయుతమైన పొదుపు అలవాట్లు పెంపొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ నాయుడు, వెలుగు ఏపిఎం బాబురావు, ఎండిఓ తిరుపతిరావు, ఆర్ష్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, డ్వాక్రా సంఘాల నాయకులు, మహిళలు, పార్టీల నాయకులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## పచ్చని చెట్లే పర్యావరణానికి సోపానాలు : డీఎల్‌పీఓ




పాతపట్నం, జూన్ 5 ప్రభాతవార్త:

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని అంతరాబ గ్రామంలోని స్వర్ణ గ్రామం-2 ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఇప్పిలి వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై, గ్రామస్థులు, సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. అలాగే మండలంలోని కొరసవాడ గ్రామపంచాయతీలో ఎంపిడిఓ హెచ్ వి రమణమూర్తి , గ్రామ పెద్దలు కలిసి మొక్కలు నాటే కార్యక్రమం మరియు గ్రామసభను నిర్వహించారు.

## వీరఘట్టం తహశీల్దార్‌గా రాజేశ్వరరావు

వీరఘట్టం, జూన్ 5 ప్రభాతవార్త

వీరఘట్టం తహశీల్దార్‌గా వి.రాజేశ్వరరావు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయనగరం జిల్లా బొండపల్లి మండలంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తూ పదోన్నతిపై వచ్చారు. ఆయనకు డీ.టీ ప్రసాదరావు, మండల సర్వేయర్ గాంధీ, ఆరఐ రవితేజ, వీ.ఆర్.ఓల సంఘం నాయకులు, వంజరాపు రమేష్ నాయుడు, వీఆర్వోలు, సర్వేయర్‌లు, కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కోటబొమ్మాళి, జూన్ 5 ప్రభాతవార్త

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతయని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావారణం అందించాలని స్థానిక ఎం పీడీవో కుప్పిల ఫణీంద్రకుమార్ అన్నారు. ఆయన శుక్రవారం మండలం కురుడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల అవరణంలో ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ చింతలపూడి ప్రసాదరావుతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో జి.హరిప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మజ్జి కృష్ణారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కొత్తమ్మతల్లికి డమరుకం వితరణ

కోటబొమ్మాళి, జూన్ 5 ప్రభాతవార్త

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే శ్రీ కొత్తమ్మతల్లి దేవస్థానంకు గుంటూరుకు చెందిన గార్లపాటి హేమ డమరుకం (బోగం బెల్)ను కనుకుగా (వితరణగా) శుక్రవారం ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణకు అందజేశారు. అమె స్థానిక ఎలఎసఐసి కార్యాలయంలో అధికారిగా పని చేస్తున్నారు. వీరికి ఆలయ సాంప్రదాయం ప్రకారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో హేమ తండ్రి సతీష్ కుమార్ కుటుంబసభ్యులు ఉన్నారు.

## రైతులకు యూరియా కార్డులు పంపిణీ

గరివిడి, జూన్ 5, ప్రభాత వార్త:



మండల కేంద్రం గరివిడిలో 15 మంది రైతులకు యూరియా కార్డులను మాజీ ఎంపిపి పైల బలరాం పంపిణీ చేశారు. రైతులకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఈ సందర్భంగా బలరాం పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండ పాలెం పంచాయతీలో బలరాం మొక్కలు నాటి పచ్చదనానికి శ్రీకారం చుట్టారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఆయన అన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఎస్.సురేష్, టిడిపి నాయకులు బోర రమణ మూర్తి,మహంతి రమణ మూర్తి, శీరపు శ్రీను,గొట్టిముక్కల సత్తిరాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ పర్వీజ్ తదితరులు పాల్గొన్నారు.

## పని కల్పించాలని కోరుతూ ఫేకర్ కాంట్రాక్టు కార్మికుల నిరసన



గరివిడి, జూన్ 5 , ప్రభాత వార్త:

ఫేకర్ కాంట్రాక్టు కార్మికులు పని కల్పించాలని కోరుతూ కర్మాగారం ఎదుట నిరశన చేపట్టారు. కర్మాగారం మూసివేత తో ఉపాది కోల్పోయామని 91 మంది కార్మికులు తమ వేదన వ్యక్తం చేశారు.వేరే ప్రాంతాలకు చెందిన పని వాళ్ళతో యాజమాన్యం కర్మాగారంలో పనిచేయిస్తున్నారు కానీ తమకు అదే పని చేసే అవకాశం కల్పించక పోవడం విచారకరమన్నారు. ఫేకర్ లో అన్ని విభాగాల్లో పనిచేసే కార్మికులకు యాజమాన్యం సెట్మెంట్ చేసిందని 91 మందికి సెట్మెంట్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కి తమ సమస్య పై ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆదేశాలను కార్మిక శాఖ అధికారులు పట్టించుకోక పోవడం దారుణమని వారు ఆవేదన వ్యక్తంచేశారు. 91 మంది కార్మికుల కు ఫేకర్ యాజమాన్యం న్యాయం చేయాలని వారు కోరారు.

## సిహెచ్‌సిని అకస్మాత్తుగా తనిఖీ చేసిన కలెక్టర్

కురుపాం, జూన్ 5, ప్రభాతవార్త :



కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం అకస్మాత్తుగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను రోగుల వద్దకు స్వయంగా వెళ్లి అడిగి తెలుసుకున్నారు. పలు విభాగాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. రోగులకు అందజేస్తున్న మందులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందు తున్న సేవలను సంతృప్తికరంగా ఉన్నా యా లేవా అని రోగులకు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సంతృప్తికరము కలిగే విధంగా డాక్టర్స్ వైద్య సిబ్బంది వ్యవహరించాలని ఆయన సూచించారు.

## ఘనంగా వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం



మక్కువ, జూన్ 5, ప్రభాత వార్త:

మండల కేంద్రంలో శుక్రవారం వైసీపీ ఆధ్వర్యంలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు అనే భారీ గర్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచన చేస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైసీపీ శ్రేణులు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి,మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక.రాజన్నదొర హాజరయ్యారు. వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర వైసీపీ కార్యదర్శి,పార్వతిపురం నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు,మక్కువ జడ్పీటీసీ మావుడి.శ్రీనివాస్ నాయుడు,మక్కువ మండల వైసీపీ అధ్యక్షులు మావుడి.రంగు నాయుడు గారు,జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు ,మండల నాయకులు,కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రాజన్నదొర కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అమలు చేయలేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిగా విస్మరించారని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వ కుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. చంద్రబాబు అధికారం కోసం విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు,రైతులను మోసగించారని ఆయన తీవ్ర విమర్శలు చేశారు.రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల విశ్వాసాన్ని దుర్వినియోగం చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు.అలాగే చంద్రబాబు గారు వెన్నుపోటులో దిట్ట అని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీని మరింత బలంగా గెలిపించి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన నాయకులకు,కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## రాయి అడ్డొచ్చినా ఎదుగుదల ఆగలేదు!

### జీవితం ఎంత కఠినమైనా పోరాటం ఆపొద్దు!



గరుగుబిల్లి , జూన్ 5, ప్రభాతవార్త :

ఎండలు మండుతున్నాయి... అడవులు తగ్గిపోతున్నాయి... ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది. ఇలాంటి సమయంలో మనిషికి, సమాజానికి, ప్రకృతికి ఓ గొప్ప సందేశం ఇస్తున్న ఈ దృశ్యం అందరినీ ఆలోచింపజేస్తోంది. భారీ రాయి తనపై పడినా... వేర్లు నేలను వదల్లేదు. కొమ్మలు ఆకాశాన్ని చేరాలనే ఆశను కోల్పోలేదు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఎంత భారాన్ని మోయాల్సి వచ్చినా... ఆ చిన్న చెట్టు జీవించడం మానలేదు... ఎదగడం ఆపలేదు.ప్రకృతి మనకు చెబుతున్న గొప్ప పాఠం ఇదే... పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా, సమస్యలు ఎంత పెద్దవైనా, ఆశను వదులుకోకపోతే ఎదుగుదల ఆగదు. ఒక చెట్టు రాయి బరువును భరిస్తూ నిలబడగలిగితే, మనిషి తన జీవితంలోని కష్టాలను జయించి ముందుకు సాగలేడా?ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా... ప్రకృతిని కాపాడుదాం, మొక్కలను పెంచుదాం. అలాగే జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా నిలబడి ముందుకు సాగుదాం. ఎందుకంటే... విజయం అనేది సమస్యలు లేని వారి సొంతం కాదు. సమస్యల మధ్య కూడా నిలబడ్డ వారి సొంతం. రాయి బరువుకి చెట్టు ఓడిపోలేదు... కష్టాల బరువుకి మనం ఎందుకు ఓడిపోవాలి?.

## మన డబ్బులు, మన లెక్కలు కార్యక్రమం పై అవగాహన




డెంకాడ, జూన్ 5, ప్రభాతవార్త :

మండలంలోని ఏపిఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ అన్ని గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాలు మహిళల ఆర్థిక సాధికారత,పారదర్శకత, జవాబు దారితనంపై అవగాహన కల్పించారు.ప్రతి సభ్యురాలు నారీ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు తమ సంఘానికి సంబంధించి ఆర్థిక లావాదేవీలు చెల్లింపులు పరిశీలించుకోవాలన్నారు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ దొర, డిఆర్డిఏ ఏపీఎం దేవుడు బాబు, సీసీలు విశ్వేశ్వరరావు,సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## గజరాజులను చూసి రూరల్ ప్రాంత ప్రజలు గజగజ ..!

సాలూరు, జూన్ 5, ప్రభాతవార్త :



సాలూరు మండలం మావుడి పంచాయతీ పురిగాని వలస సమీంలో ఉన్న తోటల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపును చూసిన రూరల్ ప్రాంత ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అంతేకాకుండా అక్కడ రైతు పొలంలో ఉన్న పంపుసెట్టు ఏనుగులు ధ్వంసం చేయడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతు న్నారు.అలాగే ఈ మధ్య పక్కన ఉన్న మండలంలో గజరాజులు చేసిన నష్టం తెలుసుకొని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీంతో ఫారెస్ట్ అధికారులు రంగంలోకి దిగి రెవెన్యూ,విధ్యుత్,పోలీస్ శాఖ అధికారులకు ఈ విషయం చెప్పి అప్రమత్తంచేసారు.అలాగే రేంజర్ తవిటి నాయుడు ఏనుగులు సంచరించే ప్రాంతంలో రూరల్ ప్రాంత ప్రజలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు దృష్టికి తీసుకు వెళ్లారని సమాచారం.ఎందుకంటే ఏనుగులు చూడడానికి అత్యుత్సాహంతో వచ్చే జనాలను కంట్రోల్ చేయకపోతే ప్రాణనష్టం జరిగే ప్రమాదం లేకపోలేదు.అలాగే రెండోరోజు కూడా సేమ్ లొకేషన్ పురగాని వలస కొండ ప్రాంతాలలో ఏనుగులు ఉన్నట్టుగా ఫారెస్ట్ అధికారులు తెలియజేశారు.

## లారీ ఆక్సిడెంట్‌లో ఒకరి మృతి

గరుగుబిల్లి, జూన్ 5, ప్రభాతవార్త



శుక్రవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో బలిజిపేట మండలం వేంగాపురానికి చెందిన బొంగు వెంకట్ నాయుడు అనే వ్యక్తి తన కూతురు లావణ్యను బస్సు ఎక్కించడానికి గరుగుపల్లి వచ్చి తిరిగి వెళ్లే సమయంలో రావుపల్లి , కొత్తపల్లి గ్రామాల మధ్య వెంకట శివ దుర్గ రైస్ మిల్ సమీపంలో ఒక లారీ కిందపడి మరణించడం జరిగింది . అతను బలిజిపేట జూనియర్ కాలేజ్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నారు. ఈ కేసులో గరుగుబిల్లి ఎస్ఐ కేసు నమోదు పరిచి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం పూర్తయ్యాయి. లారీ డ్రైవర్ ఈశ్వరరావు పోలీసుల అదుపులో ఉన్నాడు.

## ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 2.0 కు గ్రామ సభలు విజయవంతం చేయాలి

బలిజిపేట, జూన్ 5, ప్రభాతవార్త:

బలిజిపేట మండలంలో వివిధ గ్రామాలలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన--గ్రామీణ్ (గ్రాహీర్-+) 2.0 అమలులో భాగంగా గ్రామ సభల నిర్వహణను కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా సంబంధిత గ్రామ పంచాయతీలలో జూన్ 10వ తేదీలోగా గ్రామ సభలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు నేడు మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించడం జరిగింది. గ్రామ సభలలో అర్హులైన లబ్ధిదారుల జాబితాను పరిశీలించి, పారదర్శకంగా తుది ప్రాధాన్యత జాబితా (గ్రాతీఅశీతీఙఎ ావఅర్) రూపొందించే ప్రక్రియ చేపట్టినట్లు హౌసింగ్ ఏఈ గుల్లా దివాకర్ తెలిపారు.గ్రామ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అర్హులైన నిరాశ్రయ కుటుంబాలకు గృహాల మంజూరులో పారదర్శకత, జవాబుదారీతనం పాటించబడుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే గ్రామ సభల నివేదికలను నిర్ణీత గడువులోపు ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు.

## చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ఏఐ కీలకం

రామభద్రపురం, జూన్ 5, ప్రభాత వార్త :

కృత్రిమ మేధస్సుపై కార్యకర్తలకు శిక్షణ.లో బాడంగి సిడిపిఓ సుజాత చిన్నారుల సమగ్ర అభివృద్ధి, ప్రారంభ దశలో మెదడు వికాసం, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు (ఏఐ ఎనేబుల్డ్ ఈసిడీ)కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రారంభ బాల్య వికాస శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శీ బడిండి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బూసాయ వలసజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సిడిపిఓ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల ప్రారంభ అయిదేళ్లపాటు వారి భవిష్యత్ అభివృద్ధికి అత్యంత కీలకమైనవని, అంగన్వాడీ కార్యకర్తలు ఎర్లీ స్టిమ్యులేషన్ కార్యకలాపాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఇందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చిన్నారుల ప్రారంభ దశలో మెదడును చురుకుదనాన్ని పెంచడం, కార్యకలాపాల ప్రాముఖ్యత, అలాగే కృత్రిమ మేధస్సు ఆధారిత ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవడం అనేవి ఈ శిక్షణ అత్యంత కీలకమైందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య శాఖ వైద్యాధికారిఎం అపర్ణ మాట్లాడుతూచిన్నారుల ఆరోగ్యంపై తీసుకునే శ్రద్ధలో మన బాధ్యత ఎలా ఉండాలనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కే కృష్ణకుమారి రత్నకుమారి సూర్యకుమారి అంగన్వాడి టీచర్ అందరూపాల్గొన్నారు

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

### మిమ్స్ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్ వర్మ

నెల్లిమర్ల, జూన్ 5, ప్రభాతవార్త

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రయత్నించాలని మిమ్స్ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పూసపాటి ప్రభాకర్ వర్మ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మిమ్స్ మెడికల్ కాలేజీలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు, పీజీ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పీజీ విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నవ చేతన, బాల్యారంభ అభివృద్ధిపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

పాచిపెంట, జూన్ 5, ప్రభాతవార్త :



మూడు సంవత్సరముల పిల్లల నుండి ఆరు సంవత్సరాలు పిల్లల మనోభావాలు తెలుసుకొని వారికి ఉత్తమ జీవితాన్ని ప్రసాదించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆ కార్యక్రమంలో భాగంగా నవచేతన బాల్యారంభ అభివృద్ధి కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ప్రాజెక్ట్ డైరెక్టర్ టి దుర్గ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూప్రతి చిన్నారికి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి దుర్గా అన్నారు. మండల కేంద్రమైన పాచిపెంట కేజీబీవీ పాఠశాల లో అంగన్వాడి కార్యకర్తలకు బాల్య రంభ అభివృద్ధిపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం ఆమె ప్రారంభించారు. . అలాగే ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి బొత్స అనంతలక్ష్మి మాట్లాడుతూ తొలి 1,000 రోజులు చిన్నారి భవిష్యత్తును నిర్ణయించే స్వర్ణావకాశంప్రతి చిన్నారికి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాల్యారంభ అభివృద్ధి స్క్రీనింగ్‌పై రాష్ట్రవ్యాప్త సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. గర్భధారణ నుండి రెండేళ్ల వయస్సు వరకు ఉండే తొలి 1,000 రోజులు చిన్నారి జీవితంలో అత్యంత కీలకమైన కాలమని పేర్కొన్నారు. ఈ సమయంలో పిల్లల మెదడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని, ప్రతి సెకనుకు దాదాపు 10 లక్షల న్యూరల్ కనెక్షన్లు ఏర్పడతాయని తెలిపారు. పిల్లల మెదడు అభివృద్ధిలో 80 శాతం మూడు సంవత్సరాల వయస్సులోపు, 90 శాతం ఆరు సంవత్సరాల వయస్సులోపు పూర్తవుతుందని వివరించారు.బాలల అభివృద్ధిలో ఆలస్యాలను ముందుగానే గుర్తించి సకాలంలో జోక్యాలు చేపట్టేందుకు స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, వైద్య మరియు ఆరోగ్య శాఖతో సమన్వయంగా "నవచేతన" అనే మొబైల్ ఆధారిత అభివృద్ధి స్క్రీనింగ్ సాధనాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సాధనం 0 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లల అభివృద్ధిని అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని చెప్పారు.నవచేతన వేదిక ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు పిల్లలలో స్థూల చలన నైపుణ్యాలు, సూక్ష్మ చలన నైపుణ్యాలు, భాషా అభివృద్ధి, జ్ఞాన వికాసం మరియు సామాజిక–భావోద్వేగ అభివృద్ధి వంటి ఐదు ప్రధాన అభివృద్ధి రంగాలను వ్యవస్థీకృతంగా పరిశీలించగలరని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బందికి అభివృద్ధి మైలురాళ్ల ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, వయస్సుకు అనుగుణమైన స్క్రీనింగ్ నిర్వహించడం, అభివృద్ధి ఆలస్యాలు మరియు వైకల్యాలను గుర్తించడం, ముందస్తు రిఫరల్ మరియు జోక్యాలను ప్రోత్సహించడం, కుటుంబ స్థాయిలో పోషణాత్మక సంరక్షణ పద్ధతులను బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులు ఇంటి వద్దనే స్పందనాత్మక సంరక్షణ, ఆటలు, సంభాషణ, పోషణ మరియు ప్రారంభ అభ్యసన కార్యక్రమాల ద్వారా పిల్లల అభివృద్ధికి మరింత సమర్థవంతంగా తోడ్పడగలరని తెలిపారు."ప్రతి చిన్నారి విలువైనవాడు" అనే నమ్మకంతో ప్రభుత్వం బాల్యారంభ అభివృద్ధిలో పెట్టుబడి పెడుతోందని, నవచేతన కార్యక్రమం ద్వారా అభివృద్ధి సంబంధిత సమస్యలు ఉన్న ఏ చిన్నారి కూడా గుర్తించబడకుండా మిగలకుండా చూడటమే లక్ష్యమని పేర్కొన్నారు.శిక్షణ కార్యక్రమంలో సిడిపిఓ అనంతలక్ష్మి సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## పెద్ది సినిమాలో కొండగట్టు పాత్రలో యువ నటుడు హరి విశ్వనాథ్

కొత్తవలస, జూన్ 5 (ప్రభాతవార్త):

సినిమా రంగంలో ఒక్క అవకాశం కోసం వేలాది మంది ఎదురుచూస్తుంటారు. అలాంటి పోటీ ప్రపంచంలో చిన్న చిన్న అవకాశాలను సైతం పెద్ద అడుగులుగా మార్చుకుంటూ ముందుకు సాగుతున్నారు యువ నటుడు విశ్వనాథ హరికుమార్. ఇటీవల తెరకెక్కిన "పెద్ది" సినిమాలో చిన్న సీన్‌లో కనిపించిన హరికుమార్, ఆ చిన్న అవకాశాన్ని తన సినీ ప్రయాణంలో మరో మెట్టుగా భావిస్తున్నారు. చిన్న పాత్ర అయినప్పటికీ, పెద్ద తెరపై కనిపించడం తనకు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని చెబుతున్నారు.ఇప్పటికే సుమారు 35కి పైగా షార్ట్ ఫిలిమ్స్‌లో నటించిన ఆయన, "దేవర" సినిమాలో పెళ్లికొడుకు పాత్రలో కూడా నటించారు. అంతేకాకుండా నాలుగు టెలివిజన్ సీరియల్స్‌లో నటించి, ప్రముఖ యూట్యూబ్ ఛానళ్లలో రూపొందిన వెబ్ సిరీస్‌లలో కూడా తన నటనతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు.కేవలం సినిమాలకే పరిమితం కాకుండా, బజాజ్ వంటి ప్రముఖ కంపెనీల ఏసీ ప్రకటనల్లో కూడా నటించి కమర్షియల్ రంగంలోనూ తనకంటూ గుర్తింపు సంపాదించుకున్నారు."నేడు చిన్న పాత్ర చేసినా.. రేపు పెద్ద సినిమా తీయడమే నా కల" అని చెప్పే హరికుమార్, భవిష్యత్తులో తన సొంతంగా ఒక పెద్ద సినిమా నిర్మించి ప్రేక్షకుల ప్రేమను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి

కొమరాడ జూన్ 5 ప్రభావత వార్త మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కొమరాడ మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమేష్ అన్నారు. శుక్రవారం పాలెం పంచాయితీ రావికోన గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని కోరారు ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం 25 వార్త

## ఎల్. కోట మండల తహసీల్దార్‌గా హరి

లక్క వరపు కోట, జూన్ 5, ప్రభాత వార్త :




లక్క వరపు కోట మండల నూతన తహసీల్దార్ గా పి హరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు ఇతను బోగాపురం మండలం ఇంచార్జి తహసీల్దార్ గా పని చేస్తూ పదోన్నతి పై జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలు మేరకు వచ్చి నట్లు అయన తెలిపారు ఎల్ కోట తహసీల్దార్ గా పని చేసిన కోరాడ శ్రీనివాసరావు కి డెప్యూటీ కలెక్టర్ గా పదోన్నతి పై బదిలీ కావడం తో ఇప్పటి వరకు ఇంచార్జి తహసీల్దార్ గా టి రమేష్ బాధ్యతలు నిర్వహించడం జరిగింది ఇప్పుడు కొత్త తహసీల్దార్ రావడం తో శుక్రవారం నుంచి పూర్తి బాధ్యతలు హరి చేపట్టారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతు మండలం లో రెవిన్యూ సమస్యలు పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను అని తహసీల్దార్ హరి తెలిపారు.

## అంగన్వాడీలకు నవచేతన్ యాప్ పై శిక్షణ



నెల్లిమర్ల, జూన్ 5, ప్రభాతవార్త:

మండలంలోని అంగన్వాడీ బోధకులకు నవచేతన యాప్ వినియోగంపై శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బాలికోనత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిడిపిఓ రేఖ వాణి యాప్ వినియోగం, శిశువుల స్క్రీనింగ్, వివరాల నమోదు తదితర అంశాలపై సమగ్రంగా బోధకులకు వివరించారు. ఏ ఐ స్క్రీనింగ్ ఇంటలిజెన్స్ ఆర్టిఫిషల్ 0–6 సంవత్సరములు లోపు పిల్లలకు 9 క్యాటగిరీలుగా విభజించి స్క్రీనింగ్ చేసే విధానం పై అవగాహన కల్పించారు. వాటి ద్వారా పిల్లల్లో ఉన్న చిన్న చిన్న లోపాలను ఏ విధంగా గుర్తించాలి, గుర్తించిన వారిని ఎలా రిఫర్రల్ కి పంపించాలి అనే అంశాలను వివరించారు. నవచేతన లో 0–3 లోపు పిల్లలకు మెదడు అభివృద్ధి 80% ఉంటుందని అందువల్ల తల్లిదండ్రులు, అమ్మమ్మ, నాన్నములు ప్రేమ పూర్వకంగా మాటల ద్వారా, ఆటల ద్వారా కథలు ద్వారా పిల్లలకు దగ్గరగా ఉంటూ ఎక్కువ విషయంపై అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఈ వయసులో ఒక్క నిమిషానికి 10 లక్షల న్యూరాలస్ వృద్ధి చెందుతాయని, తల్లి గర్భం లో ఉన్నప్పటి నుంచి పిల్లలు మూడు సంవత్సరముల లోపు 1000 పదాలను నేర్చుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సతివాడ పీహెచ్సి డాక్టర్ అనిల్ కుమార్ హైపర్ యాక్టివ్ ఏ డి హెచ్ మైల్డ్ స్టోన్స్ 0–6 పిల్లలకు ఆర్ బి ఎస్ కే గురించి అవగాహన కల్పించారు, కార్యక్రమంలో ఏసీడీపీఓ సత్యవతి సూపర్వైజర్స్ టి. త్రినాధ, బి. శారద, పైడితల్లి, రమణమ్మ, ఉమా, హెల్త్ విజిటర్,యాప్స్ న్యూట్రిషన్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి నెల్లిమర్ల మండలం నగర పంచాయతీలోని అన్ని కేంద్రాల అంగన్వాడి బోధకులు హాజరయ్యారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

తెర్లాం (ప్రభాత వార్త :



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి జీవనరాణి ఆదేశించారు. శుక్రవారం ఆమె పెరుమాలి, తెర్లాం ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు అన్ని వేళల అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. రికార్డును సక్రమంగా నిర్వహిం చాలన్నారు. క్యాన్సర్ వ్యాధి నివారణ కొరకు అందుబాటులో ఉన్న హె పి వి వాక్సిన్ ను అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.అలాగే తెర్లాం ఆసుపత్రి వార్డు లలో ఉన్న రోగుల తో మాట్లాడి బాగోగులు తెలుసుకొని, వైద్యం ఎలా అందుతుందో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో ప్రసవాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ఆసువత్రి ప్రసవాళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే అంతర్జాతీయ యోగ దినోత్సవంను విజయవంతం చేయాలన్నారు. పెరుమాలి, తెర్లాం వైద్యాధికారులు, శెట్టి శ్రీనివాస్ రావు,మనోజ్ఞ రమణి, వెంకటేష్, రెడ్డి స్వాతి, వంశీ, ఆయా ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

## అనుమతి ఇవ్వలేదంటే భయపడినట్లేనా.. జనసేన పార్టీ ఇంచార్జ్ వబ్బిన

శృంగవరపుకోట,జూన్5,ప్రభాతవార్త



తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ లో జనసేన పార్టీ అధినేత ఏపీ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బహిరంగ సభకు అనుమతి ఇవ్వలేదంటే అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం మాఅధినేతను చూసి భయపడినట్లేనని ఊహించికోవల్సి వస్తుందని ఎస్.కోట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ తెలిపారు.గురువారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బహిరంగ సభను నిర్వహించేందుకు పవన్ కళ్యాణ్ కు అనుమతులు నిరాకరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు

## భూమి సర్కారుది... పెత్తనం ప్రైవేటు ది..

చీపురుపల్లి జూన్ 5 ప్రభాతవార్త :



చీపురుపల్లి మండలం కర్లాం రెవెన్యూ పరిధిలో సుమారు 25 కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని ప్రైవేటు పెత్తందారులు కబ్జాకి పాల్పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కానీ పాల్గొని సమసపట్ల కన్నీటి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది..కర్లాంలో 87.34 ఎకరాలు ప్రభుత్వ గయాలు భూములు సర్వే నెబర్ 408 లో ఉండగా ఆ భూముల్లో గెస్ట్ హౌస్, ప్రహరీ నిర్మాణం జరిపి యదేచ్ఛగా భీమిలికి చెందిన ఓ వ్యక్తి సుమారు 87.34 ఎకరాల ప్రభుత్వ భూములు హస్త గతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. రైతులు పంట పొలాల్లోకి వెళ్లకుండా అడ్డంగా గోడ నిర్మాణం చేపట్టడంతో సదరు కబ్జాదారుని ఆక్రమణలను బయటపెట్టడానికి గ్రామస్తులు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న రైతులు పలు ఆరోపణలు చేస్తున్నారు. సుమారు రూ.25 కోట్లు విలువైన భూములు ప్రభుత్వానికి ఉన్నప్పటికీ రెవెన్యూ యంత్రాంగం ఆ భూ సమస్య వైపు ఎందుకు చూడడం లేదు అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. చీపురుపల్లి మండలంలోని కర్లాం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 408లో 87.34 ఎకరాలు ప్రభుత్వ భూములే అని, రెవెన్యూ రికార్డులు ప్రకారం 87.34 ఎకరాలు గయాలు భూములుగా నమోదై ఉన్నాయి అన్నారు. అందులో ఎలాంటి పట్టాలు మంజూరు కాలేదు అని,ఆ భూముల్లో అక్రమ కట్టడాలపై ఇంతవరకు తమ దృష్టికి రాలేదు అని తాసిల్దార్ ధర్మరాజు వివరణ ఇచ్చారు.

## పర్యావరణ పరిరక్షణకు భాగస్వాములు కావాలి

### మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

నెల్లిమర్ల, జూన్ 5, ప్రభాతవార్త :



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్, టిడిపి నెలిమర్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నెల్లిమర్లలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి బంగార్రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక రామతీర్థం జంక్షన్ నుంచి పార్టీ కార్యాలయం వరకు బంగారు రాజు సైకిల్ తొక్కారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరోతో నడిచిన వాహనాలను ప్రజలు అత్యధికంగా వినియోగించడం వల్ల కాలుష్యం ఏర్పడుతున్నదని, పర్యావరణం దెబ్బతింటుందని అన్నారు. పర్యావరణ దెబ్బతింటే ప్రజల జీవన మనుగడకు ముప్పేయార్పడుతుందని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని ఆయన సూచించారు. పార్టీ నాయకులు లెంక అప్పలనాయుడు, గేదెల రాజారావు, అవనాపు సత్యనారాయణ, అట్టాడ శ్రీధర్ (బుజ్జి), కాళ్ల రాజశేఖర్, బొంతు వెంకటరమణ, తాడ్డి సత్యనారాయణ, పోతల రాజప్పన్న, రెడ్డి వేణు, నల్లం శ్రీనివాసరావు, బైరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి, చందక గౌరీ తదితరులు పాల్గొన్నారు. ప్రజా దర్బారులో వినతుల స్వీకరణ అనంతరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వచ్చిన పలువురు నుంచి వినతులు స్వీకరించారు.

## ప్రపంచాన్ని ఊపేస్తున్న
# సాకర్ ఫీవర్




**ఫిఫా ప్రపంచకప్‌కు వేళవుతోంది. ప్రపంచ మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌కు మరో అయిదు రోజుల్లో తెరలేవ నుంది. నెలరోజులకు పైగా ప్రపంచాన్ని ఉర్రూత లూగిం చనుంది. ఇప్పటికే ప్రపంచానికి ఫుట్‌బాల్ జ్వరం పట్టుకుంది. భారత జట్టు ఈ టోర్నీలో లేకు న్నా... మనదేశానికి సాకర్ ఫీవర్ అంటుకుంది. అర్జెంటీనా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతుండగా... ఫ్రాన్స్, ఇంగ్లాండ్, స్పెయిన్, పోర్చుగల్ వంటి జట్లు ప్రధాన పోటీదారులుగా ఉన్నాయి.**

**న్యూయార్క్:** ఫిఫా ప్రపంచకప్ ఆరంభానికి సమయం సమీపిస్తుండడంతో ఈ టోర్నీ సంబంధించిన అంశాలపై ప్రపంచం ఆసక్తిగా గూగుల్‌లో సెర్చ్ చేస్తోంది. ముఖ్యంగా ఫిఫా ట్రోఫీ ఇపుడు అందరి దృష్టిని విశేషంగా ఆకట్టుకుంది. ఈ ట్రోఫీని మొదటిసారి 1970లో రూపొందించారు. ఇది 37 సెంటీమీటర్ల ఎత్తు, 6 కిలోల బరువు ఉంటుంది. దీన్ని 18 క్యారెట్ల బంగారంతో తయారుచేశారు. అడుగుభాగం ఆకుపచ్చ మలాకైత్ ఖనిజంతో అలంకరింపబడింది. దీని విలువ ప్రస్తుతం 170 కోట్లకు పైగానే ఉంటుంది. భూమిని పైకి ఎత్తిపట్టుకున్న ఇద్దరు మానవ ఆకృతుల రూపంలో అద్భుతంగా ఫిఫా ప్రపంచకప్ ట్రోఫీని ఇటాలియన్ శిల్పి సిల్వియో గజానిగా రూపొందించారు.

**బ్రెజిల్ సొంతమైన పాత ట్రోఫీ**

బ్రెజిల్ జట్టు 1970లో మూడో ప్రపంచకప్ నెగ్గి పాత జులెస్ రిమెట్ ట్రోఫీని శాశ్వతంగా సొంతం చేసుకుంది. దీంతో 1974 నుంచి కొత్త ట్రోఫీ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. ట్రోఫీ డిజైన్ల కోసం పోటీ సైతం నిర్వహించగా, గజానిగా రూపొందించిన నమూనా ఎంపికైంది. 1974 నుంచి విజేతలకు ఈ ట్రోఫీని అందజేస్తున్నారు. తొలిసారి జర్మనీ కెప్టెన్ బెకెన్ బాయర్ అందుకున్నాడు. గత అనుభవం వల్ల ఫిఫా ప్రపంచకప్ అసలైన ట్రోఫీని గెలిచిన జట్టు అందుకుంటుంది. కానీ అది తమ వెంట తీసుకెళ్లడానికి అనుమతించారు. అసలైన ట్రోఫీ ఫిఫా వద్దే ఉంటుంది. ఫైనల్ ముగిసిన వెంటనే దానిని జ్యూరిచ్‌లోని ఫిఫా ప్రధాన కార్యాలయానికి విమానంలో తిరిగి పంపిస్తారు. దానికి బదులుగా, గెలిచిన దేశానికి బంగారు పూత పూసిన కంచు ప్రతిరూపం రెప్లికా ట్రోఫీని అందజేస్తారు. దీనితోనే విజేత జట్టు స్వదేశానికి చేరుకుంటుంది. అందుకే ఫిఫా ప్రపంచకప్ ట్రోఫీని వరల్డ్ స్పోర్ట్స్‌లో అత్యంత విలువైన, గుర్తింపు పొందిన ట్రోఫీలలో ఒకటిగా పరిగణిస్తారు.

# పాక్‌ను చిత్తు చేసిన యువ భారత్

## ఆసియా కప్ అండర్18 హాకీ ఫైనల్లో జపాన్‌తో ఢీ




**కకామిగహారా(జపాన్):** దాయాది పాకిస్థాన్‌ను యువ భారత్ చిత్తు చిత్తు చేసింది. కాకపోతే ఇది హాకీ మైదానంలో. జపాన్‌లో జరుగుతున్న ఆసియా-18 హాకీ కప్‌లో భారత యువ జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో చిర కాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 5-3 గోల్స్ తేడాతో ఓడించింది. సగర్వంగా ఫైనల్లోకి దూసుకెళ్లింది. నేడు జపాన్‌తో కప్ కోసం తలపడనుది.

ఆట ప్రారంభం నుండి భారత టీమ్ ఆధిక్యం చాటింది. పదే పదే పాక్ డిఫెన్స్‌ను ఛేధిస్తూ పాక్ గోల్ పోస్ట్‌పై దాడులు చేసింది. చివరకు 12వ నిమిషంలో సఫలమైంది. పెనాల్టీ స్ట్రోక్‌ను అశీష్ తాని గోల్‌గా మలిచి భారత్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. మొదటి క్వార్టర్ ముగిసే వరకు భారత్ ఆ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. రెండో క్వార్టర్‌లో పాకిస్థాన్ దూకుడుగా ఆడటం ప్రారంభించింది. 27వ నిమిషంలో అదిల్ గోల్‌తో పాక్ 1-1తో సమవుజ్జీగా నిలిచింది. నేడు ఆసియా కప్ ఫైనల్లో జపాన్‌తో తలపడనుంది.

అంతకుముందు భారత అండర్-18 బాలికల జట్టు ఫైనల్ చేరడంలో విఫలమైంది. ఫెనాల్టీ షూటౌట్‌లో భారత్ వెనకడింది. చైనా 3-1 గోల్స్ తేడాతో నెగ్గి ఫైనల్లో ప్రవేశించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 2-2తో సమవుజ్జీగా నిలిచాయి. నౌషీన్ నాజ్ 3వ నిమిషంలో, కిరణ్ ఎక్కా 54వ నిమిషంలో భారత్‌కు గోల్స్ అందించారు. దీంతో ఫలితం తేల్చడానికి పెనాల్టీ షూటౌట్ నిర్వహించగా, చైనా మూడు అవకాశాలను సద్వినియోగం చేసుకుంది. భారత్ ఆటగాళ్లు మూడింటిలో రెండు గోల్స్ చేయడంలో విఫలమయ్యారు. చైనా గోల్ కీపర్ లీ గ్జూ అద్భుతంగా అడ్డుకుంది.

## పతిరాగే 92.62 మీటర్లు నమోదు

**రోమ్:** ఇటలీలోని రోమ్‌లో జరిగిన డైమండ్ లీగ్‌లో శ్రీలంక జావెలిన్ త్రోయర్ రుమేష్ పతిరాగే అత్యధికంగా 92.62 మీటర్ల దూరం నమోదుచేసి చరిత్ర సృష్టించాడు. తొలిసారి డైమండ్ లీగ్ స్వర్ణం అందుకున్నాడు. 2024 ఒలింపిక్ ఫైనల్ తర్వాత ప్రపంచంలోనే అత్యుత్తమ త్రోగా ఇది నిలిచింది. అలాగే ఆసియా అథ్లెటిక్ చరిత్రలో ఇది రెండో అత్యుత్తమ ప్రదర్శన. ఈ క్రమంలో భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా(90.23 మీటర్లు)ను వెనక్కి నెట్టాడు.

ఈ మైలురాయి అందుకున్న తొలి శ్రీలంక జావెలిన్ త్రోయర్‌గా రికార్డు నెలకొల్పాడు. ప్రపంచ జావెలిన్‌లో శ్రీలంకకు కొత్త గుర్తింపు తీసుకువచ్చాడు.

శ్రీలంక జావెలిన్ త్రోయర్ పతిరాగే... ఈ డైమండ్ లీగ్ ఫైనల్ తొలి ప్రయత్నంలో 84.49 మీటర్లు నమోదుచేశాడు. రెండో ప్రయత్నంలో 90 మీటర్లకు పైగా విసిరాడు. చివరి ప్రయత్నంలో ఏకంగా 92.62 మీటర్లు నమోదుచేశాడు. ఈ ప్రదర్శనతో రుమేష్ పతిరాగే ప్రపంచ ఆల్‌టైమ్ జాబితాలో ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. 90 మీటర్ల మార్కును దాటిన నాల్గవ ఆసియా జావెలిన్ త్రోయర్‌గా, మొత్తం మీద 28వ అథ్లెట్‌గా పతిరాగే నిలిచాడు. పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ 92.97 మీటర్లతో ఆసియా రికార్డు అతని పేరిట ఉంది.

భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా మూడో స్థానానికి చేరాడు. శ్రీలంక అథ్లెటిక్ చరితల్రో ఇదొక మైలురాయిగా నిలవనుంది.




## ఫ్రెంచ్ ఫైనల్లో జ్వెరెవ్, కొబోలీ

**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో అనూహ్య పరిణామాల మధ్య ఫైనల్ సమరం ఖరారైంది. గత కొన్నేళ్లుగా టైటిళ్లపై ఆధిపత్యం చెలాయించిన ఆటగాళ్లు టోర్నీ నుంచి నిష్క్రమించడంతో ఈసారి కొత్త గ్రాండ్‌స్లామ్ విజేత ఆవిర్భవించనున్నారు. మొదటి సెమీఫైనల్లో జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరెవ్ నాలుగు సెట్ల హోరాహోరీ పోరులో 7-5, 6-2, 3-6, 6-3తో చెక్ యువ సంచలనం జాకుబ్ మెన్సిక్‌పై విజయం సాధించి ఫైనల్ చేరాడు. తొలి సెట్‌ను చెమటోడ్చి నెగ్గిన జ్వెరెవ్ తరువాతి సెట్‌ను అలవోకగా నెగ్గి ఆధిక్యం చాటాడు. ఈ దశలో పుంజుకున్న మెన్సిక్ మూడో సెట్ నెగ్గి ఊపుమీదకనిపించాడు. అనుభవజ్ఞుడైన జ్వెరెవ్ నాలుగో సెట్ నెగ్గి పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు.

మరో సెమీఫైనల్లో ఇటలీ ప్లేయర్ ప్లావియో కొబోలీకి వాపోవర్ లభించింది. ప్రత్యర్థి ఇటలీకే చెందిన మాట్టియో అర్నాల్డి వైరల్ ఫీవర్‌తో మ్యాచ్‌కు దూరమయ్యాడు. దీంతో తొలి గ్రాండ్ స్లామ్ ఫైనల్లో అడుగుపెట్టిన కొబోలీ... జ్వెరెవ్‌తో టైటిల్ కోసం తలపడనున్నాడు. ఇప్పటివరకు గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలవని ఈ ఇద్దరు ఆటగాళ్లలో ఒకరు ఆదివారం జరిగే ఫైనల్ అనంతరం తొలిసారి మెజర్ చాంపియన్‌గా నిలవనున్నారు. దీంతో ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ సమరం అత్యంత ఆసక్తికరంగా మారింది.

## 34 ఎత్తుల్లో ప్రజ్ఞానంద గెలుపు

**ఓస్లో:** నార్వే చెస్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద దూసుకెళ్తున్నాడు. వరల్డ్ చాంపియన్ గుకేశ్‌పై 34 ఎత్తుల్లోనే ఓడించాడు. వరుసగా మూడు విజయాన్ని తన ఖాతాలో నాలుగో రౌండ్‌లో గుకేష్ చేతిలో ఎదురైన పరాజయానికి ప్రజ్ఞానంద బదులు తీర్చుకున్నాడు. ఈ విజయంతో టైటిల్ రేసుకు ప్రజ్ఞానంద చేరువయ్యారు. 15 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. వెస్లే 15.5 పాయింట్లతో అగ్రస్థానంలో, అలిరెజా ఫిరౌజా 14.5 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నారు. గుకేష్8 పాయింట్లతో కొనసాగుతున్నాడు.

## లార్డ్స్ టెస్ట్‌లో బౌలర్ల హావా; పట్టు బిగించిన ఇంగ్లండ్

**లార్డ్స్:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ పట్టు బిగించింది. ఇంగ్లండ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగులకే ఆలౌట్ చేశామన్న ఆనందం న్యూజిలాండ్‌కు ఎక్కువసేపు నిలవలేదు. కివీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగులకే కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోరు 6 వికెట్లకు 61 పరుగులతో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్... ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి ఎక్కువసేపు నిలవలేకపోయింది. న్యూజిలాండ్ జట్టులో కైల్ జేమీసన్ (38 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలవగా.. గ్లెన్ ఫిలిప్స్ (34) పర్వాలేదనిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్‌సన్ 5 వికెట్లతో చెలరేగగా, జోష్ టంగ్ 3, అకిన్‌సన్‌లు రెండు వికెట్లు తీశాడు. దీంతో ఇంగ్లండ్‌కు 27 పరుగుల తొలి ఇన్నింగ్స్ స్వల్ప ఆధిక్యం లభించింది. రెండో రోజు ఆటముగిసే సరికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 166 పరుగులు సాధించింది. జేమీ స్మిత్ (31), అకిన్‌సన్ (7) పరుగులతో క్రీజులో ఉన్నారు. ఓపెనర్ ఎమిలియో గే (57) అర్ధసెంచరీ సాధించాడు. బెన్ డకెట్ (33) పర్వాలేదనిపించాడు.

కివీస్ బౌలర్లలో నాథన్ స్మిత్ మూడు వికెట్లు తీయగా, విలియం రూర్కీ 2 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ 193 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. బౌలర్లకు విపరీతంగా అనుకూలిస్తున్న లార్డ్స్ పిచ్‌పై బ్యాటర్లు క్రీజ్‌లో నిలదొక్కుకోవడం కష్టమే. మరో మూడు రోజులు ఆట మిగిలి ఉండడంతో ఇంగ్లండ్‌కు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# మార్కెట్లకు రెపోరేట్ ఎఫెక్ట్




## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి, జూన్ 5:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గకపోవడం ఆర్థికవృద్ధి అంచనాలు కూడా ఆర్బీఐ తగ్గించడం వంటి వాటి ప్రభావంతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నిర్ణయాల వెల్లడి అనంతరం ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఫలితంగా, బీఎస్‌ఈ సెన్సెక్స్ 116.67 పాయింట్లు క్షీణించి 74,243.34 వద్ద ముగిసింది. అలాగే ఎన్ఎస్‌ఈ నిఫ్టీ 49.85 పాయింట్లు తగ్గి 23,366.70 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో ట్రెంట్ 2.23శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.95శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.52శాతం క్షీణించి మార్కెట్లకు మరికొంత ప్రభావం చూపించాయి. ఇక బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.10శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.01శాతం చొప్పున క్షీణించాయి. మార్కెట్ల పరంగా బిఎస్‌ఇలో 2056 షేర్లు పెరిగితే 2138 షేర్లు క్షీణించాయి. మరో 217 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి మారకం విలువలు 94.94వద్ద కొనసాగాయి. అంతకుముందురోజు 95.7450వరకూ కొనసాగిన సంగతి తెలిసిందే. అమెరికాపదేళ్ల బాండ్లరాబడులు 0.02శాతం క్షీణించి 4.476వద్ద కొనసాగాయి.

కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఆగస్టు నెల సెటిల్‌మెంట్లు 5 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 94.98గా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో ఆగస్టునెల సెటిల్‌మెంట్ పసిడిధరలు 0.86శాతం క్షీణించి రూ.1,58,180వద్ద కొనసాగాయి. వారాంతంలో యూరోపియన్ షేర్లు కూడా గరిష్టస్థాయిలోనే ముగిస్తే ఆసియా షేర్లుమాత్రం స్వల్పంగా క్షీణించాయి. టెక్‌స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు ఆసక్తిచూపారు. ఇకవాల్‌స్ట్రీట్ మార్కెట్లు మిశ్రమంగా ఉన్నాయి. డౌజోన్స్ పారిశ్రామిక సగటు874.86పాయింట్లుపెరిగింది. ఎస్‌అండ్‌పి 500 కూడా 0.41శాతం పెరిగింది. నాస్‌డాక్ కాంపోజిట్ సూచీ మాత్రం 0.09 శాతం క్షీణించింది. దేశీయ స్టాక్స్‌లో టాటా స్టీల్ 1.80శాతం క్షీణించింది. ఎసిఎంఇ సోలార్ 3.12పెరిగితే భెల్ 0.58శాతం క్షీణించింది. లూపిన్ 90.80శాతం పెరిగింది. అలెంబిక్ ఫార్మా 0.12శాతం బజాజ్ ఎలక్ట్రికల్స్ 2.55 శాతం, బ్లూస్ప్రింగ్ ఎంటర్‌ప్రైజెస్ 11.40శాతం చొప్పున పెరిగాయి. ఇక నెఫ్రో కేర్ హెల్త్‌సర్వీసెస్ 2.25శాతం పెరిగాయి. ఇక ఐపిఒల పరంగా హెక్సాగాన్ న్యూట్రిషన్ 1.61రెట్లు ఎక్కువ బిడ్డింగ్ జరిగింది. బిడ్డింగ్ 9వ తేదీ ముగుస్తుంది. ఇష్యూధర రూ.42నుంచి రూ.45గా నిర్ణయించారు. సిఎంఆర్‌గ్రీన్‌టెక్నాలజీస్ కూడా 126.87 రెట్లు బిడ్లు వచ్చాయి. ఇష్యూ ఈనెల 3వ తేదీ ప్రారంభం అయి శుక్రవారంతోముగిసింది. ఐపిఒ ఇష్యూ ధర రూ.182 నుంచి రూ.192గా నిర్ణయించింది.

# ఎన్ఆర్ఐలు, ఒసిఐల పెట్టుబడుల పరిమితి పెంపు

## ఈక్విటీలు పెంచేందుకు ఆర్బీఐ కొత్త నిబంధనలు




**ముంబయి:** భారత స్టాక్ మార్కెట్లో విదేశీ పెట్టుబడులను మరింతగా ఆకర్షించేందుకుఆర్బీఐ తన పాలసీ సమీక్షలో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడులు 4.62లక్షల కోట్లుగా ఉండవచ్చని నిర్ణయించింది. ఎఫ్‌పిఐల ఈ పరిమితి దాటకూడదు. ఇక ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులపరిమితిని రూ.1.53 లక్షలకోట్లుగామొదటి ఆరునెలల కాలానికి నిర్ణయించింది. సెబీ రిజిస్ట్రేషన్ లేకుండానే భారత స్టాక్ మార్కెట్లోని ఈక్విటీ షేర్లలో ఎన్ఆర్ఐలు, ఓసీఐలు పెట్టే పెట్టుబడి పరిమితులను పెంచుతున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ప్రకటించారు.

ద్రవ్య పరపతి సమీక్ష సమావేశం అనంతరం మాట్లాడిన ఆయన ఈ ప్రత్యేక సౌకర్యాన్ని విదేశాల్లో నివసిస్తున్న ఇతర వ్యక్తిగత ఇన్వెస్టర్లకు వర్తింపజేస్తున్నట్లు వెల్లడించారు. దేశంలోకి విదేశీ నిధుల ప్రవాహాన్ని పెంచేందుకు ఆర్‌బీఐ మరికొన్ని ఉపశమన చర్యలను ప్రకటించింది. ప్రభుత్వ బాండ్ల మార్కెట్లోకి విదేశీ మూలధనాన్ని తీసుకురావడానికి ఫుల్లీ యాక్సెస్డ్ రూట్ (ఎఫ్ఏఆర్) కింద 15, 30, 40 సంవత్సరాల కాలపరిమితి గల కొత్త ప్రభుత్వ సెక్యూరిటీలను కూడా చేర్చుతున్నట్లు గవర్నర్ తెలిపారు. జనరల్ రూట్ కింద విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లపై ఉన్న స్వల్పకాలిక పెట్టుబడి పరిమితులు, ఇతర నిబంధనలను పూర్తిగా తొలగిస్తున్నట్లు చెప్పారు.

కేంద్రం ప్రకటించిన పన్ను మినహాయింపులు, ఆర్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయాలతో దేశంలోకి విదేశీ పెట్టుబడులు భారీగా రావడానికి సహాయపడతాయని సంజయ్ మల్హోత్రా ఆశాభావం వ్యక్తం చేశారు. ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయాన్ని వెనక్కి తీసుకురావడానికి గల కాలపరిమితిని తిరిగి తొమ్మిది నెలలకు పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. భారత విదేశీ మారకపు రేట్ల విధానంలో ఎలాంటి మార్పులు లేవని రూపాయి విలువను మార్కెట్ శక్తులే నిర్ణయిస్తాయని గవర్నర్ స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిరతల వల్ల ఒక్కోసారి మార్కెట్లో అంచనాలకు భిన్నంగా తీవ్ర ఒడుదొడుకులు వచ్చే అవకాశం ఉందని గవర్నర్ చెప్పారు. అలాంటి సమయాల్లో ఆర్థిక కార్యకలాపాలు దెబ్బతినకుండా ఆర్‌బీఐ కచ్చితంగా రంగంలోకి దిగి మార్కెట్‌ను నియంత్రిస్తుందని వివరించారు. తమ లక్ష్యం మార్కెట్ ఆధారిత మార్పులను అడ్డుకోవడం కాదని, కేవలం అస్తవ్యస్తమైన కదలికలను అదుపు చేయడమేనని స్పష్టం చేశారు

## 682 బిలియన్ డాలర్లకు ఫారెక్స్ ఖజానా

**ముంబయి, జూన్ 5:** భారత్ విదేశీ కరెన్సీ ఖజానా నిల్వలు 938 మిలియన్ డాలర్లుపెరిగి 682.321 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు ఆర్బీఐ వెల్లడించింది. గతనెల 28వ తేదీతో ముగిసిన వారంలో నిల్వలు కొంత మేర పెరిగాయని వివరించింది. అంతకుముందు వారిలో 7.511 బిలియన్ డాలర్లు తగ్గి 681.384 బిలియన్ డాలర్లుగా ఉన్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27వ తేదీతోముగిసిన వారంలో ఫారెక్స్ కిట్టీ ఒక్కసారిగా ఆల్‌టైమ్ గరిష్టానికి పెరిగింది. 728.494 బిలియన్ డాలర్లకు చేరింది. మధ్యప్రాచ్యం ఉద్రిక్తతల ప్రభావంతో కొన్ని వారాలపాటు రూపాయి క్షీణత కొనసాగడంతో ఒత్తిళ్లు ఎదురయ్యాయి. విదేశీ కరెన్సీ వినియోగాన్ని కట్టడిచేసేందుకు ప్రధానిమోడీ పదేపదే పొదుపుమంత్రం పఠించిన సంగతి తెలిసిందే. విదేశీ ప్రయాణాలు తగ్గించాలని, ఇంధన వినియోగం తగ్గించాలని, బంగారం కొంతకాలం కొనవద్దంటూ సూచనలుచేసిన సంగతి తెలిసిందే. ఆర్బీఐ విదేశీ ఖజానా పటిష్టతకే ఇదంతా జరిగింది. ఇక విదేశీ కరెన్సీ ఆస్తులపరగా అయితే నిల్వలు 3.116 బిలియన్ డాలర్లు పెరిగి 546.148 బిలియన్ డాలర్లకు చేరాయి. కరెన్సీ ఆస్తులు అంటే డాలరేతర కరెన్సీలు యూరో, పౌండ్,యెన్ వంటి కరెన్సీల హెచ్చుతగ్గుల విలువలను కరెన్సీ ఆస్తులుగా పరిగణిస్తారు. ఇక బంగారం నిల్వలు మాత్రం 2.186 బిలియన్‌డాలర్లు క్షీణించి 112.6 బిలియన్ డాలర్లకు చేరాయి. ఎస్‌డిఆర్‌లు కూడా స్థిరంగా 18.747 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. ఇక ఐఎంఎఫ్ వద్ద భారత్ రిజర్వు స్థాయి 8 మిలియన్ డాలర్లు పెరిగి 4.826 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు తేలింది.






## ప్రాథమిక దశలోనే ప్లాస్టిక్ కరెన్సీ

**ముంబయి, జూన్ 5:** ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు చలామణిలోకి రాబోతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టతనిచ్చారు. ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్న మాట వాస్తవమేనని, అయితే ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని అన్నారు. దేశంలో పేపర్ కరెన్సీ వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, ప్లాస్టిక్ నోట్లను తీసుకురావడానికి గల సాధ్యాసాధ్యాలపై ఆర్‌బీఐ కసరత్తు చేస్తోంది. కాగితపు నోట్ల ముద్రణకు భారీగా ఖర్చు అవ్వడం, అవి త్వరగా పాడైపోయి చలామణి నుంచి తొలగించాల్సి రావడం వంటి కారణాల వల్లే ఈ ప్రత్యామ్నాయంపై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్లాస్టిక్ నోట్ల వల్ల కలిగే ప్రయోజనాలు, వాటి వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సాంకేతిక, ఆపరేషనల్ సమస్యలపై ఆర్బీఐ నిపుణులు అధ్యయనం చేస్తున్నారు. నిజానికి, ప్లాస్టిక్ నోట్ల ప్రస్తావన ఈనాటిది కాదు. 2014 ఫిబ్రవరిలోనే కేంద్ర ప్రభుత్వం దీనిపై పార్లమెంటుకు సమాచారం అందించింది. భౌగోళిక, వాతావరణ వైవిధ్యాలను పరీక్షించడానికి దేశవ్యాప్తంగా ఐదు నగరాలను (కొచ్చి, మైసూర్, జైపూర్, సిమ్లా, భువనేశ్వర్) ఎంపిక చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా రూ. 100 కోట్ల విలువైన ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టాలని భావించారు. అప్పట్లో కొన్ని సాంకేతిక, నిర్వహణ లోపాల వల్ల ఈ ప్రాజెక్టు తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇప్పుడు ఆర్‌బీఐ మళ్లీ ఈ ఫైల్‌ను కదిలించడంతో త్వరలోనే దేశంలో ప్లాస్టిక్ నోట్లు అందుబాటులోకి వస్తాయనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

# రెపోరేట్ల జోలికి వెళ్లని ఆర్బీఐ

## 5.25% వద్దనే కొనసాగించాలని ఎంపిసీ ఏకాభిప్రాయం

**ముంబయి, జూన్ 5:**భారతీయ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య పరపతి విధాన కమిటీ ఎంపీసీ రెపో రేట్లను యధాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. మార్కెట్ వర్గాల అంచనాలకు అనుగుణంగానే పాలసీ రెపో రేటును 5.25 శాతం వద్ద కమిటీ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూన్ 3 నుంచి 5 వరకు మూడు రోజుల పాటు జరిగిన సమావేశం అనంతరం ఆర్‌బీఐగవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ నిర్ణయాలను శుక్రవారం ప్రకటించారు. ఈనిర్ణయంతో స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటు 5శాతం, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్) రేటు, బ్యాంక్ రేటు 5.5శాతంగా కొనసాగుతాయి. దేశ ఆర్థిక వ్యవస్థలోని తాజా పరిస్థితులు, భవిష్యత్ అంచనాలను క్షుణ్ణంగా సమీక్షించిన తర్వాతే కమిటీ ఈ నిర్ణయం తీసుకుందని గవర్నర్ వివరించారు. మరోవైపు, ఆర్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను తగ్గించింది. గతంలో 6.9 శాతంగా అంచనా వేయగా, ప్రస్తుతం 6.6 శాతానికి సవరించింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్త తలు, సరఫరా గొలుసులోఅంతరాయాలు పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ద్రవ్యోల్బణంపై హెచ్చరిక ద్రవ్యోల్బణం గురించి మల్హోత్రా మాట్లాడుతూ, ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) తక్కువగానే ఉన్నప్పటికీ, మూడో త్రైమాసికంలో ఇది ఆర్‌బీఐ గరిష్ఠ సహన పరిమితికి చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ ఏడాది సాధారణంకంటే తక్కువవర్షపాతం నమోదయ్యే సూచనలు, ఎల్ నినో ప్రభావం వంటి అంశాలు ద్రవ్యోల్బణానికి ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని హెచ్చరించారు. అయితే, కీలకమైన టోకు ద్రవ్యోల్బణం 3.7శాతం వద్ద స్థిరంగా ఉండటం కొంత ఊరటనిచ్చే అంశమని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగాపటిష్టంగా ఉందని, ప్రైవేట్ వినియోగం వృద్ధికి మద్దతుగా ఉందని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా సవాళ్లు ఉన్నప్పటికీ సేవల ఎగుమతులు బలంగా ఉంటాయని, వస్తు ఎగుమతులు కూడా వృద్ధిని నమోదు చేస్తున్నాయని, అయితే, పెరుగుతున్న వ్యయాల ఒత్తిడి వివిధ రంగాలపై ప్రభావం చూపుతోందని అంగీకరించారు.






## అంబానీని దాటేసిన
# చైనా బిలియనీర్

**బీజింగ్, జూన్ 5:** సంపదలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని చైనాకు చెందిన టిక్‌టాక్ వ్యవస్థాపకుడు ఝూంగ్‌యిమింగ్ వెనక్కి నెట్టారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లో జాంగ్ నికర ఆస్తి విలువ 92.8 బిలియన్ డాలర్లకు చేరింది. ముకేశ్ అంబానీ 86.9 బిలియన్ డాలర్లతో మూడో స్థానానికి పడిపోయారు. ఝూంగ్ ఆసియాలోనే రెండో అత్యంత ధనవంతుడిగా, చైనాలోనే నంబర్1 కుబేరుడిగా అవతరించారు. ప్రస్తుతం ఈ జాబితాలో భారత్‌కు చెందిన గౌతమ్ అదానీ 117.4 బిలియన్ డాలర్లు అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

చైనాలోని ఫుజియాన్ ప్రాంతంలో జన్మించిన 43 ఏళ్ల ఝూంగ్ యిమింగ్ నాంకై విశ్వవిద్యాలయం నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థల్లో పనిచేసిన ఆయన 2012లో బీజింగ్‌లోని ఓ చిన్న అపార్ట్‌మెంట్ రూమ్ నుంచి బైట్‌డ్యాన్స్ కంపెనీని ప్రారంభించారు. కేవలం అల్గోరిథమ్స్ ఆధారంగా యూజర్లకు నచ్చిన కంటెంట్‌ను అందించే టౌటియావో అనే న్యూస్ ప్లాట్‌ఫామ్‌ను ఝూంగ్‌యిమింగ్ తెరిచారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.